ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Regd. No. M 4479



4 అణాలు

22-8-'51

శ్రీమదాంధ్ర

మహాభారతము

ఉద్యోగ పర్వము

వెల ఒకరూపాయి

త్వరలో వచ్చుచున్నది.

టామ్ సాయర్

(పిల్లల నవల)

రచన:

మార్క్ ట్వేన్

అనువాదం

నండూరి రామమోహనరావు

వెల రు 2/- పోస్టుఖర్చులు ప్రత్యేకం

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికనుండి పునర్ముద్రితము.

కాపీలకు

ఆంధ్ర గ్రంథమాల,

నెం. 7 తంబుచెట్టివీధి, మద్రాసు 1.



ఆంధ్ర, సీడెడ్, నైజాంలలో
విజయవంతముగ
ప్రదర్శింపబడుచున్నది
స్త్రీ సాహసము
....దర్శకత్వం....
వేదాంతం రాఘవయ్య
రచన..పర్యవేక్షణ.... సముద్రాల.... సంగీతం... సుబ్బరామన్
ఛాయ... బి.యస్.రంగా... కళ... వాలి & గోడగాంకర్

విషయానుక్రమణిక

22 ఆగస్టు 1951

రచయితలకు మనవి

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికలో ప్రచురించే నిమిత్తమై వందలాది రచయితలు ప్రతినెలా వెయ్యికిపైగా వ్యాసాలు పంపుతున్నారు దీనివల్ల ప్రచురించని వ్యాసాలు దాచిఉంచటంలోనూ, ప్రచురణకుగాను స్వీకరించిన వ్యాసాలు వెంటనే ప్రచురించటంలోనూ ఇబ్బంది కలుగుతున్నది అందరి సౌకర్యార్థమూ ఈ క్రింది నియమాలను రచయితలు పాటించవలెనని ప్రార్థించుచున్నాము.

(1) తాము పంపే వ్యాసాలు ప్రచురించని పక్షంలో తిప్పిపంపటానికీ, ప్రచురించే పక్షంలో తెలియజేయటానికీ వీలుగా స్టాంపులు జతచేర్చి పంపేది. లేదా రచనల కాపీలు తమవద్ద ఉంచుకొనేది పోస్టుబిళ్లలు జతపరచని రచనలు తిప్పిపంపబడవు.

(2) దయచేసి వ్యాసాలు (Essays) గాని అనువాదాలుగాని పంపవద్దు

(3) "బొమ్మరిల్లు" శీర్షికకు పంపే రచనలపై "బొమ్మరిల్లు" అని వ్రాసేది.

—సంపాదకుడు.

సవరణ

బొమ్మరిల్లు భాగంలో (32, 33 పేజీలలో) "వెస్సంతర జాతకం," "ప్రతిజ్ఞ" అనే కథలశీర్షికలు, బొమ్మలుఒకదానికొకటి తారుమారైనందుకు విచారిస్తున్నాము

—సంపాదకుడు

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా
రు 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును

Founder. K NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 49
22-8-51

ఖర సంవత్సర శ్రావణ బహుళ షష్టి బుధవారము

నెహ్రూ: కాంగ్రెస్ ★ [సీతారామ్] ★

కాంగ్రెస్ కార్యవర్గంనించీ, ఎన్నికల సంఘంనించీ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ తన సభ్యత్వానికి రాజీనామా ఇవ్వడంతో, కాంగ్రెస్ సంస్థ ఎట్టి క్లిష్టస్థితిలో ఉన్నదో మరింత స్పష్టపడింది ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వం (పార్లమెంటరీ డెమోక్రసీ) అమలులో కలదేశాలలో రాజకీయ పక్షాలకు ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కావడం సహజమే అయితే, భారతదేశంలో కాంగ్రెస్‌పార్టీకీ, మిగతా దేశాలలో రాజకీయ పార్టీలకీ ముఖ్యమైన వ్యత్యాసం ఒకటుంది కాంగ్రెస్ మనదేశంలోని సర్వ వర్గాలవారికీ, సర్వ మతాలవారికీ, ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చింది పెట్టుబడిదారీ వర్గాలకు, కార్మిక వర్గాలకు, భూస్వాములకు, రైతులకు, కూలీలకు అందరికీ వర్గవ్యత్యాసాలతో నిమిత్తం లేకుండా ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చింది ఈకారణంవల్ల పరిపాలనలోనూ, రాజకీయ బాధ్యతల నిర్వహణలోనూ అనేక క్లిష్ట సమస్యలు ఏర్పడ్డాయి కాంగ్రెస్‌లో కలతలకు కేవలం ఇదే హేతువు కాకపోయినా, ఇదికూడా ఒక ముఖ్య హేతుగని గమనించక తప్పదు కాంగ్రెస్‌లో కక్షలు మతవర్గాది వ్యత్యాసాలను బట్టి ఏర్పడక పోయినా, రాజకీయ పక్షంగా కాంగ్రెస్ బలహీన పడ్డానికి ఇదొక ముఖ్యకారణం దీనితోపాటు ఆర్థిక సమస్య, శరణార్థుల సమస్య, పాకిస్తాన్‌తో వ్యవహారాలు, అమెరికా, చీనా దేశాలతో వ్యవహార బాంధవ్యాలు, పరిపాలనావిధానం మొదలైన వానివల్ల కాంగ్రెస్‌లో వివిధ నాయక వర్గాలమధ్య భేదాభిప్రాయాలు వచ్చాయి అయితే ఇవేవీ కాంగ్రెస్‌లో కక్షలకు తక్షణ కారణాలు కాలేదు

కాంగ్రెస్‌సంస్థ ఎప్పటిమాదిరిగా సర్వ వర్గాల క్షేమాన్నీ కోరి, అందరికీ ప్రాతినిధ్యం వహించగల సంస్థగా వర్థిల్లాలంటే, సంస్థ నియమాలే రీతిగా ఉండాలి, ఏ విధంగా అవి అమలుజరగాలి, అభిప్రాయ భేదాల కెంతవరకూ తావివ్వవచ్చును, అనే సమస్యలపట్ల ఆయా నాయకవర్గాలు అవలంబించిన విధానాలు కక్షలకు తక్షణ కారణాలైనాయి అయితే ఈ తక్షణ కారణాలకూ, దీనివల్ల సంభవించిన కక్షలకూ పైన చెప్పబడిన దేశీయసమస్యలు అంతర్భూతమై ఉన్నమాటమాత్రం మరిచిపోకూడదు

నాసిక్ సమావేశంలో పండిట్ నెహ్రూ పరిపాలనా వ్యవహారాలనన్నిటినీ కాంగ్రెస్ ఏకగ్రీవంగా ఆమోదించింది ఈనాడైనా కాంగ్రెస్ కార్యవర్గంకాని, ఆలిండియా కాంగ్రెస్ కమిటీకాని నెహ్రూ పాలనా విధానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించగలవు పరిపాలనా విధానాలను గురించిన అభిప్రాయభేదాలు పైకి పొక్కినట్లయితే, కాంగ్రెస్ నెహ్రూనే బలపరుస్తుంది కాని మరే వర్గాన్నీ బలపరచదు ఇటువంటి పరిస్థితిలో, కాంగ్రెస్ సంస్థ నాయకత్వం తనకు అనుకూలంగా లేదని పండిట్ నెహ్రూ భావించినట్లయితే, ప్రస్తుత కార్యవర్గాన్ని తొలగించి వారే నాయకత్వం వహించడం ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ పక్షాల నియమాల ప్రకారం సమ్మతమే అవుతుంది ఇటువంటి అవకాశం పండిట్ నెహ్రూకు బెంగుళూరు సమావేశంలో లభించినప్పటికీ, ఎన్నికలలో గెలిచిన కాంగ్రెస్ అధ్యక్షుని తొలగించడం వారికి సమ్మతం కాలేదు

కాంగ్రెస్ జాతీయ సంస్థగా, సర్వ వర్గాలకూ ప్రాతినిధ్యం వహించగల సంస్థగా వ్యవహరించాలంటే, కాంగ్రెస్ విధానాలను సూచించవలసిన కార్యవర్గంలో అన్ని కక్షలవారికీ వారివారి బలాబలాలనుబట్టి, స్థానం ఇవ్వాలని పండిట్ నెహ్రూ కోరిక కాంగ్రెస్ ఎన్నికలలో అక్రమాలూ అన్యాయాలూ అన్ని వర్గాలవల్లనూ జరిగాయి కాబట్టి ఆ అక్రమాలను గురించి విచారణ జరపాలని కృపలానీ వర్గం కోరినప్పుడు పండిట్ నెహ్రూ సమ్మతించలేదు అదేరీతిగా, అన్యవర్గాలకు చోటివ్వకుండా తన వర్గంతోనే టండన్‌గారు నిర్మించిన కార్యవర్గం కేంద్ర మంత్రివర్గ నిర్మాణ విషయమై జోక్యం చేసుకోడానికి యత్నించినప్పుడు నెహ్రూ సమ్మతించలేదు

కాంగ్రెస్‌నే కాక దేశమంతటినీ కూడ గట్టుకుని రాగల నెహ్రూ విశ్వాసాన్ని కాంగ్రెస్‌అధ్యక్షుడూ, కార్యవర్గమూ పొందవలసిన అగత్యం ఉంది త్వరలో జరగనున్న ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశం కాంగ్రెస్ కార్యవర్గానికీ పండిట్ నెహ్రూకూ మధ్య సామరస్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తుంది ★

డైరీ

ఆదివారం, ఆగస్టు 12 :

—అన్ని వర్గాలవారికీ అంగీకారం కుదిరిన చోట్ల భాషారాష్ట్రాలను నిర్మించేందుకై సరిహద్దు సంఘమును ఏర్పాటు చేయవలసిందని కాంగ్రెసు కార్యవర్గం భారత ప్రభుత్వాన్ని కోరింది

—పాకిస్థాన్ ప్రధాని లియాకతాలీఖాన్ పండిట్ నెహ్రూకు తిరుగు సమాధానం పంపిస్తూ ఆజాద్ కాశ్మీర్‌లో తాము కొత్త సైన్యాలను చేర్చడం లేదన్నారు

—కాంగ్రెసునుండి రాజీనామా లిచ్చిన శాసనసభ్యులు శాసనసభలకు కూడా రాజీనామా ఇవ్వవలసిన అవసరం నైతికంగా గాని, రాజ్యాంగరీత్యా గాని లేదని ఆచార్య కృపలానీ అన్నారు

—తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర కళాశాలకు చెందిన నూత్న భవనములను మద్రాసు ముఖ్యమంత్రి పి ఎస్ కుమారస్వామిరాజా తెరిచారు

—తూర్పు సుమత్రాలో విప్లవకారులని అనుమానింపబడుతున్న 'వందలాది వ్యక్తులను ఇండోనీషియన్ ప్రభుత్వం అరెస్టు చేసింది

—"పాకిస్థాన్‌పై ఇండియా చేస్తున్న యుద్ధప్రచారం" అనే శీర్షికతో పాకిస్థాన్ ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించింది

సోమవారం, ఆగస్టు 13 :

—నెహ్రూ కాంగ్రెసు కార్యవర్గానికిచ్చిన రాజీనామా ఫలితంగా ఏర్పడిన క్లిష్టస్థితిని తొలగించడానికి నెహ్రూ, టాండన్‌లు కలిసి చర్చ జరపాలని కార్యవర్గంవారు కోరారు

—రాష్ట్రాలు, కేంద్రము తలపెట్టిన అభివృద్ధి స్కీములకు ధన సేకరణకోసమై వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తులపై ఆస్తి పన్నులు విధించడానికి భారతప్రభుత్వం ఆలోచిస్తున్నది

—వేరుసెనగపై ఎగుమతి పన్నును టన్నుకు 80 రూ. నుండి 150 రూ. లకు హెచ్చించడానికి పార్లమెంటు అంగీకరించింది

—తూర్పు బెంగాల్‌లో అల్పసంఖ్యాకుల్లో ఏర్పడిన భయోద్రిక్త పరిస్థితికి అక్కడి అధికారుల చర్యలే కారణమని సోదాహరణంగా నిరూపిస్తూ భారత ప్రభుత్వం కరాచీకి లేఖ వ్రాసింది

—పెట్రోలు తగాదాను అంతంచేసే ఉద్దేశ్యంతో బ్రిటిష్ ప్రతినిధి రిచర్డుస్టోక్సు పర్షియన్లకు ఒక నూత్న పథకం ప్రతిపాదించారు

—శాన్‌ఫ్రాన్సిస్కోలో సెప్టెంబరు 4న ప్రారంభం కానున్న జపానీస్ సంధి ఒడంబడిక సమావేశానికి హాజరు కావలసిందని అమెరికా ఆహ్వానించగా సోవియెట్ యూనియన్ అంగీకరించింది

మంగళవారం, ఆగస్టు 14 :

—టాండన్, నెహ్రూ సంభాషణలు విఫలమయ్యాయి

—నిరుడు మద్రాసు ప్రభుత్వం నియమించిన భూమిశిస్తు సంస్కరణల సంఘం తన రెండవ నివేదికను సమర్పించింది

బుధవారం, ఆగస్టు 15 :

—రష్యా, ఇండియా చేసిన విమర్శలను తృణీకరిస్తూ జపానీస్ సంధి ఒడంబడిక ఆఖరు ముసాయిదాను బ్రిటన్, అమెరికాలు ప్రకటించాయి

—బ్రిటిష ప్రతినిధి రిచర్డుస్టోక్సు పర్షియన్ ప్రతినిధులను తిరిగి కలుసుకుని తన నూత్న పథకంలోని అంశాలను విశదీకరించాడు

—తూర్పు యూరప్‌తో తాను వ్యాపార సంబంధాలు రద్దుచేసుకోనని బ్రిటన్ అమెరికాకు స్పష్టంచేసింది

—దేశీయులంతా ఐకమత్యంతో, దృఢ నిశ్చయంతో ప్రస్తుత ప్రమాదాల నెదుర్కోవాలని పండిట్ నెహ్రూ ఎర్రకోట వద్ద జాతీయ జెండా నెగురవేస్తూ ఉద్బోధించారు

గురువారం, ఆగస్టు 16 :

—శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశంలో జపాన్ సంధి ఒడంబడికపై సంతకాలు మాత్రమే జరుగుతాయిగాని, చర్చలు జరగటానికి వీల్లేదని అమెరికా రష్యాకు స్పష్టం చేసింది.

—కాశ్మీరు యెడల పాకిస్థాన్ అనుసరించే విధానం ఇండియాలోని 4 కోట్ల మంది ముస్లిములకు అపాయకరంగా తయారవుతోందని నిరసిస్తున్న ఒక విజ్ఞాపనను భారత ముస్లిముల తరఫున 14 గురు ముస్లిమ్ నాయకులు సమితి ప్రతినిధి డా॥ గ్రాహంకు సమర్పించారు.

—నెహ్రూ రాజీనామాను గూర్చి చర్చించే నిమిత్తం ఏ ఐ సి సి. సమావేశం నాగపూర్‌లో సెప్టెంబరు 8,9 తేదీల్లో జరుగుతుంది

—రైల్వేలకు, కార్మికులకు సంబంధించిన అయిదువిషయాలపై చర్చించడానికి రైల్వేమంత్రి గోపాలస్వామి అయ్యంగార్ అఖిల భారత రైల్వే కార్మిక ఫెడరేషనువారికి ఆహ్వానం పంపారు.

శుక్రవారం, ఆగస్టు 17 :

—పంజాబ్ సభ్యులలో అధిక సంఖ్యాకులకు ఆమోదయోగ్యంగాఉండేరూపంలో పంజాబ్ శాసనసభబిల్లును పార్లమెంటు ఆమోదించింది దీని ప్రకారం భారతాధ్యక్షుడు స్వయంగా పంజాబ్ రాష్ట్ర శాసనాలను చేస్తారుగాని రాష్ట్ర గవర్నరుకు ఆ అధికారం అప్పగించరు

—కేసాంగ్ చర్చలను ప్రతిష్ఠంభింపజేసిన తటస్థ ప్రాంతనిర్ణయ విషయంలో తమ మట్టుకు తాము సమాధానానికి సిద్ధంగానే ఉన్నామని సమితివారు, కమ్యూనిస్టులుకూడా వేర్వేరు ప్రకటనలు చేశారు

—వ్యక్తిగతంగా గాని సమష్టిగా గాని జరిగే దౌర్జన్య చర్యలు కమ్యూనిస్టు పార్టీ విధానానికి విరుద్ధమని పార్టీ నాయకుడు ఎ కె గోపాలన్ ప్రకటించారు

—ఈజిప్టు సంరక్షణలో బ్రిటన్ బాధ్యత నివ్వ నిరాకరించడం మంచిదికాదని బ్రిటిష్ ప్రభుత్వం ఈజిప్టును ఒత్తిడిచేస్తూ ఒక లేఖపంపింది

(46-వ పేజీ చూడండి)

సీరియల్ నవల:

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

51

ఫాబర్గ్ సెంట్ ఆనర్ వీధి మధ్యలో, విల్ ఫర్ట్ భవనానికి వెనుకతట్టున విశాలమైన తోట ఒకటుంది తోటచుట్టూ ఎత్తైన ప్రాకారం, ఒక పేద్వారం వున్నాయి కాని ద్వారం ఎన్నడూ వాడనందువల్ల ఇనుపకవాటాలు తుప్పుపట్టి ఉన్నాయి విల్ ఫర్ట్ భవనంలోని వారెవరూ ఈతోటలో సంచరించరు తోటలో ఒక ప్రక్క సందొకటి ఉంది ఈసందు నే విస్తరింపచేసినట్లయితే తోట మేరంతా గృహ నిర్మాణంనిమిత్తం ఎక్కువ ధరకి అమ్మివెయ్యవచ్చునని తోటయజమాని ఆశించినట్లున్నాడు కాని మన మొకటి తలిస్తే ద్రవ్యమొకటి తలుస్తుందనే విషయం వ్యాపారులికి బాగా అనుభవమే ద్రవ్యం అటువంటి ద్రోహమే చెయ్యడంవల్ల తోట యజమాని ఆశలు భగ్నమైనాయి దాంతో ఆ మేరంతటినీ యజమాని చిన్న చిన్న ఖండాలుగా విభజించి తోటలు పెంచేవారికి అద్దెకిచ్చాడు అయినా ఇదీ లాభించినట్లులేదు తోటపెంపకంకూడా సాగడంలేదని ఇప్పుడా ప్రదేశం చూస్తే బోధపడుతుంది ఒకపక్క పెద్ద నేరేడుచెట్ల గుబురులచాటున శిలావేదికలు కొన్ని అమర్చబడిఉన్నాయి ఇవి ఎవరి ఉపయోగానికి నిర్దేశించబడినాయో తెలియదు కాని ఏకాంతం కోరేవారికి అనుకూలంగా మాత్రం ఉంది ఇక్కడ కూర్చున్నవారు భవనంలోకి గాని తోటలోకిగాని కనపడరు

ఒకనాటి సాయంకాలం తరుణవయస్సులోఉన్న ఒక యువతి భవనందాటి తోట ప్రాకారంవద్దకు ఆత్రుతతో పరుగెత్తి వచ్చింది అదే సమయానికి యౌవనం పరిపూర్ణంగా వికసించిన ఒక యువకుడు ప్రాకారానికి అవలివైపుకు వచ్చాడు ఇద్దరూ ద్వారంవద్దకు చేరారు ఇద్దరికీమధ్య ఇనుప కవాటం ఒకటే ఆటంకం కాని యువతి కవాట రంధ్రాలలోనుంచి యువకుని గమనించి మొదట భీతిచెంది వెనుతిరిగి వెళ్ళిపోనారంభించింది యువకుడు ఆవలిప్రక్కనుంచి నవ్వి ఇలా అన్నాడు: వాలంటిన్! వెళ్ళకు వెళ్ళకు—నేనే" యువతి ఆగి మెల్లిగా వెనక్కు తిరిగింది కవాటం సమీపించింది "ఇవాళ ఇంత ఆలస్యమయిందేం? ఆ బికారి దుస్తులేమిటి? నిన్ను మొదట గుర్తుపట్టలేకపోయానుసుమా!"

"వాలంటిన్! నువ్వెక్కడ, నేనెక్కడ! నీతో ప్రేమాలాపాలకు జంకుతున్నానుసుమా! అయినా నిన్ను చూడకుండా ఉండలేను నేనెందు కాలస్యంగా వచ్చానో ఈ దుస్తుల కర్థమేమిటో దాపరికం లేకుండా నీకు చెప్తాను—నువ్వు క్షమించగలవని నాకు మాటఇస్తే నేను కొత్తవృత్తిలో ప్రవేశించాను. నేనిక నించి తోట పెంచుతున్నాను"

"పరిహాసాలు కట్టిపెట్టు మాక్సిమిలియన్"

"పరిహాస మనకు వాలంటిన్ నా జీవితంలోకల్లా నేను చేసిన తెలివైన పని ఇదొక్కటే తోటపనిలో చేరితే ఇంక నిన్ను నేను నిత్యం కలుసుకోవచ్చు మనల్ని ఎవరూ కనిపెట్టకుండా జాగ్రత్త పడవచ్చు"

"చాలింక, ఇదంతా ఆపి నాకు నిజం చెప్పు"

ఈ తోట అద్దె కిస్తారని తెలిసి నేను తీసుకున్నాను ఇక్కడ నే నొక చిన్న కుటీరం నిర్మించుకుంటాను నీకు ఇరవై గజాల దూరంలోనిత్యం నీ పిలుపులో ఉండగల నింక—ఈ పేద కృషికునితో మైత్రి నీకు అనిష్టం కాకుంటే"

యువతి కిది నిజమని తట్టగానే ఆశ్చర్యసంభ్రమాలామెను పెనగొన్నాయి కాని మరుక్షణంలోనే శంకాకులిత కంఠస్వరంతో ఇలా అంది "ఇది లాభంలేదు మాక్సిమిలియన్ నాకు నమ్మకంలేదు ఇది వివేకం కాదేమోనని నాకు తట్టుతోంది అంతా మనకి అనుకూలంగా ఉంటుందని మనం భ్రమపడుతున్నాం అదీకాక మన మనస్సులు మారవని నమ్మక మేముంది?"

"అదేంమాట వాలంటిన్ అటువంటి సందేహం న్యాయం కాదు నీ కేదో ముప్పు వాటిల్లుతుందని భయపడుతున్నట్లు చెప్పగానే నిన్ను రక్షించడానికి నా ప్రాణాలైనా అర్పిస్తానని నేను మాటివ్వలేదా?"

"నిజమే" అంటూ యువతి కొంతసేపు ఆలోచించింది కవాటరంధ్రాలగుండా తన వేళ్లు చొనిపింది యువకుడు అత్యాకాంక్షతో చుంబించాడు "నిజమే నువ్వే నా ప్రాణమిత్రుడవ్" అంది వాలంటిన్ "నువ్వు తప్ప నాకీ ప్రపంచంలో స్నేహపాత్రులైనవా రెవరూ లేరు నాగతెల్లాగుందో నా తండ్రి పట్టించుకోడు నా సవతితల్లి పోరుపడలేకుండా ఉన్నాను మాటలేక కేవలం కన్నులతో మూగభాష మాట్లాడే తాత పక్షవాతంతో మంచాన పడిఉన్నాడు తాతకి నాపట్ల ఆపేక్ష ఉండవచ్చును నిజంగా నా స్థితి అతి దీనంగా ఉంది మాక్సిమిలియన్ కేవలం నాపట్ల దాక్షిణ్యంతో నన్ను ప్రేమిస్తున్నావు"

"అల్లా అనకు వాలంటిన్! నిన్ను ఎపినే కొడుకు ఫ్రాంజ్ కి ఇచ్చి పెళ్లిచెయ్యాలని నీతండ్రి ప్రయత్నిస్తున్నాడు ఫ్రాంజ్ ఈదేశానికి రావడానికింకా ఏడాదిగగువుంది ఈలోగా మనకి అనుకూలమైన అవకాశాలే లభించవా? నువ్వు నాదృష్టికి దేవతవలె కనపడుతున్నావు నిజంగా నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నువ్వు గ్రహించినట్లయితే పోనీలే, నేనేదో ఒళ్లు తెలియని ఆ వేళంలో అనకూడనిమాట లన్నట్లయితే క్షమించు వాలంటిన్"

"లేదు లేదు కాని నేనెంత నిస్సహాయంగా ఉన్నానో నువ్వు గ్రహించలేవా మాక్సిమిలియన్? నాయింట్లో నన్నందరూ అత్యంతప్రీతితో ఆదరిస్తున్నారని అందరూ అనుకుంటారు కాని పరిస్థితి అంత విరుద్ధంగా ఉంది నా సవతితల్లి పైకి నవ్వుతూనే ఉంటుంది కాని లోలోపల నాపైన ద్వేషం ఇంతంత కాదు"

"నీపైన ద్వేషమా? నీపైన ఎవరికైనా ద్వేషం ఉంటుందా వాలంటిన్?"

పితారావ్

"ఏమో ఏం చెప్పగలం ? నాతల్లి వల్ల నాకు లభించిన ఆస్తిని చూస్తే సవతితల్లికి అసూయ నా తల్లితండ్రి గతిస్తే అంతకి రెట్టింపు సంపద నాకు సంక్రమిస్తుందిట నా తండ్రి ఆపేక్షఉంటే నాకే ఆస్తి అక్కరలేదు నాకు ఇంట్లో సుఖంకోసం నా ఆస్తి అంతా వొదులుకోమన్నా సంతోషంతో వొదులుకుంటాను "

"కాని నీకింత విచార మెందుకు వాలంటిన్ ముందంతా ఏదో ముప్పు కని పెట్టుకుని ఉన్నట్లు ముంగుకు మాట్లాడతావ్ ?"

"ఇదివరలో జరిగినదాన్ని బట్టి భయపడుతున్నాను మాక్సిమిలియన్ "

"అయినా నీకీ భయం అనవసరం నీకు నేను తోడున్నాను నీ కోసం నా ప్రాణాలైనా అర్పించడానికి సిద్ధంగా ఉన్నాను నా తండ్రి మార్సెల్స్ నివాసి నువ్వు మర్సెల్స్‌లో పుట్టావు మీ కుటుంబానికి మా కుటుంబాన్ని తెలుసును ప్రతిష్ఠలో కాని మరెందులో కాని మా వంశం మీ వంశానికి తీసిపోయిందేమీ కాగు నా తండ్రి ఎంతటి నీతిపరుడో సచ్చరిత్రుడో మీ తండ్రి తత లందరికీ తెలుసు "

"అవునవును నీకు లీజన్ ఆఫ్ ఆనర్ పతకాన్ని ప్రభుత్వం బహూకరించినప్పుడు మా యింట్లో నీ తండ్రిగురించి ప్రసక్తి వచ్చింది అప్పుడు నీ తండ్రిని నా తండ్రిని విమర్శించారు కాని నా తాతగారు ప్రశంసించారు ఇది చిత్రంగా లేదా ?"

"ఉండవచ్చును నీ తండ్రి రాజభక్తిపరుడు నీ తాతగారు నెపోలియన్ పక్షపాతి నా తండ్రి కూడా నెపోలియన్‌పక్షపాతి ఆ రోజుల్లో నీ తాతగారి పేరుచెప్తే దేశమంతా గజగజలాడిపోయేది "

"ఆగాగు " అంది వాలంటిన్ అకస్మాత్తుగా దాక్కో ఎవరో వస్తున్నారిటు" మాక్సిమిలియన్ ఒక్క దూకు దూకి మొక్కల గుబుర్లవద్ద గబగబా పనిచేస్తున్నట్లు నటించ నారంభించాడు

ఒక పరిచారిక కేక వినవచ్చింది "వాలంటిన్ ! నీ కోసం నీ తల్లి వెతుకుతోంది అతిథు లెవరో వచ్చారు "

"ఎవరు ? స్త్రీలా ?"

"కాదు వచ్చినవారు కౌంట్ ఆఫ్ మాంట్‌క్రిస్టో అనుకుంట ను ఆయన మిమ్మల్ని ముఖ్యంగా చూడాలంటున్నారు "

"ఇప్పుడే వస్తున్నా నువ్వు వెళ్లు

52

మాంట్‌క్రిస్టో వచ్చిన సమయానికి విల్‌ఫర్ట్ ఇంటిలో లేడు విల్‌ఫర్ట్ భార్య హీలాయిస్ అతినిధిని ఆహ్వానించి కొడుకుకోసం సవతి కూతురుకోసం కబురు పంపించింది కొడుకు రాగానే హీలాయిస్ "నీ అక్క ఏమయింది ?" అని ప్రశ్నించింది "వెంటనే రమ్మని చెప్పు "

"ఓ మీ కొక కూతురు కూడా ఉందా ?" అన్నాడు మాంట్‌క్రిస్టో

"ఆమె విల్‌ఫర్ట్ మొదటిభార్య కూతురు ఇప్పుడే వయస్సు వచ్చింది చక్కనిది "

"కాని ఎప్పుడూ ముఖం వేలబెట్టుకుని ఉంటుంది"అన్నాడు హీలాయిస్ కుమారుడు ఎడ్వర్డ్ "ఛ ! నువ్వు నోరుమూసుకో" అని తల్లి కసిరింది తరవాత మాంట్‌క్రిస్టో వంకతిరిగి "వీడు బొత్తిగా అల్లరివాడైపోయి నాడండి కాని, వీడు చెప్పింది కొంత నిజమే మెంత బుజ్జగించి ఆదరించినా వాలంటిన్ నిత్యం దేన్ని గురించో విచారిస్తూ ఉంటుంది ఆమె అందాని కదొకటే లోటు కాని ఆమె ఇంకా రాదేం ? వెళ్లి చూడు ఎడ్వర్డ్ "

"కనపడదంటే, అక్కడ ఉన్నచోట పిలిస్తే వస్తుంది లేని చోట వెతికితే ఎలా కనబడుతుంది ?"

"ఎక్కడ వెతుకుతున్నారు ?"

"నయర్‌టైర్ తాత గదిలో వెతుకుతున్నారు "

"మ రెక్కడుంది ? నీకు తెలిస్తే ఎందుకు చెప్పవ్ ?"

"తోటలో నేరేడుచెట్టు కింద "

వాలంటిన్ రాగానే అందరూ ఆమె వంక చూశారు ఆమె కన్నులు చెమ్మగిలి ఉన్నాయి వాలాంటిన్‌కి పందొమ్మిదేళ్లు నిండాయి పొడగరి నల్లని శిరోజాలు, నీలి నేత్రాలు, పాలిపోయిన ముఖం తెల్లని మేనిఛాయ చూసి చాల చక్కనిదని మాంట్‌క్రిస్టో భావించాడు అతిథినిగురించి ఆమె అదివరకే విన్నది గదిలోకి రాగానే వినయంతో అభివాదం చేసింది "ఈమే నా సవతి కూతురు వాలంటిన్" అంది హీలాయిస్ విల్‌ఫర్ట్

"ఈయనే చీనా చక్రవర్తి, ముస్లింపాదుషా వగైరా, కౌంట్ ఆఫ్ మాంట్‌క్రిస్టో" అన్నాడు ఎడ్వర్డ్

మాంట్‌క్రిస్టో పరిశీలనగా స్త్రీ లిద్దరినీ చూసి కొంతసేపు యోచించి "అయితే ఇదివరలో మీ రిద్దరూ నన్ను చూడలేదా ?" అన్నాడు

"లేదనుకుంటాను వాలంటిన్ సామాన్యంగా సమాజంలో చనువుగా తిరగదు " అంది హీలాయిస్

"అయితే మీపారిస్ సమాజంలో కలుసుకోలేదు ఇక్కడ కాదు దూరదేశంలో కాబోలు, ఏవో ఉత్సవాల సమయంలో ననుకుంటాను జ్ఞాపకం తెచ్చుకోండి "

"లేదని నాకు గట్టిగా తెలుసును " అంది హీలాయిస్ "ఒక వేళ కలుసుకుని ఉంటే మీవంటి వ్యక్తిని నేను మరిచిపోను "

"బహుశా ఇటలీలో చూసి వుంటారు" అంది వాలంటిన్

"అవునవును " అన్నాడు మాంట్‌క్రిస్టో "ఒక తోటలో యథాలాపంగా కలుసుకున్నాం "

"ఇటలీ వెళ్లడం ఉత్సవాలు దర్శించడం, తోటలోవిందు అన్నీ జ్ఞాపకమున్నాయి కాని మిమ్మల్ని చూసినట్లు గుర్తుకు రావడంలేదు " అంది హీలాయిస్

"నేను గుర్తుచెప్తాను వినండి" అన్నాడు మాంట్‌క్రిస్టో "ఆరోజున పగటి వేడిమి ఎక్కువగాఉంది మీ బగ్గిరావడానికి ఆలస్యమయింది మీ కుమార్తె ఒక చెట్టునీడను నిలబడింది ఎడ్వర్డ్ నెమళ్లని తరుముతున్నాడు "

"అవును నేనొక నెమలిని పట్టుకుని రెండు ఈకలు పీకాను కూడా" అన్నాడు ఎడ్వర్డ్

"మీరు ఒక ద్రాక్షతీగవద్ద ఉన్నారు అప్పుడు మీరొక వ్యక్తితో చాలసేపు మాట్లాడారు జ్ఞాపకం లేదా ?"

"అవునవును" అంది హీలాయిస్ ఈమారు ఆమె ముఖంలో కొద్ది తొట్రుపాటు వ్యక్తమయింది "వూలుదుప్పటి కప్పుకున్న ఒక వ్యక్తితో మాట్లాడినట్లు నాకు గుర్తు "

"అవును ఆ వూలుదుప్పటి కప్పుకున్నది నేనే నేనప్పుడు అక్కడ హోటల్ యజమానిక కామెర్లు కుదిర్చాను నాకు ఘన వైద్యుడని పేరుకూడా వచ్చింది మీరూ నా వైద్య ప్రావీణ్యతను నమ్మి నన్ను సంప్రదించారు "

"అవును అయితే నిజంగా మీరు వైద్యులుకారా ?"

"మోరియర్ మొదలైన రచయితలు చెప్పినట్లు వైద్యులైనవారు రోగాలు కుదర్చలేరు, కాని వారే కుదర్చగలరు నేను వైద్యుణ్ని కాను రసాయనిక శాస్త్రం, జీవశాస్త్రం, మానవ శరీర శాస్త్రం మాత్రం పఠించాను

అప్పటికి గడియారం ఆరుకొట్టింది "అప్పుడే ఆరయింది" అంది హిలాయ్ "వాలంటిన్, నువ్వు తాతగారివద్దకు వెళ్లి భోజనం ఏర్పాటు చెయ్యి"

వాలంటిన్ మాట్లాడకుండా లేచి వెళ్లిపోయింది

"మీ రా శాస్త్రాలు పఠించారా?" అంది హిలాయ్

"అవును తూర్పుదేశాలలో నివసించాలని నిశ్చయపరుచుకున్నందువల్ల, పూర్వం మిత్రడేటిస్ మహారాజు మాదిరిగా విషాలకు నివారణౌషధాల్ని గురించి నేర్చుకోడం మంచిదనుకున్నాను"

"మిత్రడేటిజ్ అంటే పాంటస్‌కి రాజు ఆయన ప్రతిరోజూ ఉదయం భోజనానికి ముందు విషౌషధాలు పుచ్చుకునేవాట్ట" అన్నాడు ఎడ్వర్డ్

"ఎడ్వర్డ్! నీ అల్లరికి మితిలేకుండా ఉంది నువ్విక్కడనించి వెళ్ళిపో నీ అక్కదగ్గిరికి వెళ్లు"

ఎడ్వర్డ్ కదల్లేదు తల్లి వాడిని చెయ్యిపట్టుకు నడిపించుకెళ్లింది మాంట్‌క్రిస్టో ఆమెను జాగ్రత్తగా చూస్తున్నాడు "తలుపులు మూసివేస్తుందేమో చూడాలి" అనుకున్నాడు తనలో అతను అనుకున్నట్టే, ఆమె బిడ్డను పంపివేసి తిరిగివస్తూ గది తలుపులు మూసి గడియపెట్టింది వచ్చి ఇలా అంది "కాని నిజంగా ఆ పూర్వపురోజుల కథల్ని మీరు నమ్ముతున్నారా? ఆ విషాలూ నివారణౌషధాలూ నిజంగా ఉన్నాయా?"

"తప్పకుండా ఉన్నాయి నేను స్వయంగా వాటిని ప్రయోగించి చూశాను మూడుమార్లు విషప్రయోగంవల్ల నేను మరణించవలసిందే, కాని మూడుమార్లూ అమూల్యమైన మూలికల సహాయంతో గండాలు గడిచాను"

"అవును. ఇటలీలో అప్పుడు మీరామాట చెప్పడం నాకు గుర్తుంది"

"నిజంగా? నేనామాట అప్పుడు మీతో, అన్నానా? నాకు జ్ఞాపకంలేదు"

"అవును అన్నారు కొందరిమీద పనిచేసే విషాలు కొందరిమీద పనిచెయ్యవని అప్పుడు మీరు చెప్పారు"

"పని చెయ్యవనిమాట నిజమే రష్యాలో ప్రజలుతినే కొన్నిరకాల శాకాలు మనం ఈ దేశంలో తింటే ప్రాణహాని సంభవిస్తుంది"

"తూర్పుదేశాలవారు వాడే విషాలు మనదేశాలలో మరీ ప్రాణాంతకంగా పనిచేసేమాట నిజమా?"

"నిస్సందేహంగా మీకు విషప్రయోగం జరుగుతుందని మీకు ముందే తెలుసుననుకోండి ఆవిషం పాషాణమని కూడా తెలుసు ననుకోండి అప్పుడు మీరు మొదట చిన్న మోతాదుతో ప్రారంభించి పాషాణం తీసుకోడం అలవాటు చేసుకోవచ్చును క్రమంగా అలవాటైన కొద్దీ మోతాదు పెంచవచ్చును అప్పుడు మీకు అలవాటైన మోతాదుకే మరొకరు పుచ్చుకుంటే వెంటనే మరణించే మాట నిజం మీరు మంచినీరు తాగిన గ్లాసుతో మరొకరు మంచినీరు పుచ్చుకున్నా ప్రమాదం సంభవిస్తుంద"

"నివారణౌషధాలు ఇంకేవైనా ఉన్నాయా?"

"ఉన్నాయి కాని నాకు అవ్వేవీ తెలియవు"

"నేమిత్రడేటిజ్ చరిత్ర చాలసార్లు చదివి చూశాను కాని అదంతా పుక్కిటి కథ అనీ, అంతా బూటక మనీ నాఅభిప్రాయం"

"బూటకం కాదు; పుక్కిటి కథా కాదు" అన్నాడు మాంట్‌క్రిస్టో "కాని మీ రిప్పు డడుగుతున్నది యథాలాపంగా కాదు రెండేళ్లకిందట ఇటలీలో కూడా మీ రిదే విధంగా నన్ను ప్రశ్నించారు ఆరాజు చరిత్ర చదివినట్లు అప్పుడుకూడా చెప్పారు"

"నిజమే నండి" అంది హిలాయ్ "నాకు చిన్నతనంనించీ వృక్షశాస్త్రం, ఖనిజశాస్త్రం అంటే ప్రీతి నేనే మగవాడినై పుట్టినట్లయితే పరిశోధనలో ఖ్యాతి తెచ్చుకుని ఉందును"

"మిత్రడేటిజ్ కథలో ఏముంది? తూర్పుదేశాలవారి శాస్త్రాలలో చాల ముందుగుగు వేశారు విషప్రయోగం వారి చేతుల్లో కళగా వికసించిది భౌతిక శాస్త్రం ప్రాణరక్షణకీ, ప్రాణహరణకీ కూడా ఆదేశాలలో వినియోగించబడుతోంది నల్లమందు, పాషాణం, రసనాభి, ఉమ్మెత్త, నేపాళం మొదలైనవన్నీ ప్రయోగించడం వారు నేర్చుకొన్నారు ప్రాణం పోనివ్వకుండా వారు మనుష్యులికి మైకం కలిగించి నిద్ర పుచ్చగలరు"

"నిజంగా?" అంది హిలాయ్ ఆమెకళ్లు మెరమెరలాడాయి

"నిజమే నండి" అన్నాడు మాంట్‌క్రిస్టో

"కాని ఆతూర్పుదేశాలవారు చెప్పేవన్నీ కట్టుకథలే"

"కాదు కాదు తూర్పుదేశాలవారు మన స్థితిలో లేరు మన దేశంలో ఎవరైనా పగతీర్చుకోవాలంటే శత్రువులైన వారిని పాషాణంపెట్టి చంపుతారు కాని దానివల్ల ప్రయోజనమేమిటి? పాషాణంవల్ల చనిపోయే వ్యక్తి చనిపోకముందు యమ యాతనపడతాడు విషప్రయోగం జరిగినట్లు క్షణంలో అందరికీ తెలిసిపోతుంది వెంటనే పోలీసులు వస్తారు శవాన్ని వైద్యపరీక్షకు పంపుతారు పేగులు పరీక్ష చెయ్యగానే పాషాణప్రయోగం బైటపడుతుంది హంతకునికి శిక్షపడుతుంది"

హిలాయ్ ఈమారు బిగ్గరగా నవ్వుతూ "సరైతే, మీ రేమి చేస్తారు?" అంది

"రోమ్‌లో ఏం జరుగుతుందో మీకు తెలియదా? అక్కడవారు వాడే విషాలు మనిషిని వెంటనే చంపవు ఏ దగ్గో, కడుపులో నొప్పో పుట్టిస్తాయి క్రమ క్రమంగా ఆ మనిషి క్షీణించి మాసం రోజుల్లో చచ్చిపోతాడు అప్పుడు పోలీసుల బాధే వారి కుండదు సిసిలీలో నా మిత్రుడొక డుండేవాడు అత నీ శాస్త్రంలో బాగా పరిశోధనచేసి అనేక ప్రయోగాలు చేశాడు ఒకటి చెప్తాను వినండి అతనికి చక్కనితోట ఒకటుండేది ఒకసారి పాషాణద్రావకం తయారుచేసి, మూడు రోజులపాటు ఒక కాబేజిని దానితో తడిపాడు మూడోరోజున కాబేజి వాడిలి లేత పసుపుపచ్చ రంగుకి మారింది దాన్ని కోసి దానిపై ఒక ఆకుతీసి ఒక కుందేలుచేత తినిపించాడు కుందేలు చచ్చిపోయింది దీనికి పోలీసు లేమీ అనలేరుకదా? తరవాత కుందేలు పేగులు తీయించి గోడప్రక్క పారవేయించాడు ఆపైన ఆ పేగుల్ని తిన్న కోడి చచ్చింది కోడిని తిన్న ఒక రాబందు చచ్చి ఒక చేపలగుంటలో పడింది గుంటలో చేపలు మొదలైనవి రాబందుని తిన్నాయి ఆ చేపల్ని వండించుకుని తిన్న మనుష్యులు వారం పదిరోజుల్లో చనిపోతారు కాని వారు చనిపోయినది ప్లీహవ్యాధివల్లనో మరొక వ్యాధివల్లనో చనిపోయారనే అందరూ భావిస్తారు"

"కాని పాషాణ ద్రావకాన్ని ఈవిధంగా వాడినట్లయితే అది ఎన్ని అంచలు దాటినా బైటపడుతూనే ఉంటుందికదా?"

"అవును అందుకే నా మిత్రుడు మరొక ప్రయోగంచేసి చూపించాడు ఈమారు మూషికవిత్తనాలతో రసం తయారుచేసి కాబేజిమొక్కకి వారంరోజులు పోశాడు తరవాత కాబేజికోసి ఒక కుందేలుకి పెట్టాడు కుందేలు చచ్చిపోయింది తరవాత కుందేలు పేగులుతిన్న కోడి చచ్చింది, ఈమారు కోడినికోసి పరీక్ష చేశాం ఎక్కడా విషప్రయోగ చిహ్నాలు కనపడలేదు ఒకవిధ

(46-వ పేజీ చూడండి)

సత్యనారాయణవ్రతం

శ్రీ సి. రామచంద్రరావు


ఇందులో మోహనరావు తల్లడిల్లి పోవలసినంత కారణం నాకు కనిపించలేదు సీనిగాడిలో ఏదో కొంతమార్పు కనిపించినమాట నిజమే తాతగారింటికి వెళ్లివచ్చాక వాడు కొంచెం మొండిగా ప్రవర్తిస్తున్నాడు నన్నడిగితే అది సహజమే అంటాను బంధువులలో తల్లిదండ్రులలాగా పిల్లల్ని అదుపాజ్ఞలలో పెట్టేవాళ్లెవ రుంటారు? అది కాకపోయినా ఇంటిదగ్గరలాగా కట్టుదిట్టాలలో ఉంచడానికే అయితే సరదాగా ఎక్కడో బంధువులింటికి పంపడ మెందుకు? నాలుగు రోజులపాటు కుర్రవెధవలు ఆడుకుని వస్తారనే కదా! అక్కడినుంచివచ్చిన మొదటి రెండుమూడు రోజులు పెంకిగా ప్రవర్తిస్తే ప్రవర్తించవచ్చు మళ్లీ నాలుగోనాడు మామూలే ఆ పంతులి మొట్టికాయలూ, స్నేహితుల దెబ్బలాటలూ, అమ్మచిరాకూ, నాన్న కోపం, అన్నయ్య బెదరింపులూ, అక్కయ్య చాడీలూ - పాతవాటన్నిటికీ ఎప్పటిలాగే అలవాటుపడిపోతారు ఎన్నిసార్లు చెప్పినా ఇంత చిన్న విషయాన్ని అర్థంచేసుకోడు మా మోహనరావు అలా బాధపడుతూ కూర్చుంటేనే అతనికి బాగుంటుందేమో మరి!

మోహనరావు స్వశక్తిమీద పైకివచ్చిన మనిషి ఆ వుద్యోగం, బంగళా, కారూ, భార్యా, పిల్లలూ తన శక్తిసామర్థ్యాలకి కానుకలని అతని నమ్మకం అందుకనే తన ప్రయోజకత్వం తలుచుకున్నప్పుడతనికి చెప్పలేనంత ఆనందం ముఖ్యంగా పిల్లల్ని చూసుకున్నప్పుడు మహా గర్వం అతను చిన్నప్పుడు నీచంగా పెరిగాడు తల్లిగాని తండ్రిగాని అతనిగురించి అట్టే శ్రద్ధ తీసుకోలేదు వాళ్ళకి విసుగ్గా ఉన్నప్పుడల్లా రెండు దెబ్బలు కొట్టి ఊరుకునేవారు ఎందుకు కొట్టేరో ఏమిటో అతని కర్థమయేదీ కాదు వాళ్లు చెప్పేవారూ కాదు ఇన్ని కష్టాల్లో పెరిగినా అతని కెక్కడో అదృష్టముండి ఇంతటివాడు కాగలిగాడు ఇప్పుడు తనకీ పిల్లలున్నారు అయితే వాళ్లంత నికృష్టజీవితం గడప నవసరం లేదు నిజానికి అతనెంత నిర్లక్ష్యంగా పెంచబడ్డాడో అతని పిల్లలంత జాగ్రత్తగా పెంచబడుతున్నారు. వాళ్ళనెంత కట్టుబాటులో వుంచగలిగాడు! ఒక్క వెధవా ఎప్పుడైనా పెంకితనంచేసి ఎరుగునా? ఈ మధ్యనే సీనిగాడు పెంకిఘటంగా మారాడనుకోండి అయినా దాంట్లో వాడి తప్పు లేదు తాతగారే ఎక్కడిలేని గారాబంపెట్టి చెడిపేశారువాడిని అందుచేతనే పంపనంటే పంపనన్నాడతను, మంకుపట్టుపట్టి తీసుకువెళ్లారు ఫలితంగా వాడిలా తయారయ్యాడు ఇంతవరకూ అతని పిల్లలు అబద్ధాలాడడం, వీధులంట తిరగడం ఎరగరు అసలు వాళ్ళ నాన్న చెప్పితేనే కాని కుర్రవెధవలు గుమ్మం దాటరుకదా! బడికి నాన్నతోటే కార్లో వెళతారు సాయంత్రం నాన్నతోటే తిరిగి వస్తారు వాళ్లింటికి కావలసినంత తోట వుంది దాంట్లో ఎంతసేపైనా ఆడుకోవచ్చు ఇంక బళ్ళో ఆడుకోవలసిన అవసర మేముంది? వాళ్ళు నలుగురు పిల్లలు నలుగురికంటే ఎక్కువెందరు కావాలి ఆటకి? అంచేత వాళ్ళింటికి ఆడుకోడానికి చుట్టుపక్కల పిల్లలెవ్వరూ రారు అంతగా కావలిస్తే వాళ్ల నాన్న ఉండనే వున్నాడు పిల్లలతో ఆడడమంటే సరదా అతనికి అసలు ఇలా ఆడుతూ పాడుతూనే తన జీవిత వేదాంతాన్ని అర్థమయ్యేలాగ చిన్న వెధవలకి నూరిపోశాడు మోహనరావు తెలివైనవాళ్లు కాబట్టి వాళ్ళకిట్టే పట్టుబడిపోయింది ఇప్పుడు వాళ్ళ నడకలోనూ పలుకులోనూ కూడా మోహనరావు కనిపిస్తూవుంటాడు వాళ్లకి తెలియకుండానే వాళ్ళు తండ్రికిష్టమైనవాటిని గ్రహించడం, అయిష్టమైన వాటిని ప్లేగులాగా చూడడం నేర్చుకున్నారు

నిజానికి ఇంత జాగ్రత్తతో పెరిగిన సీనిగాడు వారంరోజులు తాతగారింటిదగ్గిర గడిపేసరికి పూర్తిగా మారిపోయాడంటే నేను మొదట్లో నమ్మలేకపోయాను వాడక్కడ స్వేచ్ఛగా సంచరించాడట వాడి నడ్డుపెట్టేవాళ్లు లేకపోయారు దానికి తోడు వాడి మామ ఒకడున్నాడు ఆరితేరిన ఘటం వాడితో తెగతిరిగి సిగరెట్లు కాల్చడందగ్గరనుంచి జేబులు తడవడం వరకూ నేర్చుకున్నాడట ఇంకొక విశేషమేమిటంటే, వాడింటికొచ్చేటప్పుడు, ఈ దుర్బుద్ధులతోపాటు కామెరామీద వ్యామోహాన్ని కూడా తెచ్చుకున్నాడు మొదటిసారిగా కామెరాని వాడు మామదగ్గిర చూశాడట అప్పటినుంచీ వాడికి దానిమీదే వుంది ఇంటకొచ్చి తన కొక కామెరా కొనిపెట్టమని తల్లిని వేపేశాడు కాని మోహనరావు పడనియ్యలేదు పిల్లలేదైనా కొనమని అడగడం అతనికి కొత్తగానూ విచిత్రంగానూ కనిపించింది దానికి తోడు ఎప్పుడూ లేనిది తిరగడం అల్లరిచెయ్యడం ప్రారంభించాడు సీనిగాడు వాడి గుణం మారకుండావుండి కామెరా కొనమని అడిగితే మోహనరావేం చేసేవాడో తెలియదు కాని ఇప్పుడుమాత్రం వాడి కోరికని బలంగా అణిచేశాడు

సీనిగాడు మళ్ళీ కామెరామాట ఎత్తలేదు దొంగతనం, సిగరెట్లుకాల్చడం, తిరగడంకూడా మానేశాడు కాని వాడి, అల్లరిమాత్రం తగ్గలేదు ఏవో చిల్లర కొంటెపనులు చేస్తూనే వున్నాడు తండ్రి ఇంతకుముందు వాడిని కొట్టి ఎరగడు ఇప్పుడు రోజూ ఒకసారయినా చెయ్యిచేసుకోక తప్పడంలేదు చివరికి విసుగెత్తి వాడి అల్లరి చూసీ చూడనట్టు నటిద్దామని ప్రయత్నించాడు కూడాను కాని ఇప్పుడు సీనిగాడు చాటుగా అల్లరి చెయ్యడం మానేశాడు ఏం చేసినా తండ్రికి ప్రత్యక్షంగా కనిపించేటట్టు చేసేవాడు వీడి ప్రవర్తన నాకాశ్చర్యం వేసింది చిన్నపిల్లలు తల్లిదండ్రుల చాటుగా తప్పుపనులు చెయ్యడం నే నెరుగుదును కాని ఈ వెధవలాగ తప్పుపని చేసి అది తండ్రికి తెలిసేదాకా పాకులాడడం నే నెక్కడా వినలేదు చూడగా సీనిగాడికి దెబ్బలు తినడం, తిట్లుతినడం ఇష్టంలాగా కనిపించింది దెబ్బలు తిన్నప్పుడు వాడు ఏడవకపోలేదు కాని అదే పనిచేసి మళ్లా ఒక గంటలోనే తండ్రిముందు ప్రత్యక్షమవడం మానలేదు తండ్రి శిక్షించినప్పుడు వాడికో అదొకవిధమైన తృప్తికలుగుతుందేమో మరి!

(47-వ పేజీ చూడండి)



1

ఆ పల్లెటూరు పేరు ఫలానా అని చెప్పటం అనవసర మనిపిస్తుంది ఎందుకంటే దాన్ని ఏ పేరు పెట్టి పిలిచినా ప్రమాదం లేదు ఆ పల్లెటూరూ అన్ని పల్లెటూళ్లలాటిదే అంటే సినిమాల్లోనూ కావ్యాల్లోనూ స్వర్గసీమ అనుకోటం చాలా పొరబాటు అది ధానధర్మాల కిల్లు కాదు కక్షలకీ స్పర్ధలకీ పుట్టిల్లు! ఆవూళ్లో ఎందరు మనుషు లున్నారో అన్ని పార్టీలున్నాయంటే అతిశయోక్తి కావచ్చును కాని అసత్యంమాత్రం కాదు ఎవరినోట విన్నా ఇంకో మనిషిని గురించిన దుష్ప్రచారం తప్ప మరొకటి వినబడదు ఎవర్ని కదిలించి చూసినా స్వార్థపు గుట్టలూ, స్పర్థపుగుట్టలూ, కనిపిస్తయ్ ఏదో పార్టీకి చెందని మనుషులు ముచ్చుకి ఒకళ్లకంటె అవూళ్లో దొరక్క పోవచ్చు ఆ మనిషికి ఈ సంకుచిత దుర్గంధంలోంచి ఎప్పుడు బైటపడతానా అని అల్లాడిపోతూంటాడు ఈ పల్లెటూళ్లో చెరే పనీ పాటా లేనట్లు కడవ చంకన పెట్టుకుని నూతికో చెరువుకో నీళ్లకి బయలుదేరి దారిలో ప్రణయకలాపాలు సాగించే పడుచులూ అసలే కనిపించక పోవచ్చును అంతమాత్రాన అదొక పల్లెటూరు కాదనటానికి వీల్లేదు మరి మళ్లీ మాట్లాడితే ఆ పల్లెటూరిలోనే అన్ని పల్లెటూళ్లూ మనకి కనిపిస్తయ్యంటాను

ఆ వూళ్లో ఏ పార్టీకీ చెందని వ్యక్తి ఒక్క దామోదరమే అందుకే దామోదరమంటే అన్ని పార్టీలనాయకులకీ కడుపుమంట ఏ తగాదాలలోనూ ఆయన చెయ్యిచేసుకోడు ఊళ్లో పంచాయతీబోర్డు ఎన్నికలొస్తే ఎటూ తనవోటు వెయ్యకుండా ఆనాడు ఊళ్లోనే లేకుండా వెళ్లిపోతాడు ఎన్నికల జ్వరం చల్లారేదాకా మళ్లీ ఊళ్లోకి తిరిగిరానే రాడు కనకనే ఆయన మీద ఊళ్లో కథానాయకులందరికీ అతి కోపమంట

కాని దామోదరం ఇంటిముందు వేప చెట్టుకొమ్మల్లో త్రివర్ణపతాకం ఎగురుతూ వుంటుంది ఆ పతాకం ఊళ్లో ఇంకే కొంపటిక్ల మీదా, మేడల మీదా, ఎగరని రోజుల్లో కూడా దామోదరంగారి భవంతిముందు గాలిలో గర్వంగా కదులుతూ వుండేది ఆ జెండాని చేత్తో పుచ్చుకోటానికి గుండెలు పీచుపీచుమనే రోజుల్లో కూడా దామోదరంగారి వేపచెట్టు కొమ్మల్లో నిర్భయంగా త్రివర్ణపతాకం నాట్యంచేసేది ఆ పతాకం దామోదరం గారు భవనాల్లో నివసించినా, పెంకుటింట్లో కాపురమున్నా, చివరికి పూరిగుడిసెలో కాలం వెళ్లదీస్తున్నా తన నాట్యం నిర్విఘ్నంగా సాగిస్తోంది దామోదరం ఒకనాడు ఆ వూళ్లో లక్షాధికారి అన్న సంగతి కొద్దిమందికి మాత్రమే గుర్తుంది ఆ రోజుల్లో డబ్బుని ఎంత నిర్లక్ష్యంగా ఇతరుల మేలుకోసం వెదజల్లాడో తెలుసుకోవాలంటే ఆ వూళ్లో పాఠశాలని అడిగినా, వైద్యశాలని అడిగినా, చెరువుగట్టునున్న ధర్మశాలని అడిగినా, రేవుల్లో తీర్చిదిద్దినట్టున్న సిమెంటు మెట్లని అడిగినా వెయ్యి గొంతులతో చాటి చెప్పగలవు ఒకప్పుడు తామరతోనూ నాచుతోనూ పెనవేసుకుపోయి మురికిగుంటలాగా అన్ని రోగాలకీ ఆలవాలంగా వుండే ఆ కొలను ఇవాళ తేటనీటితో తొణికిసలాడటానికి కారణం కూడా దామోదరంగారి చొరవ

ర్యమే చెఱువుకి మాన్యం వున్నా, దాన్ని స్వార్థపరులు నిరంకుశంగా అనుభవిస్తుంటే చేతిడబ్బు వేసుకుని దామోదరంగారు బాగుచెయించారు ఏటేటా తరుణంలో చెఱువుకి నీళ్లు పట్టించటం ఆయనవొంతూ, ఏడాదిపొడుగునా తాగటం మిగతావాళ్ల వొంతూ! ఊరు బాగుచెయ్యాలని ఇన్ని విధాల పాటుబడినా ఆయనకి దక్కిన ప్రతిఫలం ఏముంది? అనారోగ్యం, దరిద్రం, అనాదరణ మనుషులు శిశువులకంటే వెర్రివాళ్లు పాలిచ్చేతల్లి చన్ను శిశువు కొరికితే, తన మేలుకోరేవాణ్ని ఏవగించుకుంటాడు మనిషి!

ఈనాడు దామోదరం స్థితి చితికిపోయింది పువ్వులమ్మిన వూళ్లోనే పుడకలమ్మవలసి వచ్చింది ఆర్థిక స్థితితోపాటు శరీరస్థితి కూడా అన్ని ఉద్యమాలలోనూ ముందుకి దూకి చెఱసాలల్లో ఏళ్ళతరబడి కుమిలిపోవటంవల్ల పూర్తిగా చెడిపోయింది అయినా ప్రతిరోజూ ఉదయంపూట మూడు గంటలసేపు నూలువడకటం మానెయ్యలేదు తుమ్మెదలు ఝుంకరించినట్లు చర్ఖా ప్రతిరోజూ మోగుతూనేవుంది జీవితంలో ఎన్ని దెబ్బలు తిన్నప్పటికీ, పరిస్థితి ఎంత తారుమారైనప్పటికీ దామోదరంముఖంలో శాంత గంభీరముద్ర చెదరిపోలేదు ఆయన పెదవులమీద మధురదరహాసం మాసిపోలేదు తనమీద ఇతరులు ఎంత నిర్లక్ష్యం ప్రదర్శించినా తనమటుకు అందరినీ ఆప్యాయంగా ఆప్తబంధువుల్లాగా పలకరిస్తాడు ఎవరికి ఏ బాధవొచ్చినా ఆయన దగ్గరికి పరిగెత్తికెళ్లి ఉచితంగా తెల్లమాత్రలు తెచ్చుకుని తియ్యగా మింగుతారు ఆయన ఇచ్చే మందులు తియ్యగా వుంటాయ్ కాని ఆయన మనస్సు అంతకంటే తీపిగా వుంటుంది!

అనాదినుంచీ ఆవూళ్లో దామోదరమే కాంగ్రెసుసంస్థకి ధ్వజస్తంభం ఆయనపేరు చెప్పుకునే చాలామంది వినాయకులు నాయకులై పదవులు సంపాదించుకున్నారు ఆయనకి పదవులకోసం పాకులాడటమంటే అరికాలిమంట చేతనైతే ప్రతిఫలం కోరని సేవచెయ్యాలి, లేకపోతే చేతులు ముడుచుకుని కూచోవాలని ఆయన దృఢవిశ్వాసం

కాని ఇటీవల దామోదరంగారు వృద్ధాప్యంవల్ల ఇల్లుకదలటం మానేశారు భగవద్గీత చదువుకుంటూ, చర్ఖా తిప్పుకుంటూ, బీదసాదల కష్టసుఖాలు విచారిస్తూ కాలక్షేపం చేస్తున్నాడు ఈయన గాంధీజీ చేదస్తపు శిష్యుల్లో ఒకడని చెప్పి తమకి ఎన్నికల ప్రచారానికీ, పదవుల మంతనాలకీ పనికిరాడని వినాయకులు తీర్మానించుకున్నారు చెట్టెక్కగానే నిచ్చెన తన్నేసినట్లు ఆయన పలుకుబడిని ఉపయోగించుకుని పెద్దవాళ్లయిన పెద్దమనుషులు ఆయన్ని చిన్నచూపు చూడటం మొదలుపెట్టారు అయినా దామోదరం వాళ్ల ప్రాపకంకోసం ఎప్పుడూ పాకులాడలేదు దేవుడికి తప్ప మరెవరికీ జంకని మనిషి కనక దామోదరం ఎవరినీ లక్ష్యం చెయ్యలేదు తన దారిన తాను పోతూ, ఇంకెవరి దారికీ అడ్డుపోకుండా బదకటమే ఆయన పద్ధతి

దామోదరం రాజకీయాలకి ఎడంగా తొలగిపోవటంవల్ల ఫాక్టరీ బసవయ్య ఆ పల్లెకి సాటిలేని మేటి కాంగ్రెసునాయకుడైపోయాడు పొరుగూరునించి ఏ నాయకుడొచ్చినా ఘనమైన స్వాగతాలు, విందులూ, సన్మానపత్రాలు ఇస్తాడు డబ్బువిరజిమ్మేసి వొచ్చినవాళ్ళు తిరిగివెళ్లేదాకా స్తోత్రాలు చేస్తూ కూడా కూడా నడుస్తాడు

బసవయ్య చేతులో కానీ లేని రోజుల్లో దామోదరమే డబ్బు ఇచ్చి వడ్లమర పెట్టించాడు ఆడబ్బు బసవయ్య తిరిగి ఇవ్వాలనీ అనుకోలేదు, దామోదరం తిరిగి పుచ్చుకోవాలనీ అనుకోలేదు భాగ్యచక్రం తిరిగింది బసవయ్య కుబేరుడు, దామోదరం కుచేలుడు!

మొదట్లో బసవయ్య కృతజ్ఞతఅనేజబ్బుతో కొన్నాళ్లు బాధపడ్డాడు తన భాగ్యానికంతకీ దామోదరమే కారకుడని నమ్మాడు కాని ఈరోజు చేతులో కానీ లేని దామోదరంతో నోరు విప్పి మాట్లాడటమే తన పరువు ప్రతిష్ఠలకి భంగమనిపిస్తుంది ఎన్ని ఇక్కట్లు వచ్చినా, ఎన్ని చిక్కులు వచ్చినా దామోదరం ఒక్కనాడు కూడా బసవయ్య దగ్గర చెయ్యి చాచి ఎరగడు దమ్మిడీ చేతులో లేనివాడికి కూడా ఎందుకింత తలపొగరని బసవయ్య బొజ్జ నిమురుకుంటూ ఎన్నోసార్లనుకున్నాడు అయినా కాంగ్రెసంతటి మహాసంస్థే తనమీద ఈనాడు ఆధారపడివున్నప్పుడు దరిద్ర దామోదరంతో మాట్లాడాల్సిన అవసరం తనకేముంది? ఇప్పుడు దామోదరాన్ని గురించి 'వాడు' అని ఏకవచన ప్రయోగం చేసి "వాడున్నంతకాలం మన వూరు బాగుపడదు" అని సిద్ధాంతంగా నొక్కిచెబుతాడు బసవయ్య తెల్లవారి లేస్తే తెల్ల టోపీల పెద్దలు చిన్నకార్లూ, జీపుకార్లూ వేసుకుని తన చుట్టూ తిరుగుతూవుంటారు ఇదంతా చూస్తుంటే బసవయ్యకి ఈ ధరాచక్రమంతటికీ తనే ఇరువసయినట్లూ అది తనచుట్టూతా గిరగిరా తిరుగుతున్నట్లూ అనిపిస్తుంది

మనుషులు గడిచిన సంగతులు ఇట్టే మరిచిపోతారు ఈనాడు ఖద్దరుటోపీ, పంచా, లాల్చీ విడవని బసవయ్య పదేళ్లకి మునుపు గ్లాస్కోమల్లు తప్ప కట్టేవాడు కాదు ఆయన ఇంట్లోనూ మిల్లులోనూ రాజుగారి బొమ్మలుండేవి ఊరంతా జాతీయజెండా ఎగరేసినా ఆయన ఇంటిమీదా, ఫ్యాక్టరీమీదా ఎన్నడూ జెండా ఎగిరిన పాపాన పోలేదు అంతేకాదు గాంధీపేరు వింటే బసవయ్యకి గంగ వెర్రులెత్తేవి ఆగస్టువుద్యమంలో అందరు కుర్రాళ్లతోపాటు తనకొడుకూ కాలేజి మానేసి ఇంటికొస్తే అన్నంపెట్టక, చావగొట్టి, వెంటబెట్టి తీసికెళ్లి బలవంతాన కాలేజిలో దింపివచ్చాడు మిల్లులో పని చేసే కూలీ లెవరైనా ఖద్దరు కడితే చాలు కారాలూ మిరియాలూ నూరేవాడు అంతే కాదు, దామోదరం కుటుంబం వూళ్లో వుండటం అనర్థదాయకమనీ, వాళ్లవల్ల స్వరాజ్యం వెర్రి అందరికీ అంటుకుంటుందనీ ప్రభుత్వానికి విన్నవించిన విధేయ సేవకుడు బసవయ్య!

ఇంతెందుకు? జాతీయోద్యమప్రబల విరోధియైన బసవయ్య జాతీయప్రభుత్వపు ప్రాణమిత్రుడైపోయాడు వేషం మార్చేశాడు ఇనప్పెట్టెలో డబ్బుతోపాటు శరీరం కూడా పెరుగుతోంది కోరాఖద్దరు లాల్చీలోంచి బసవయ్య లంబోదరం దోబూచులాడుతూ వుంటుంది ఆగస్టు పదిహేనున అర్ధరాత్రి అమావాస్యనాడు స్వరాజ్యం వచ్చేసరికీ ఆ వూళ్ళోదాన్ని సంరక్షించే భారమంతా బసవయ్య భుజస్కంధాలమీద పడింది మునుపు ప్రభుత్వవిరోధులైన దేశభక్తులని ఎంత నిఘాగా పట్టియిచ్చాడో ఇప్పుడు కూడా అంత భక్తిశ్రద్ధలతోటే కమ్యూనిస్టులని వేటాడటంలోనూ, అధికాహారోత్పత్తికోసం విరివిగా చెట్లు నాటటంలోనూ, ఒకటేమిటి అన్నివిధాలా జాతీయప్రభుత్వానికి నమ్మిన బంటుగా నడుచుకుంటున్నాడు

ఇప్పుడు బసవయ్య వూళ్ళో 'తానా' అంటే మిగతా వాళ్లు 'తందానా' అంటారు ఆయన్ని కాదని ఆ గడ్డమీద బతకటం

(36-వ పేజీ చూడండి)

కథానిక

సముద్రం

శ్రీ జయంతి శ్రీరామమూర్తి

"ఇలా బాధపడితే ఎలాగ చెప్పు తలనొప్పో, కడుపునొప్పో చెప్పాలిగాని డాక్టర్ని తీసుకురానా?" అన్నాడు రామనాథం కామేశ్వరి చలించలేదు అలాగే మంచంమీద పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది రామనాథానికేం పాలుపోవడంలేదు రాత్రిపదకొండయింది ఊరంతా మాటుమణిగిపోయింది "ఇప్పుడు వెళ్లినా ఆ డాక్టరు ఓ పట్టాన వస్తాడో, రాడో, ఇంతకీ ఏం బాధో తేల్చవాయె" అని పైకంటూ 'ఈ సంసారం ఎలాగ ఈదాలిరా భగవంతుడా' అని లోపల అనుకుంటూ ఆమె ప్రక్కనే మంచం మీద కూలబడ్డాడు ఆమె అలాగే బాధ పడుతూంది తలదిండ్లు కన్నీటితో తడిసి పోయేయి భర్త ఊరుకోలేక "నా మాట విను అర్ధరాత్రి అవుతోంది పాపం, రాణి కూడా ఎలాగ బిక్కు బిక్కుమంటూ చూస్తోందో చూడు ఇంతకీ నేనేం చేసేనని నీకీ విచారం" అన్నాడు కామేశ్వరి ప్రక్కకు తిరిగి "నేను బ్రతికివున్నానని నాకు విచారం" అంది రామనాథం మనస్సు కొంచెం శాంతించింది ఆమెకేమీ జబ్బులేదనీ, ఇదంతా ఖండిత నాయికా లక్షణమేననీ రూఢిచేసుకున్నాడు అయినా 'ఆ పల్లెటూరు ఘటాన్ని' సంతృప్తిపరచాలని, "రామ, రామ! అలా గనరాగు—అర్ధరాత్రి వేళ, నువ్వు నా ప్రేయసివి నా గృహలక్ష్మివి" అంటూ ఆమె భుజంమీద చెయ్యివేసేడు ఆమె శాంతించలేదు సరిగదా, అతని చేతిని ప్రక్కకు నెట్టి, "అవును చదువురాని చట్టుబండను వంటలక్కను ముసలమ్మను" అంది అతను తెలిసో తెలీకో ఎప్పుడో అన్న మాటలు తిరిగి అప్పచెబుతూ రామనాథానికేం తోచడంలేదు ఓ ప్రక్క సినీమా చూసి వచ్చిన బడలిక, ఓమూల చిన్నపిల్ల రాణి నిద్రపోలేదని జాలి, ఓవైపు భార్యా రత్నం అలకకారణ మేమిటని ఆందోళన అతన్ని క్రుంగతీస్తున్నాయి మళ్ళీ ఆమె భుజంమీద చెయ్యివేస్తూ ఏదో చెప్పబోయేడు ఆమె అదరిపడి "నన్ను ముట్టుకోవద్దు దూరంగా వుండండి" అంది ఈ అదురుపాటు చూసి ప్రక్క మంచంమీద పడుకుని చూస్తున్న రాణి లేచి కూర్చుంది రామనాథం కూతురు ప్రక్కచేరి "లబ్బొ రాణీ! ఏం నిద్రరావడంలేదమ్మా!" అంటూ ఆమె ప్రక్కనే వొరిగాడు రాణికి ధైర్యం కలిగి తిరిగిపడుకుంది రామనాథ మామెను చూసి "ఈ వేళ స్కూల్లో ఏంపాఠం చెప్పేరు" అన్నాడు ఆమాట లామె వినిపించుకోలేదు కాని, అతని చొక్కా గుండీలు తడుముతూ "అయితే-జీవితం సినీమాలో మీ ప్రక్కన కూర్చుందే ఆవిడెవరు?' అంది రామనాథం త్రుళ్లిపడ్డాడు "ఏం మీరూ వచ్చారా, సినీమాకి" అన్నాడు పసిపిల్ల నిజం చెప్పేసింది "అమ్మా, నేనూ, కాంతమ్మగారూ వచ్చేము మేం బెంచీల మీద వున్నాం మధ్యలో ఓసారి లైట్లు వెలిగేయి చూసేరూ, అప్పుడు చూసేం మిమ్మల్ని ఆ గళ్లచీరావిడ యెవరు?" అంది రాణి ఆరేళ్ల పిల్ల అలాగ అడిగితే ఏంచెప్పాలో అతనికి తోచలేదు కామేశ్వరి కోపకారణ మేమిటో అతనికి అర్థమయింది 'అయినా ఆమెకింత అసూయ యెందుకు నామీద' అనే అభిమానం ఆవేశించింది రామనాథాన్ని

పిల్లవేపు తిరిగి "ఆవిడ మీ అత్తయ్య" అన్నాడు రామనాథం కామేశ్వరి లేచి "అత్తయ్యాలేదు గిత్తయ్యాలేదు మీదొడ్డమ్మ" అంది రామనాథం చెవుల కామాటలు మధురంగానే వినిపించినా "మాటలు సరిగా రానీ, ఎప్పుడూ ఒక్కటే వాగుడా" అన్నాడు ఆమె జవాబు చెప్పలేదు అతనూ అంతకన్న మాట్లాడలేదు మాయా మర్మమూ ఎరుగని రాణి నిద్రపోయింది ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది రామనాథం ఆలోచిస్తున్నాడు గడచిపోయిన దిన చర్యని పునఃస్మరణ చేసుకుంటున్నాడు

రాజేశ్వరి బెంగుళూరులోనే పనిచేస్తోందని తెలిసినప్పటినుంచీ అతనికి ఊపిరాడడంలేదు అందుకే సాయంత్రం మూడింటికే బయలుదేరేడు-బుల్ బుల్ కంపెనీకి. "రాత్రి కొంచెం ఆలస్యంగా వస్తానేమో. ఒక స్నేహితుడింటికి వెడుతున్నాను" అన్నాడు కామేశ్వరితో ఎలాగో కంపెనీ మేడ సమీపించేసరికీ రామనాథానికి తన కాలేజీ మేడ జ్ఞాపకం వచ్చింది మెట్లెక్కుతూంటే అడుగులు కొంచెం తడబడ్డాయి. పైకెక్కేసరికి ఒక పెద్దహాలు వుంది. అందులో రాజేశ్వరి వున్నట్లులేదు ఒక గుమాస్తాను సమీపించి "యం రాజేశ్వరి అనే ఆవిడ ఎక్కడుంది" అన్నాడు ఆ గుమాస్తా ఎగాదిగా చూసి "ఎవరు మీరు" అన్నాడు రామనాథం తడుముకోకుండా "ఆవిడ పినతండ్రి కొడుకును" అన్నాడు. ఆయన, నాలుగో నెంబరు గదిలోకి వెళ్ళమన్నాడు గదిలో అడుగుపెడుతూ 'రాజేశ్వరీ' అన్నాడు ఆవిడ తెల్లబోతూ చూస్తూంది అతను తడుముకోకుండా "నేను రామనాథాన్ని మీ క్లాసుమేటును" అన్నాడు రాజేశ్వరి చిరునవ్వు నవ్వి "ఓహో మీరా! చంపేసేరు ఈ తెల్లటోపీయేమిటి? ఎవరో యం యల్ ఏ గారనుకున్నాను" అంది అతనూ చిన్నగా నవ్వేడు చేసేపనిలేక రాజేశ్వరి "కూర్చోండి ఎంతకాలానికి కలుసుకున్నాం ఎంతగా మారిపోయారు! ఏమిటి విశేషాలు" అంది రామనాథం "విశేషాలకేం కొదవ రోజూరోజూ చెప్పుకుంటుండవచ్చు" అన్నాడు "అన్నట్లు ఎప్పుడ చ్చేరు మీరు" అంది ఆమె రావడమేమిటి నేనూ ఈ వూళ్ళోనే పనిచేస్తూంటే శంకరపురంలో కూమకాం" అన్నాడు "వెరీగుడ్, రోజూ కలుసుకుంటూండవచ్చునింక అన్నట్లు టీ తెప్పించమన్నారా?" అంది రాజేశ్వరి. "వద్దు పుచ్చుకునే వచ్చేను అలా బయటకుపోదాం మీరింకా ఆఫీసు విడవదలచుకోలేదా" అన్నాడు "దానికేం, నడవండి" అంటూ కాగితాలు సర్దేసింది రాజేశ్వరి. ఇద్దరూ రాజేశ్వరి బసకు బయలుదేరేరు అది విశ్వేశ్వరపురంలో వుంది రామనాథం "బస్సులో పోదాం" మంటే-"వొద్దు నేనీ రోడ్డు ప్రక్క పడిగాపుల్లు పడలేను" అంటూ రోడ్డు ప్రక్కనే నడిపిస్తూ పోతూంది రాజేశ్వరి రామనాథం ఆమె పాదాలముందు పడే చీర కుచ్చెళ్లకేసి చూస్తూ నడుస్తున్నాడు ఇంతలో రాజేశ్వరి బస వచ్చింది అది చిన్నదే రెండుగదుల, వంటగది, స్నానాలగది నెలకు ముప్ఫయి రూపాయలద్దె యిస్తుంది రాజేశ్వరి.

అందులో రాజేశ్వరి, తల్లీ, చెల్లెలూ వుంటున్నారు చెల్లెలు స్కూల్లో చదువుకుంటూంది లోనికి రాగానే స్టౌ వెలిగించింది రాజేశ్వరి అతన్ని సమీపించి "మీరు కాఫీ త్రాగుతారా టీయా?" అంది అతను ఖంగారుపడుతూ "ఏదీ వొద్దు" అన్నాడు రాజేశ్వరి చమత్కారంగా చేతులు త్రిప్పుతూ "చెప్పాలి టైము లేదు" అంటే "కాఫీ" అన్నాడతను రామనాథానికి స్వర్గంలో వచ్చి పడినట్లుంది ఇంకెప్పుడూ రాజేశ్వరి బసలోనే వుండిపోతే యెంత బాగుండును?? అతను గోడమీద చిలక్కొయ్యకు తగిలించిన రాజేశ్వరి బ్లౌజుకేసి చూస్తున్నాడు ఇంతలో రాజేశ్వరి కాఫీ తెచ్చింది ఇద్దరూ ముఖాముఖిగా కూర్చుని త్రాగేసేరు "సినీమాకి వెడదామా" అంది రాజేశ్వరి "తప్పకుండా" అన్నాడు రామనాథం రాజేశ్వరి డ్రెస్ చేసుకుందుకు ప్రక్కగదిలోకి వెళ్లింది

అత నాలోచిస్తున్నాడు "రాజేశ్వరి నా భార్య అయితే ఎంత సుఖపడేవాడినో? ఆమెకూ, కామేశ్వరికీ ఎంత భేదం? రాజేశ్వరి నడతలో, బట్టల్లో, మాటల్లో ఒక పొందిక వుంది కామేశ్వరి పల్లెటూరిది ఎర్రతోలుంటే సరా? చదువు సంధ్యలు లేవు ప్రతీదానికీ వాదిస్తుంది నేను కనకనే ఆమెతో పడుతున్నాను నా జీవితమంతా యిలాగ రసహీనంగా గడపవలసిందేనా? " ఇంతలో సుమతి వచ్చి అక్కయ్యగదిలోకి దూసుకుపోయింది రామనాథం భావముద్రకేం భంగం కలగలేదు. "రాజేశ్వరి నెలకు రెండువందలు తెస్తుంది నేను రెండువందలయేభై తెస్తున్నాను గదా! వేన్నీళ్లకు చన్నీళ్లు తోడు ఎంతలో ఈడ్చి పారేద్దుము సంసారాన్ని ఇప్పుడు సంపాదించేవాణ్ని ఒకణ్ణే ఒక్కడి సంపాదన ఏం చాలుతుంది? 'పెట్టల్ని కొట్టా, పొయ్యిలో పెట్టా' భార్య యివి కావాలవి కావాలంటుంది రాణి బట్టలకీ చదువుకీ యివ్వాలిగదా? ఇంటికి మనియార్డరు సమయానికి చేరకపోతే పోస్టులో ఆగ్నేయాస్త్రాలు విడుస్తారు నాన్న" అని ఖేదం పొందేడు ఇంతలో సుభద్రమ్మ లోనికి వచ్చి 'ఎవరు?' అన్నట్లు పరకాయిస్తోంది "నేనండి పిన్నిగారూ! రామనాథాన్ని " అన్నాడు "నువ్వటోయ్ ఎంతగా మారిపోయావు నాయనా, ఆ బట్టతలేమిటి కుర్రతనంలో నే - అయినా అదృష్టచిహ్నంలే" అని సర్దుకుంది తొందరగా అన్నమాటల్ని సుభద్రమ్మ

"చిహ్నమేగాని అదృష్టం మాత్రం లేదు" అని నసిగాడు వస్తుంది తొందరపడకు - ఎందరు పిల్లలిప్పుడు నీకు? అందామె "ఒక్కర్తే ఆడపిల్ల "

"ఏమన్నా మాట కడుతున్నావా అమ్మాయి పెళ్లికి" అంది సుభద్రమ్మ. ఆమాట రామనాథంలో కొంచెం సంచలనం కలిగించింది అతనా సంగతి ఆలోచించలేదింత వరకు కొన్ని క్షణాలక్రితం తన పెళ్లి విషయం ఆలోచించాడు ఇప్పుడు సుభద్రమ్మ ప్రశ్నతో తాను పెద్దవాడినయ్యే నన్నమాట ఆకళింపుకి వచ్చింది ఆవిడ మళ్లీ "ఏదీ మీ ఆవిణ్ని తీసుకొచ్చేవు కాదేం? చక్కని చుక్క అని విన్నాను" అంది భార్య అందం పొగడబడడం గర్వకారణంగా వున్నా, ఆమాట రాజేశ్వరికి వినబడకూడదని అనుకున్నాడు "రేపు తీసుకొస్తాలెండి-ఆదివారం కాదూ?" అన్నాడు ఇంతలో రాజేశ్వరి వచ్చి "లెండి" అంది ఆమె పల్చని గళ్లచీర కట్టుకుంది గళ్ల బాడీ వేసుకుంది ముత్యాల దుద్దులు పెట్టుకుంది ఆవిడని చూడగానే "నేనూ బట్టలు మార్చుకుంటే బాగుండును" అనిపించింది రామనాథానికి అతను లేవబోతూంటే "నేనూ వస్తా" నంది సుమతి అక్కయ్య వద్దంటే, సుమతి "నువ్వెప్పుడూ యింతే నువ్వు చూసిన సినీమాల్లో సగమేనా నేను చూసేనా?" అంది రామనాథ మందుకుని "అక్కయ్య కెదురు చెప్పకూడదమ్మాయీ! స్కూల్లో చదువుకునే పిల్లలు సినీమాలు చూడనేకూడ దసలు" అన్నాడు నీతులు బోధిస్తున్న మేష్టరులాగ సుమతి వొళ్ళు మండింది అసలే అక్కయ్యమీద ఉక్రోషం ఉబుకుతుండగా ఈయనొకడు మధ్య!! వెంటనే "అవును-స్కూల్లో చదుకునే పిల్లలు సినీమాలు చూడకూడదు వాళ్ళంతా చావాలికదూ?" అంది రామనాథం వంటిమీద, విశేషించి మూతిమీద కొరడా దెబ్బ తగిలినట్లయింది "నే నెందు కన్నానురా బాబూ! ఈపిల్ల సామాన్యురాలు కాదు" అని తనలో అనుకున్నాడు రాజేశ్వరి చెల్లెల్నిల్లాగో సముదాయించి యింటివద్ద వదిలేసింది ఇద్దరూ బయలుదేరారు రామనాథం జట్కాలో పోదామంటే 'వద్దు వొళ్లు హూనం చేసుకుందుకా? నడిచే పోదా' మంది రాజేశ్వరి తనమాటనంత చులకనగా తోసేసినందుకు కించపొందేడు రామనాథం సినీమా హాలు సమీపించేరు టిక్కట్లు కొంటాననే రామనాథాన్ని ఆపి 'వద్దు మనకి టిక్కెట్లేమిటి? ఈ మేనేజరు మాకంపెనీకి వస్తుంటాడు" అని లోనికి వెళ్లింది రాజేశ్వరి ఒక సూటుధారి బయటకు వచ్చి యిద్దర్నీ తీసుకెళ్లి స్పెషల్ క్లాసులో పడేసేడు అక్కడ ఆట్టేమంది జనంలేరు ముందువరసలో ముగ్గురు స్త్రీలున్నారు ఆట అప్పటికే ఆరంభమయిపోయింది అయినా రామనాథం కాని, రాజేశ్వరి కాని విచారించలేదు సినిమా చూస్తున్నాడో లేదో గాని రామనాథం లోకాభిరామాయణం దంచేస్తున్నాడు ఆమెకూడా తెరమీద బొమ్మలు చూడడానికంత తహతహ చూపడంలేదు. ఏవేవో కాలేజీ దినాలు, స్నేహితులు, జారిపోయిన అవకాశాలు వ్యంగ్యంగా వాగ్రూపం దాలుస్తున్నాయి రామనాథం నోటంట-రాజేశ్వరికూడా సంభాషణలో యేమంత తీసిపోలేదు రెండు సార్లు కాబోలు ముందు లైనులోని స్త్రీలు వెనుదిరిగి చూస్తే రామనాథం గొంతు తగ్గించుకొన్నాడు మధ్యమధ్య ఆచీకటి వెలుగులో రాజేశ్వరి బుగ్గలకేసి చూశాడు అవి కామేశ్వరి బుగ్గలంత తెల్లగా లేకపోయినా అతన్ని మభ్యపుచ్చుతూనే వున్నాయి. ఆమె చెవుననున్న ముత్యాల దుద్దులు చిరునవ్వు నవ్వుతున్నాయి రెండుసారులు తెలిసో తెలీకో అతని చేతులు ఆమె భుజాలకి తగిలేయి ఆమె ముందుకు వంగి పమిట సర్దుకుని కూర్చుంది ఇంటర్వల్ వచ్చింది సోడాల వాడొస్తే యిద్దరూ చెరోటీ తీసుకున్నారు డబ్బులివ్వడానికి రామనాథం పర్సు తీసే లోపుగా ఆవిడే యిచ్చేసింది సినీమా అయిపోయేక వాళ్లిద్దరూ కొంతసేపు అక్కడే వుండిపోయారు-జనమంతా వెళ్లిపోయేదాకా రాజేశ్వరి సినీమా మానేజరుకు ధన్యవాదాలర్పించింది ఆతర్వాత రామనాథం ఆమె బసదాకా దిగబెడతానన్నాడు బస యింకా ఫర్లాంగుదూరముం

(38-వ పేజీ చూడండి)

కథానిక:

అన్నదమ్ములు

శ్రీ మానూరు రామకృష్ణారావు

"నిజంగా చెప్పమ్మా నీ ముద్దుల కొడుకును నేనే కాదూ?" అని అడిగేవాడు గోపి

"నిజమే నమ్మా నీవే చెప్పు నీకు నేనంటే యెక్కువ యిష్టమో - గోపి అంటే యెక్కువ యిష్టమో అబద్ధం చెప్పకుండా నిజం చెప్పు" అని మధు గోపి ప్రశ్నకు జవాబు రాకముందే తల్లిని అడిగేవాడు

"సరే అయితే - యెవరి పేరు చెప్పమంటారో మీరే చెప్పండి" అని కమల నవ్వుతూ అడిగేది

"నీకు యెవరంటే యెక్కువ యిష్టమో వాడి పేరు నీవే చెప్పు" అని యిద్దరు ఏకకంఠంతో అరచేవారు

"అలాగయితేసరే చెప్తాలే కాని " అని కమల యేదో ఆలోచిస్తున్నట్లు నటించేది తల్లి యెవరి పేరు చెప్తుందో నని పిల్లలిద్దరు ఆత్రంతో యెదురుచూస్తూ కూచొనేవారు

"కాని ముందు మీరు చెప్పండి నామీద మీ యిద్దరిలో యెవరికి యెక్కువ ప్రేమ?" అని కమల తిరిగి ప్రశ్నించేది

"నాకు నీవంటె యెక్కువ యిష్టం" అనేవాడు గోపి

"నాకే యెక్కువ ప్రేమ" అనేవాడు మధు

"సరే నాకు కూడ అంతే మీ యిద్దరిమీద సమానంగా వున్నది నా ప్రేమ" అని నవ్వుకుంటూ జవాబు చెప్పేది కమల

తల్లిప్రేమ పరిమాణాన్ని దాని విలువను యీ పిల్లలిద్దరు కనీసం నాలుగైదు రోజులకొకమారైనా పరీక్షచేసి పరిచూసుకొని సంతోషించుకుంటుండడము వారికి పరిపాటే గాక అలవాటుకూడ అయిపోయింది ఆమె జవాబుతో యిద్దరూ కిలకిలా నవ్వుకుంటూ ఆమె ఒళ్లోకి ఒక్కమారు పోయి వాలటం వారి కార్యక్రమంలో క్రమము తప్పని నియమమైంది

* * *

గోపి, మధు అన్నదమ్ములు దాదాపు యిద్దరూ ఒక్క మోస్తరుగా వుండేవారు రూపరేఖలలోనేమి, వయసులోనేమి ఆఖరకు వాళ్లు ధరించే దుస్తుల్లో కూడ ఒకళ్లని చూస్తే మరొకళ్లని చూడవలసిన అవసరము లేనట్లుండేది సాధారణంగా చూచేవాళ్లకు వాళ్లు కవలపిల్లలేమోననే అనుమానము కలుగుతుంది నిజానికి వాళ్లు కవలపిల్లలు కాదు సరిగదా ఆఖరికి స్వంతిసోదరులు కూడా కాదు ఈ విషయము ఆ వూళ్లో ఎవరికి తెలియదు కమల యీ సంగతిని పిల్లలకు కూడ తెలియనియ్యక యిద్దరికీ యెటువంటి అనుమానము కూడ కలుగనియ్యక సమానప్రేమతో చూసుకుంటూ వుండేది గోపి, మధులు తమ బాల్యక్రీడలతో తల్లిహృదయానికి ఆనందము కలుగచేస్తుండేవారు

కొంచెము సూక్ష్మంగా పరిశీలించిచూస్తే మటుకు కమలకు గోపిమీదికంటె మధుమీదనే ఎక్కువ ప్రేమవున్నట్లు కానవస్తుంది బహుశా యిందుకు కారణం గోపి స్వభావములోను మధు స్వభావములోను వున్న వ్యత్యాసమే ఐవుండవచ్చును ఎందుచేతనంటే మధు చాలా నిదానస్తుడు కొంత అమాయకత్వముతో కూడిన నాజూకు స్వభావము కలిగి యేవిషయానైనా తల్లితో చెప్పకుండా చేసేవాడు కాదు ఎంత చిన్నపనికి కూడా తల్లిమీదనే ఆధారపడివుండేవాడు ఆమెను చూడకుండా ఎక్కువసేపు వుండలేక పోయేవాడు గోపి స్వభావము దీనికి పూర్తిగా వ్యతిరేకముగా వుండేది అతను కొంచెము గడుసు ఆటలలో మునిగిపోయాడంటే ఎంతకాలమైనా తల్లి-యిల్లు ధ్యాసకూడా వుండేది కాదు తను చెయ్యదలచుకొనిన పనిని బ్రహ్మరుద్రాదు లడ్డమువచ్చినా పూర్తి చెయ్యనిదే వదిలేవాడు కాదు

కమల యెక్కడికైనా పనివుండిపోతే గోపి సాధారణంగా తోటిపిల్లలతో ఆడుకుంటూ యెక్కడికో సంచారానికి వెళ్లి కాలక్షేపం చేస్తుండేవాడు మధు మాత్రం యెక్కడికీ వెళ్ళక కమల వచ్చేదాక ఇంటి అరుగుమీద కూర్చొని ఆమెకొరకు నిరీక్షిస్తూ వుండేవాడు అంతదూరాన ఆమె కనపడగానే యెదురుగా పరుగెత్తుకొనిపోయి యెంతో కాలమునుండి వదిలివున్నవానిలాగా ఆమెను అనుసరించి వచ్చేవాడు అతని ఈ సున్నిత స్వభావమువల్లనే కమలకు కూడా వాత్సల్యత కొంత యెక్కువగా మధు వైపకే మొగ్గుగా వుండేది. అప్పుడప్పుడు యిరుగుపొరుగువారు కూడా "ఏమమ్మా కమలా, నీకు మధే ముద్దులకొడుకులాగా వున్నాడే" అనేవారు కమల యేమీ జవాబియ్యక వూరుకునేది కాని అటువంటి సమయాల్లో మాత్రం ఆమె మనోచక్రం గిర్రున తిరిగిపోయి పది సంవత్సరములనాటి భయంకర స్మృతిచిత్రం తన కళ్ళ యెదుట నిలచిపోయేది ఆ వృత్తాంతము నేటికి కూడా ఆమె స్మృతిపథంలో నూతనముగానే వుండిపోయింది

పది సంవత్సరముల క్రిందటి సంగతి ఆ సమయములో కమల పురిటికి పుట్టింటకి వచ్చివున్నది ఆమెకు రెండుమాసముల పసిపిల్లవాడు బాల్యక్రీడలతో తన కాలమంతా గడిపిన ఆ గ్రామములో బంధువులు, స్నేహితుల మధ్య ఆమెకు ఆనందముగానే వుండేది కాని త్వరలోనే తన భర్తవద్దకు వెళ్లవలసివున్నది ఈ వాతావరణం నుండి వెళ్లటము - అందులో ముఖ్యముగా తన ప్రియసఖి కళ్యాణిని వదలి వెళ్ళటము కమలకు కష్టముగా వున్నది

కళ్యాణి కమల పినతండ్రికుమార్తె చిన్నతనమునుండి యిద్దరూ చాల స్నేహముగా వుంటూవుండేవారు కాని పాపం కళ్యాణి దుఃఖజీవి ఆమె జీవితగాథ కమలను కల్లోలపరచింది కళ్యాణికి కూడ నాలుగు మాసముల పసిపిల్లవాడున్నాడు తన పెళ్లి అయిన కొద్దికాలానికే ఆమె తలితండ్రులు చనిపోయారు ఆమె అత్తవారింట అనేక కష్టము లనుభవిస్తూవున్నా తన భర్తకు ఆనందము కలుగజేసేందుకు అనేకవిధముల ప్రయత్నించింది కాని అతనుకూడ దుస్సహావాసములకు లోనై ఆమెను నానా హింసలు పెట్టాడు చివరకు యింట్లోనుండి వెళ్ళగొట్టే ప్రయత్నములో వున్నారని తెలిసి కమల తండ్రి ఆమెను తన యింటకి తీసుకొని వచ్చి ఆదరించారు ఇక నాటెకు పుట్టింటి

వారితరఫున పెదతండ్రి తప్ప వేరెవ్వరూ ఆధారము లేకపొయ్యారు ఆమె భర్త మరల తనవద్దకు తీసుకొనిపోయే ప్రయత్నము చేయలేదు కొన్ని పర్యాయములు ఆమే స్వయంగా వెళ్లినా అతడు చేరనియ్యలేదు అందుచేత ఆమె మనోవ్యథతో అవమానంతో క్రుసించుతూ పెదతండ్రి వద్దనే వుండవలసివచ్చింది

ఆరోజు రాత్రి గాఢాంధకారము భయంకరంగా నలువైపులా అలముకొని పోయి వుంది. ఈదురుగాలి జోరున వీస్తోంది వర్షము తెరిపి లేకుండా కురుస్తోంది అప్పుడప్పుడు ఉరుములు ఆ భయంకరరాత్రిని మరింత భయంకరంగా చేస్తున్నయి సన్నని బంగారుతీగల్లాంటి విద్యుల్లతలు తళుక్కున మెరసి వెంటనే ఆ నల్లటి గాఢాంధకార గర్భంలో లీనమై పోతున్నయి

ఒక ప్రచండ మేఘగర్జన ధ్వనికి కమలకు హఠాత్తుగా మెలుక్కువ వచ్చింది వాయువుప్రకృతం యింకా తగ్గలేదు ఆ గాలిలో యెక్కడో ఒక తెరచుకొనిన తలుపు దబా దబా కొట్టుకొనే ధ్వని వినవస్తుండెను కమలకు అంతా యేమో అయోమయంగా భయంగా వుంది ఇంతలో కళ్యాణి గదిలోనుంచి ఆమె పిల్లవాని యేడ్పు కమల చెవులకు తగిలింది రెండు మూడు నిమిషాలు చూసింది ఇంకా ఆపిల్లవాడు యేడ్పు ఆపలేదు ఐదు నిమిషాలు అయింది పదినిమిషాలుకూడా గడచిపోయింది అయినా ఆ పిల్లవాడు యేడ్పు చాలించలేదు పోనుపోను యింకా బిగ్గరగా గుక్కపెట్టి యేడుస్తున్నాడు కమలకు యిదంతా ఒక వింతగా తోచింది పక్కలో పిల్లవాడు యింత బిగ్గరగా యేడుస్తున్నా మెలుకువ రానంత గాఢనిద్ర కళ్యాణికి యెలా పట్టిందా అని కమలకు ఆశ్చర్యం వేసింది ఆమె మంచముమీద నుంచి లేచింది కుర్రవాడు యింకా యిల్లెగిరి పోయేట్లు యేడుస్తూనే వున్నాడు కళ్యాణి గది తలుపు గాలికి కొట్టుకుంటూనే వుంది ఆమె మెల్లగా కళ్యాణి గదిలోకి పోయి మంచంమీద చూసింది అక్కడ ఆమె కనపడలేదు బహుశా ఆమె నీళ్లగదిలోకి యేమైనా పోయివుండవచ్చునని భావించి యేడుస్తున్న కుర్రవానిని యెత్తుకొని సమాధాన పరచింది పావుగంట దాటిపోయినా కళ్యాణి వచ్చేజాడే కానరాలేదు కుర్రవాడు యేడ్చి యేడ్చి అలసి కమల భుజంమీదనే నిద్రపోయాడు అందుచేత వాడిని మంచముమీద పరుండబెట్టుండగా దిండుమీద ఒక చీటి కనిపించింది అది కళ్యాణి స్వదస్తూరితో తన పేర వ్రాసిన చీటి అని చూసి తెలుసుకొని ఆశ్చర్యంతో మనస్సులో యేదో చెప్పరాని ఆవేదన కలతపెట్టుతున్నా ఆచీటి చదువసాగింది అందులో కళ్యాణి యిలా వ్రాసింది

"ప్రియమైన కమలకు

నేను చేస్తున్నది ఒక ఘోర భయంకర పాప కార్యమని తెలిసికూడా చేస్తున్నాను నాకు యీ దౌర్భాగ్య దుఃఖ జీవనము దుర్భరమవటంవలన చివరకు యీ లోకాన్ని వదిలి వెళ్లేందుకు నిశ్చయించుకొన్నాను కాని వెళ్లేందుకుకూడా ఒక్క పెద్దసమస్య అడ్డు తగులుతుంటేది అది యేమిటంటే నా పసిపాప నీవు తప్ప నన్ను ఆదరించి అభిమానించిన ఆప్తులు నాకింక ఎవరున్నారు? నిన్ను గాక మరెవరిని సహాయము కోరగలను? అందుచేత యీ పసిగుడ్డును నీ ఒళ్ళోవేసి నేను శాశ్వతంగా సెలవు తీసుకుంటున్నాను ఇదే నా ప్రేమస్మారకంగా భావించి నీప్రేమ పరిధానాన్ని వానిమీద కప్పి నీ స్వంత వాణ్ణిగా చేసుకో కమలా ఇక సెలవు

ఇట్లు నీ అభాగ్యసోదరి
కళ్యాణి

ఈ వుత్తరం 'చదువుచుండగనే కమల చేతులు కంపించినయి దుఃఖము భరింపలేకపోయింది అప్రయత్నంగా ఆ వుత్తరం క్రింద పడిపోయింది మాతృప్రేమ సౌఖ్యానికి నోచుకొనని ఆ అభాగ్య శిశువును ఒక్కమారు గట్టిగా తన హృదయానికి హత్తుకొన్నది పాపం కళ్యాణి తుదకు ఆత్మనాశనానికే సాహసింపజేసిన యెంతటి దుర్భరపరిస్థితులు ఆమె జీవితాన్ని ముట్టడించినయో కమలకు గోచరము కాలేదు తనవంటి ఆప్తమిత్రురాలికి కూడా కళ్యాణి తన మనస్సు తెలుపనందుకు ఆమె చాల విచారించింది ఆమె వెంటనే వెళ్లి యింట్లోనివారి నందరిని మేల్కొలిపింది ఆ చీకటిలో - ఆ భయంకర వాతావరణంలోనే నలుగురు నాల్గువైపులా కళ్యాణిని వెతుక నారంభించారు దగ్గరలోనే వున్న చౌకీదారు తనకు అర్ధరాత్రి సమయములో అక్కడి భావిలో అకస్మాత్తుగా ఏదో పడిన ధ్వని వినవచ్చిందని చెప్పాడు కొందరు వెళ్లి తాళ్లు గాలాలు తీసుకొని ప్రయత్నించారు కాని ఆ చీకటిలో వారికి యేమీ తగలలేదు మరునాడు మధ్యాహ్నం ఆ భావిలోనే కళ్యాణి శవము తేలింది కమల దుఃఖముతో క్రుంగిపోయింది ఆమె తలితండ్రులు అవమానంతో దుఃఖముతో చాల కలతచెందారు

ఇక ఆ గ్రామములో స్త్రీలలో అనేకరకాల మాటలు బయలుదేరినయి ఒకామె అన్నది "పాపం కళ్యాణి బ్రతికివున్నంతకాలము కొంచెమైనా సుఖానికి నోచుకోలేదుకదా! ఆమె భర్త చూడు ఎలాంటి దుర్మార్గుడో! వట్టి రాక్షసుడు!! అక్కడ వున్నంత కాలము కాల్చుకొని వేధించాడు! పాపం యీ యమయాతనలనుంచి విముక్తిచేసుకొని పోవటమే మేలైంది"

మరొకతె యిలా అన్నది "ఆహా! ఏమి తెలివిగా మహా తెలిసినదానిలాగా మాట్లాడుతున్నావే! ఆయన చాలా మంచివాడు ఈమెగారే యింకెవరినో మరిగి ఆయన్ను నిర్లక్ష్యపరచింది ఇప్పుడు పుట్టిన పిల్లవాడు కూడా ఆయనగారి అనుగ్రహమేనట! అందుకనే మళ్లా మొగుడికి ముఖం చూపేందుకు ధైర్యము చాలక చివరకు యిలా చేసుకున్నది"

ఈవిధంగా యిలాంటివే అనేకరకాల వాదప్రతివాదనలు కళ్యాణిమృత్యువును గురించి చర్చింటములో ఆ గ్రామవనితలు తమ అఖండకల్పనాసామర్థ్యాన్ని ప్రకటించారు ఇటువంటి శుష్కవిమర్శనలు కమలను చాల కలవరపరచినయి కారణమేదైనా కాని తనకు తన జీవనము దుస్సహమని తోచుటచేత నేగదా కళ్యాణి పసిపాపను సైతము వదలి యిట్టి సాహసానికి పూనుకొన్నది

ఆ రోజునుంచి కమల కళ్యాణి కుమారునివలె అత్యంత ప్రేమతో పెంచుతూ వచ్చింది మరల తన భర్తవద్దకు వచ్చేటప్పుడు యిరువురు బిడ్డలతో వచ్చిన ఆమెను చూచి ఆ గ్రామస్తులందరు వారిద్దరు ఆమె కవలపిల్లలని భావించారు ఆశ్చర్యచకితుడైన తన భర్తకు కళ్యాణి వుత్తరము చూపి తన సోదరి అంతిమ వాంఛను పరమ పవిత్రకర్తవ్యముగా పాలించేటట్లు అంగీకరింప చేసింది ఆ పిల్లలిద్దరు స్వంతసోదరులుగా మెలుగుతూ దినదినాభివృద్ధి చెందుతూ వున్నారు

ఈ సంఘటన కమలకు యెప్పుడూ నిత్యనూతనంగానే వున్నది

2

కాలగమనంలో పదిసంవత్సరాలు ఇట్టె గడచిపోయినయి గోపి, మధులు పరస్పరాభిమానాలతో వుంటూ చదువుకుంటు

న్నారు ఆ సంవత్సరం మళ్లా కమల పుట్టింటికి వచ్చింది అంతవరకు ఆ పిల్లల మనస్సులకు తాము స్వంతసోదరులు కారనే సంశయము ఎంతమాత్రము వుత్పన్నమై వుండలేదు

కమల వచ్చిన మరునాడు పొరుగింటి అవ్వగారు ఆమెను చూచేందుకు వచ్చింది "అబ్బో చాలా కాలానికి వచ్చావే అంతా కులాసాగా వున్నారు గదా?" అంటూ కుశల ప్రశ్న వేసింది

"మీదయవల్ల అంతా క్షేమమేన"ని కమల జవాబిచ్చింది

"మరి నీ కొడుకు బాగా చదువుతున్నాడా?" అని రెండవ ప్రశ్న వేసింది "బాగానే చదువుతున్నాడ"ని కమల ప్రత్యుత్తర మిచ్చింది

"సరేగానీ " అంటూ ఆమె పిల్లల మీదనే చూపు నిలిపి యేదో అడగబోతున్నది ఇప్పుడు ఆమె యేమి అడుగుతుందో కమలకు తెలిసిపోయింది "చాలా మారిపోయారు గదూ పిల్లలు గుర్తుపట్టలేక పోతున్నాను ఎప్పుడో రెండు నెలల పిల్లలప్పుడు చూశాను అయితే—" అవ్వగారి మాటలకు కమల అడ్డమువచ్చి "ఒరే మధూ— గోపీ మీరు లోపలికివెళ్లి ఆడుకోండి— పోండి" అని కొంచెం బిగ్గరగా అరచింది

తల్లిమాట ప్రకారం పిల్లలు లేచి వెళ్లబోతుండగా అవ్వగారు అడగదలచిన ప్రశ్న అడగనే అడిగింది "అయితే—వీళ్లలో నీ కొడుకెవరు? కళ్యాణి కొడు కెవరు?—"

అవ్వగారు వేసిన యీ ప్రశ్న చెవిన పడగానే పిల్లలిద్దరు దిగ్భ్రమతో నిలచి వెనుకకు తిరిగి చూశారు గోపిమాత్రం కలవరపాటుతో కమలవైపు చూశాడు కాని కమల వెంటనే "గోపీ - నీకు వినపడటం లేదూ లోపల అత్త యెందుకో నిన్ను పిలుస్తున్నది వెళ్లు త్వరగా" అని గదిమింది

పిల్లలు లోపలికి పోయారు గాని వాళ్ళ కాళ్లు తడబడుతూనే వున్నవి దీని పరిణామము వారి లేత మనస్సులలో యేవిధంగా అవుతుందోనని కమలకు వ్యాకులము కాజొచ్చింది అవ్వగారి పని పూర్తయినట్లు ఆమె వెళ్లేందుకు లేచింది

"పిల్లలకు యింకా వాళ్లు స్వంత అన్నదమ్ములు కారనే సంగతి తెలియదు నేను వాళ్లిద్దరిని ఒక్క విధంగానే చూసుకుంటున్నాను వాళ్లు బహుశా మీ ప్రశ్న వినే వుంటారేమో?" నని కమల అన్నది

"ఆ అందులో యేముంది? వెనుకో ముందో యీ విషయము యెప్పటికైనా తెలియక పోతుందా?" అన్నది అవ్వగారు

"ముందు యెప్పుడైనా తెలిస్తే తెలియనియ్యండి కాని వీళ్ళింకా పసివాళ్లు అమాయకులు వాళ్ల మనస్సులింకా సున్నితంగా వుంటయి అందుకని వాళ్లకు బాగా వూహ తెలిసేదాకా యీ సంగతి తెలుపకూడదని నిశ్చయించుకున్నాను" అన్నది కమల

"ఓహో - అలాగా అయితే నాకేం తెలుసు నీ అభిప్రాయం నేనేదో సహజంగా మామూలు మాటగా అడిగాను" అంటూ మూతిముడుచుకొని అవ్వగారు లేచి వెళ్లిపోయింది అయినా కమల మనస్సులో మాత్రం ఏదో వక విలక్షణమైన ఆందోళన ప్రారంభమైంది

రాత్రి భోజనాలైనాక మధు గోపు యిద్దరూ వచ్చి తల్లికి చెరొకవైపు యిరికారు కొంచెం సేపయినతర్వాత గోపి అడిగాడు

"అమ్మా ఆ కళ్యాణి యెవరు?"

"ఏ కల్యాణి - ఎవరో నాకు తెలియదే" అని కమల తొట్రుపాటుతో అనింది

"ప్రొద్దున ఆ పొరుగింటి అవ్వగారు అడగలేదూ నిన్ను - వీళ్ళల్లో నీ కొడుకెవరు - కళ్యాణి కొడుకెవరు - అని? అదే ఆ కళ్యాణో-ఎవరమ్మా ఆమె?" అని మధు వివరంగా ప్రశ్నించాడు

"ఓహో - అదా సంగతి! సరే అదంతా ఒక పెద్దతమాషాలే కళ్యాణి నా స్నేహితురాళ్ళలో ఒకతె చిన్నతనంలో మేమంతా ఒక గమ్మత్తు చేసేవాళ్లము అవ్వగారు అడిగింది ఆ గమ్మత్తునుగురించే" అని యేదో సమాధానం చెప్పింది కాని ఆ పిల్లలకు తమ తల్లి ఏదో అబద్ధము చెప్తున్నదనే అనుమానం కలిగింది అందుకని యిద్దరు కూడా "ఆ గమ్మత్తేమిటో మాకు చెప్పమ"ని పట్టు పట్టారు

"మీరు యింకా చిన్నవాళ్లు చెప్పినా మీకు అర్థం కాదు పోనీ ఒక చిన్న తమాషా కథ చెప్పనా?" అని అడిగింది కమల

"మాకు కథవద్దు కాదు కాని యీ ఒక్క సంగతి చెప్పు మే మిద్దరము నీ కొడుకులము కామా?" అని మధు అడిగాడు ఆమె ఆశ్చర్యచకిత అయింది అప్రయత్నంగా ఆమె గోపివైపు చూచింది గోపికూడ వంటనే "నిజమేనమ్మా - మా యిద్దరిలో నీకొడుకు యెవరు కాదో అదన్నా చెప్పు" అని తెలివిగా అడిగాడు

కమల నిరుత్తర అయింది ఆమెకు వెంటనే ఆ భయానక సంఘటన స్మరణకు వచ్చింది లోపలి దుఃఖము పైకి కనపడనీయక "మీలో యెవరికి నేను మీ తల్లిని కాను అని తోస్తుందో నేను వాళ్ల తల్లిని కాను మరిప్పుడు మీరే చెప్పండి నే నెవరి తల్లినో?" అని అడిగింది

"నాకు తోచదు" అని గోపి వెంటనే అన్నాడు

"నాకూ తోచదు నీవు నా అమ్మవే బహుశా గోపి అమ్మవు కావేమో" అని మధు బిగ్గరగా అరిచాడు గోపికి వెంటనే కోపము వచ్చింది "ఏ మీ కాదు అమ్మ నా అమ్మే 'నేనే యెక్కువ పోలికగా వుంటాను నీవే కళ్యాణి కొడుకువి" అంటూ మధును గట్టిగా వెనక్కు తోశాడు పాపం మధు మాట్లాడకుండా లేచాడు కమల అతన్ని దగ్గరకు తీసి విసుగ్గా "ఏమిటి గోపీ నీ అల్లరి - వూరికే మాట మాత్రానికే అంత కోపగించుకుంటావు? - సరే యిప్పుడు చెప్పండి మీరు - అమ్మ అంటే యెవరు?" అని అడిగింది

"అబ్బ భలే ప్రశ్న వేశావే? అ దెవరికి తెలియదూ? ఎవరు తన బిడ్డల్ని కంటుందో ఆమే అమ్మ" అని గోపి జవాబు చెప్పాడు

"ఛా అదేం కాదు ఎవరి మనస్సులో తను తమ తల్లి అనే భావన కలుగజేస్తుందో ఆమెయే తల్లి" అని కమల అన్నది

"మరైతే మా యిద్దరికీకూడా నీవే అమ్మ వనే భావన కలుగుతున్నదిగా" అని మధు తన సందేహాన్ని వెళ్ళబుచ్చాడు

"అంతే మరి నేను మీ యిద్దరికీ అమ్మనేగా!" అన్నది కమల

"మరైతే ఆ కళ్యాణి యెవరు? అని మళ్లా ప్రశ్నించాడు గోపి

"ఎవ్వరూ కాదు అదంతా వట్టి తమాషా మీ రిద్దరూ నా కొడుకులే ఇక పోయి నిశ్చింతగా నిద్రపోండి" అని కమల వాళ్ళను బుజ్జగించి పంపింది వాళ్లు సమాధానపడి వెళ్లి నిద్రపోయారు కమల విచారంగా ఆలోచిస్తూ కూచున్నది

మరునాడు మళ్లా గోపిహృదయానికి తీవ్ర ఆఘాతము కలిగింది సాయంకాలము కొందరు పిల్లలతో గోడి - బిళ్ల ఆడుకొనేందుకు గోపీ-మధుకూడా వెళ్లారు అందులో ఒక కుర్రవాడు గోపును దగ్గరకు పిలిచి అడిగాడు

"ఓరే నీ పేరేమిట్రా?"

"గోపి"

"మరి ఆ అబ్బాయి పేరో?"


"మధు"

"సరే వా డెవరో నీకు తెలుసా?"

"వాడు నా తమ్ముడేగా!"

ఓహోహో - భలే భలే" అంటూ అప

(20-వ పేజీ చూడండి)



రైల్లో గలాటా

"హరహరమహదేవ్"

కటకం పోబోతున్న ధూమశకటం కిట కిట లాడుతోంది రైల్లో క్రిక్కిరిసి వున్నారు ప్రయాణీకులు నేనుకూడా ఖర్మవశాత్తు ఆ కంపార్టుమెంటులో నే వున్నాను అది నా అదృష్టమే అనండి లేక దురదృష్టమే అనండి చెప్పాగను కోండి ఆరోజు ఈ సందర్భంలోనే కొంప మునిగి పోయినట్లు టికెట్ కలెక్టరు దయ చేశాడు, అసలే ఊపిరి సలపక చస్తూంటే!

నా చేతిలో 'ఆంధ్రపత్రిక' దినపత్రిక వుంది. కొన్నానని వేరేగాని ఆమెగారు చదవనిస్తేనా ? జట్టీకి తగుల్కుంది ?

పత్రికాపఠనం ప్రారంభించాను నా ప్రక్కసీటులోనే ఒక పాకెట్ రుమాలుంది ఆ రుమాలుమీద ఎవరూ కూర్చోనూ లేదు ప్రక్కకి లాగిపారేయనూ లేదు

ఇంతలోనే ఒకామె గాభరాగా రైలెక్కింది సరిగ్గా మా కంపార్టుమెంటులోనే కాలు పెట్టింది లేడీస్ కంపార్టుమెంటు చూసుకోక! అదే కాని మగపురుగైతే ఖాళీలేదని త్రోసి పారేద్దురు. కానీ ఈమె మృదుహస్తాలకి మస్నణచరణాలకి ఏం ప్రమాదం సంభవిస్తుందో!—లోనికొచ్చి ఎక్కడైనా కూర్చుందికి ఖాళీ వుందేమో నని వెదక నారంభించింది వెతకడానికి కదలిక అనేది వుండాలిగా ! మరి ప్రజలంతా అడ్డగ నున్నారు ! అయితే ఈమె 'స్త్రీ' కాబట్టి ఖాళీ యిచ్చారు తిరగడానికి ! ఎక్కడా ఎసరన్నా సలం సహి ముడ్డి మోపడానికి 'ఆంధ్రపత్రిక' లో వార్తలు చదవ నారంభించాను

"కొరియా యుద్ధం విరమణ విషయంలో ఉభయ దేశాల సేనాధిపతులు చర్చలు జూలై 10 నుండి ప్రారంభిస్తారు " అని ఇంకా ఏమేమో చదవబోయాను

'ఏమండీ' అన్నమాట వినగానే చదువు ఆపేసి తల పైకెత్తక తీరలేదు ఆమె నాకెదురుగా నించుంది నన్ను ఎలిచినది ఈమెయేనా కాదా అని అనుమానం వేసి మళ్ళీ పేపరువైపు ముఖం త్రిప్పాను ఎంచేత నంటారా ? తీరా నేనుకూడా ఆమెని పలకరిస్తే 'షటప్ ఇడియట్' అని ఒక్కమాట జార్చేస్తే ఎంత సిగ్గో చూడండి! అందులోకీ ఆమె మంచి గ్లామర్ గర్ల్ లాగుంది పైకి

"రిడ్జ్ వేని యుద్ధం ఆపమని ట్రూమన్ సందేశానికి రిడ్జ్ వే ఆమోదం"

'ఏమండోయ్! మిమ్మల్నే!' అందామె. ఇప్పుడెవరు పిలిచారో గ్రహించాను

'ఆఁ! ఏమిటండీ? అన్నా మెల్లిగా—

'ఏమీలేదు దయచేసి పాకెట్ రుమాలు తీస్తారా ?'

నాగుండె లారిపోయాయ్! ఇనకా ముందు చూస్తున్నాను !

'మిమ్మల్నేనండీ! ఒకసారి ఆ కర్చీఫ్ తీసి వేడతారా ?' అంది స్లోగా—

'క్షమించండి!' అని మాత్రం అన గల్గాను

'దీనికి క్షమించాల్సిం దేముందిలెండి రుమాలు తీస్తే చాలు క్షమాపణలూ అవసరం లేదు! అంది అధోరకంగా! ఆమె నన్నెగతాళి చేస్తున్నట్టుంది

రుమాలుతీస్తే క్షమించక్కర్లేదట! తియ్యకపోతే తంతుంది కాబోలు! ఆడదైనా కూడా ఆ కూతలు చూడండి! మరి నాదగ్గర మాత్రం ఆ పప్పు ఉడకవ్! చదువుకునే స్టూడెంట్ని ఆమె అలాగంటే సిగ్గు కాదు? అందులోకీ చదువుతున్నది ఇంటర్ సీనియర్ (మొన్న నే మార్చిలో డింకీ కొట్టాను లెండి) పెధవది లా కాయిలా కాయి స్కూలు ఫైనల్ క్లాసు కాదాయె! (ఇందులోకూడా దండయాత్ర ఓసారి చేశాను) ఆమె తంతానన్నట్లు, ఎంత ఖండై పెట్టగా చెప్పింది? ఎన్ని గుండెలుండాలి?

అసలు మొదట్నుంచీ మాకూ అనుభవం వుంది, మా కాలేజీగర్ల్స్ని స్టూడెంట్సుని అల్లరిచేయడాలు అవీని మేము మా లేడీ స్టూడెంట్స్ని 'కేర్' చెయ్యం! ఎంతో కొయ్యలా ప్రవర్తిస్తాము అటువంటిది ఈవిడగారట! నన్నట! తంతుందట! కట కటా! ఎంత అసందర్భంబు? ఎంత అక్రమంబు? ఎంత అన్యాయంబు?

'వెరీ సారీ' అన్నాను కొంచెం మోటుగా—

'డోంట్ వర్రీ! పాకెట్ రుమాలు తీయమని కోరిక'

'తీస్తే ?'

'దానికి బదులింకోవ్యక్తి కూచోవొచ్చు చూడండి!'

'కూచోవచ్చు కానీ' అని నసిగాను

'కానీకి అణాకి ఏముందిందులో? కాస్త రుమాలు జేబులో పెట్టండి!' ఈ మాటల్లో కొంచెం కాఠిన్యం గోచరిస్తోంది

'అది జేబులో పెట్టలేను మరోలా అనుకోకండి!' నేనన్న మాటల్లోకూడా కాఠిన్యత వున్నట్లు ఆమె గుర్తించి వుండాలి!

(19-వ పేజీ చూడండి)



కథ అడ్డం తిరిగింది!!

శ్రీ మధురాంతకం రాజారాం.

జయాపజయాలు మన చేతుల్లో లేవు ఉంటే నేను ఫోర్తుఫారంలో మూడుమాట్లు ఫైల్ కాకనే వుందును పరీక్షలు తప్పనందుకు నేను అణుమాత్రమైనా చింతించలేదు ఎంత పట్టుదల వున్నప్పటికీ విధి అనుకూలించనిదే మానవ ప్రయత్నం ఫలించదని నాకు తెలుసు తెలిసి తెలిసీ విచారించడానికి నేనేమీ మూర్ఖుణ్ణిగాను

లోకంలో అందరూ చేసుకుంటున్నట్లుగా పెండ్లి చేసుకోడం గూడా నాకిష్టం లేదు వివాహాన్ని గూడా దైవాయత్తం చేసిన దైవాధీనుణ్ణి నేను! నవలల్ని చదివి, సినిమాల్ని చూచి నేను ఎచ్చివాడినైపోయానని కొందరి ఉద్దేశం పిచ్చివాళ్లకు లోకమంతా పిచ్చిగానే తెలుస్తుందట!

చాలామంది యువకులకు వున్నట్లుగానే నాకూ ఒక ప్రియురాలు వున్నది అజంతా నాగకన్యలు కూడా సౌందర్యంలో ఆమె ముందు తీసికట్టే! ప్రబంధనాయికల్లో ఒక్క వరూధిని మాత్రం ఆమెకు కుడి ఎడమగా సరిపోవచ్చు ఆమె పేరు గానీ నివాసం గానీ కులగోత్రాలు గానీ నాకు తెలియవు ప్రస్తుతం ఆమె నా మనఃఫలకం మీద చిత్రింపబడి వున్నది కానీ ఏ క్షణంలోనైనా ఆమె నాకు మానవరూపం దాల్చి ప్రత్యక్షమయ్యే అవకాశం వుంది అట్లని నేను భారమంతా భగవంతునిపైన వేసి వూరుకోలేదు సుమండీ! ఇప్పటికి అయిదేండ్లనుంచి రైలు ప్లాటుఫారాల్లో బస్సుస్టాండ్లలో గాలించుతూనే వున్నాను ఆ ఎదురుచూస్తున్న ముహూర్తంకోసం ఎంతో ఆతురతతో నిరీక్షిస్తూనే వున్నాను

ఎందరో అందగత్తెలు నాకు కనపడ్డారు ఏదో వేరే పనిగా వస్తుంటేనే ఈ కాలం రకరకాల సౌందర్యవతులు కంటపడతారు ఇక అదే పనిగా దేశసంచారం చేస్తున్న నాకు నేత్రానందకరంగా, అసంఖ్యాకులైన నవయౌవనవిలాసినులు ప్రత్యక్షం గావడం అబ్బురమా మరి? ఇంతో, అంతో భావకవిత్వపు ఎచ్చిగూడా నాలో వుండటంచేత కనుపించిన కాంతలందరిమీదా అమువుగా ఎన్నో గేయాలు వ్రాశాను వాటిని చదివిన నా మిత్రుడొకడు "శ్రీనాథుని నీలాటిరేవువర్ణన లెందుకురా నీ గేయాల ముందు? పోషించి, ప్రోత్సహించే ప్రభువు లేరుగానీ, నువ్వు కావాలంటే కనీసం ఒక యిరవై కంచు ఢక్కలైనా పగులగొట్టగల ధీమంతుడవురా" అన్నాడు

ఇంతకూ నాకు కనపడ్డ యువతులందరూ నా 'స్వప్నసుందరి లాంటి అందగత్తెలు కారు (నేను మనస్సులో చిత్రించుకొన్న సుందరి అప్పుడప్పుడూ నా కలల్లోకిగూడా వస్తూంటుంది కాబట్టి ఆమెను 'స్వప్న సుందరి అని ఉదహరిస్తున్నానని పాఠకులు గమనించాలి) కానీ అందమనేదాన్ని గురించి ఎన్నో కోట్లకొలది అభిప్రాయ భేదాలున్నాయి నాకు అందంగా వున్న 'ఆమె ఇంకొకరికి కలా కనుపించకపోవచ్చు అసలు నాకు నీలమేఘచ్ఛాయవంటి నిగనిగలాడే శరీరం కల అమ్మాయిలంటే చాలా యిష్టం! ఎర్రటి ఆడవాళ్లంటే, అదేమో నాకు పరమాసహ్యం! 'లోకో భిన్నరుచిః' అన్న సామెత వుండనే వున్నదాయె నిరాడంబరంగా తోట్లో చెట్లకు నీళ్ళు పోస్తున్నప్పుడు భార్యను ముద్దెట్టుకొని, సర్వాభరణభూషితురాలై పడకటింట్లోకి వచ్చినప్పుడు పెడముఖంతో అటువైపు తిరిగి పడుకొనేవాడట ఎవడో కళాపూర్ణుడు!

విసిగి వేసారిపోయాను గానీ నేను కోరిన కొండలో వాన కురవనే లేదు ఎంతో విశ్వాసంతో దైవాన్ని నమ్మిన నాకు ఇంతటి ఆశాభంగం కల్గటం సహించరాని విషయం! ఎల్లకాలమూ నేనిలాగే ప్రణయాన్వేషిగానే వుండిపోతానేమోనని గూడా నాకు భయం కల్గింది ఈ భయం కల్గినప్పుడంతా నేను విశేషమైన పట్టు

దలతో కొన్ని సాహసకార్యాలు చేశాను నేనయితే నేను చేసిన పనుల్ని సాహసకార్యాలంటున్నాను గానీ, కొందరు వాటిని తెలివితక్కువ పనులు అని, ఆ పనులవల్ల నాకు తీరని అవమానం జరిగిందని అంటారు దూషణ, భూషణలుగానీ, అవమాన సన్మానాలుగానీ శరీరానికే గానీ, ఆత్మకు గాదన్నారు మన పెద్దలు! ఎవరో మూర్ఖులు 'నీకు పరాభవం జరిగిం'దన్న మాత్రాన నేను బెంబేలుపడిపోయే రకమా పవిత్రమైన ఈ కర్మభూమిలో జన్మించినవాణ్ణి!

ఒకనాటి తెల్లవారి కాఫీ త్రాగుతుండగా నా బుర్రలో ఒక అద్భుతమైన ఆలోచన తట్టంది ఎన్నో ప్రేమఘట్టాలకు బిక్షు పెట్టిన మద్రాసుబీచ్‌లో నా అదృష్టరేఖను పరీక్షించుకుంటే? ప్రేమకు సంబంధించిన నవలలు, కథానికలు, నాటకాలు అన్నీ క్షుణ్ణంగా చదివినవాణ్ణని ముందే చూచాయగా మనవి చేసుకున్నాను బహుశా అందువల్లనే నాకీ ఆలోచన తోచి వుంటుందనుకుంటాను

ఈలాంటి జీవితసమస్యల్లో ఒక్క సెకండు ఆలస్యమైనా అమృతం విషమై పోతుందని నా విశ్వాసం! అందుకనే ఆ సాయంత్రమే బయల్దేరాను మద్రాసుకు

2

సంధ్యాసమయానికి బీచ్ కలకంఠుల కలకలంతో నిండిపోయింది ఎందరు వస్తున్నారు? మందగమనంతో ఎందరు యువతులు సముద్రతీరంలో పచారు చేస్తున్నారు? వీళ్లల్లో ఏ ఒక్కరైనా నా కోసం కాచుకొని వున్న మోహినిగా వుండరాదా అని నాకు చిరాకు వేసింది ఈ కఠినహృదయులకు నా హృదయతాపం ఏం తెలుసు? ఆలోచించగా, ఆలోచించగా ఈ విశాలప్రపంచంలో చూచింఛే తడవుగా నన్ను ప్రేమించగల యువతి లేనే లేదేమో ననిపించింది ఉంటే కేవలం ఒక క్రీగంటి వీక్షణమైనా లభించివుండదా?

నిరాశా నిస్పృహలతో తపించిపోతున్న నాకు ఏలా వచ్చిందో నిద్ర వళ్లు తెలియకుండా వచ్చేసింది అపరసాయంకాలంలో నిద్ర ఏమిటని ప్రశ్న రావచ్చు ఉదయం నుంచీ మద్రాసులో నేను తిరగని వీధి లేదు బాగా అలసిపోయాను నిద్రలేచి చూచే సరికి ఆకాశంలో చంద్రుడు వెల్గుతున్నాడు దాదాపు పదిగంటలై వుండవచ్చు బీచ్ నిర్జనంగా వుంది

సముద్రం ఉవ్వెత్తుగా లేస్తున్న తరంగాలతో మహా సంక్షోభంగా కనుపించింది చెప్పవద్దూ! నాకు కొంచెం భయం వేసింది నే నెప్పుడూ సముద్రానికి అంత దగ్గరగా పండుకొని నిద్రించినవాణ్ణిగాను భూగోళంలో ముప్పాతిక బాగం ఆక్రమించిన ఈ సముద్రం తలచుకుంటే ఈ యిరవై గజాలు పొంగివచ్చి వుండగూడదా? అప్పుడు నా గతి ఏమయ్యుండేది?

లేచి మెల్లగా నడవడం ప్రారంభించాను నేను మౌంటురోడ్డులోవున్న ఒక హోటలుకు వెళ్లాలి ఒక ఫర్లాంగు దూరం వెళ్లివుంటాను నా కాలికి మృదువుగా ఏదో తగిలింది అదొక డైరీ వంగి దాన్ని చేతికెత్తుకొన్నాను దాన్లోనుంచీ ఒక ఫోటో జారి క్రిందపడింది

చెప్పితే మీరు నమ్మరు! ఆ ఫోటోలో వున్నది నిజంగా జగదేకసుందరి! చంద్రుణ్ణి చూచి సముద్రం పొంగిపోతున్నట్లుగా ఆ ఫోటోను చూచి నా హృదయం పొంగి పోయింది

తొందరగా డైరీ తెరచి మొదటి పుటను చూచాను వెన్నెల వెలుగులో అక్షరాలు స్పష్టంగా కనుపించడంలేదు దీపం దగ్గరికి వెళ్లి చదువగల నిబ్బరమూ లేదు ఎట్లాగో కష్టపడి చదివాను "మాణిక్యం, నంబరు 27, ఎగ్మూరు" అని

నాకు చాలా మంది పేర్లు నచ్చవు కానీ 'మాణిక్యం' అన్న పేరు మాత్రం బాగా నచ్చింది! ఇంత శ్రమపడి నేను మద్రాసుయాత్ర చేసినందుకు ఫలితం చేకూరింది! సిరి తనంతట తానే వలచి వచ్చినట్లయ్యింది

ఆ రాత్రి ఎంత నిదానంగా గడిచిందనుకున్నారు! కాలచక్రం హఠాత్తుగా నిలిచే పోయిందేమో ననుకొన్నాను వేకువజాము కావడమే తరువాయిగా నేను ఎగ్మూరులో హాజరయ్యాను ఆ యింటిని కనుక్కోడానికి ఎంతోసేపు పట్టలేదు కానీ తీరా ఆ యిల్లు కనబడేసరికి తరువాత ఏంచేయాలో తోచకపోయింది నాకు రెండుమూడుసార్లు ఆ యింటిముందు అటూ యిటూ తిరిగాను లోపలినుంచీ అలికిడి ఏమీ వినరాలేదు

తొమ్మిదిగంటలయింది నా కేమీ దిక్కు తోచలేదు దిక్కులేనివాడికి దేవుడే దిక్కన్నట్లుగా ఒక పోష్టుజవాను నాకు ఆపద్బాంధవునివలె తోడ్పడ్డాడు వాడా యింటిముందుకు వచ్చి 'మాణిక్యం మాణక్యం' అని పిలిచాడు లోపలినుంచీ ఆ యువతి బయటకు వచ్చింది నా కండ్లను నేనే నమ్మలేకపోయాను ఆ యువతి నాకు ఫోటోలోకంటే ఇనుమిక్కిలి అందంగా కనపడింది ఆమెను నేను ఒకటి ఒకటిన్నర నిమిషం మాత్రమే చూచి వుంటాను ఆ ఒకటి ఒకటిన్నర నిముషం తప్పా మిగతా నా ఆయుష్కాలమంతా నిరర్థకమని యిప్పటికీ నా అభిప్రాయం!

ఈ విధంగా తొరట్లాడుతుండగా మధ్యాహ్నం గూడా గడిచిపోయింది కడకు ఏలాగో ధైర్యం కలుగజేసుకొని ఒక జాబు వ్రాశాను

'ప్రియమైన మాణిక్యం,

అదృష్టవశాత్తుగా నిన్న సాయంకాలం నీ ఫోటోను మాడ్డం తటస్థించింది అప్పటి నుంచీ నా మనసు మనసులో లేదంటే నమ్ము నేరుగా మీ యింటకే వచ్చి నిన్ను కలుసుకుందా మనుకున్నాను కానీ అంతటి ధైర్యం నాకు లేకపోయింది మాణిక్యం! నువ్వు నన్ను అనుగ్రహిస్తావా? దేనికీ తక్షణం బదులువ్రాయి నేను మౌంటు రోడ్డులోవున్న నెహ్రూ కేఫ్ 12 వ నంబరు గదిలో వుంటున్నాను

ఇట్లు
నీ నాగభూషణం'

ఈ ప్రేమలేఖను వ్రాసి నేను పోష్టుచేసింది సోమవారం బుధవారం మధ్యాహ్నానికి మాణిక్యందగ్గరనుంచి ప్రత్యుత్తరం వచ్చింది అంతా నేను ఊహించినట్టే - జరిగింది!

'ప్రియమైన నాగభూషణం,

నీ లేఖను ఎన్నిసార్లు చదువుకొన్నానో నాకే తెలియదు నీ దస్తూరిని చూడగానే నీ అందచందాలు నాకు కళ్లకు గట్టినట్టు తెలిసిపోయింది కొన్ని కారణాలవల్ల మనం మా యింట్లో కలుసుకోగూడదు ఈ దినం సాయంత్రం ఏడింటికి నేను హోటలుకే వస్తాను

ఇట్లు
నీ మాణిక్యం'

3

గదిని ఎంత బాగా అలంకరించాను? నాలుగైదు సినిమాతారల ఫోటోలుకొని గోడలకు తగిలించాను నాలుగైదు రూపా

యుల పూవులతో గదిని పరిమళభరితంగా చేశాను ఇక నా విషయమంటారా? ఎంతటి పనికిరాని దుస్తులు వేసుకున్నా నేను చాలా ఆకర్షణీయంగానే వుంటాను మరి ఆనాటి నా సిల్కుదుస్తుల్లో నేను నవమన్మథుణ్ణే ఐపోయాను

ఎందుకో, ఏమో? ఆరున్నరయ్యేప్పటికి నా గుండె దడదడ కొట్టుకోసాగింది మాణిక్యం తప్పకుండా వస్తుంది ఆమెతో ఎలా మాట్లాడాలి? ఏం మాట్లాడాలి? ఆమె నన్ను పెండ్లిచేసుకోవడానికి ఒప్పుకోకపోతే ఎలా?

తలుపు మెల్లగా తెరచుకుంది కానీ కానీ లోపలికి వచ్చింది మాణిక్యం గాదు! ఒక ముప్పైఅయిదేండ్ల పురుషుడు!

ఆ ఆగంతకుడు గూడా ఏం సామాన్యంగా లేడు వేషంలో నన్ను మించిపోయి వున్నాడు అతడు కొంతసేపు గది నాలుగు మూలలా కలయజూచి 'బహుశా నేను పొరబాటు పడివుంటాను ఇది 12 వ నంబరు గది కాదుగదా' అన్నాడు పొంగి పొరలివస్తున్న కోపాన్ని అణచుకోలేక నేను 'ఇది 12 వ నంబరు గదే' అని అరిచాను

అతడు కొంచెం ఆలోచనతో 'అయితే మీరు ఈ గదిలో ఈనాడే ప్రవేశించారనుకుంటాను' అన్నాడు అతని అవకతవక ప్రశ్నలకు నాకు వళ్లు భగ్గుమన్నది 'ఈ గదిలో నేను నాలుగు రోజులుగా వుంటున్నాను' అన్నాను కఠినంగా ఇక లాభం లేదనుకొన్నట్టు అతడు ద్వారంవైపు తిరిగి కొంచెం దూరంవెళ్ళి, మళ్ళీ నావైపు తిరిగాడు

అతడు చేతులు నలుపుకుంటూ 'అయ్యా! మరేమీ అనుకోకండి! ఈ చుట్టుపక్కల గదుల్లో నాగభూషణం అనే అమ్మాయి వున్నదా? ఆమెతో నాకు కొంచెం పని ఉంది

'ఏమీ! నాగభూషణం ఆడదని ఏ వెధవ చెప్పాడు నీతో? నేనే నాగభూషణం' అన్నాను నేను అతణ్ణి ఉరిమిచూస్తూ

ఆ పురుషుడు జేబీలోనుంచి ఒక కాగితం తీసి నా ముందరవేసి 'ఐతే యిదేమి?' అన్నాడు అది నేను మాణిక్యానికి వ్రాసిన ఉత్తరం!

నా శరీరం ఒక్కసారి గడగడ వడకిపోయింది 'మీ రెవరు?' అన్నాను తడబడుతున్న గొంతుకతో 'నేనా! నేనే మాణిక్యాన్ని!' అన్నాడతడు మరేమీ మాట్లాడడానికి తోచక నా జేబీలోవున్న ఫోటోను చూపించి 'ఈ ఫోటో ఎవరిది?' అన్నాను అతడు అమాంతంగా నా ముందుకు దూకి ఆ ఫోటోను పెరుక్కొని 'ఈ ఫోటో నీచేతి కెలా వచ్చిందిరా ఇడియట్? ఇది నా భార్యఫోటో' అని గర్జించాడు

నేను శిలావిగ్రహంవలె అలా నే కూర్చుండిపోయాను ఆ పెద్దమనిషి ఒక్క అరగంటసేపు నాపై ధాంధూములు చేసి వెళ్లిపోయాడు

*   *   *   *

గతిమాలిన నా ఈ ప్రణయగాథను గురించి తలంచుకొన్నప్పుడల్లా నా ప్రవర్తనకు నాకే సిగ్గు కల్గుతూవుంటుంది ★

రైల్లో గలాటా!

(16-వ పేజీ తరువాయి)

'అయితే దానిమీదే కూర్చోవాల్సుంటుంది!' కొంచెం ఘాటుగా అంది

'వీల్లేదు!'

నేనూ ఒక పల్లెటూరిబైతునైతే చుట్టూవున్న ప్రజానీకం నన్ను నాల్గు తిట్టి ఎలాగైనా ఆమెకు జాగా ఇప్పిద్దురు కానీ దిట్టంగా స్టూడెంట్స్ కుండే లక్షణాలు అవుపిస్తూంటే!

'వీల్లేకపోతే రుమాలు తియ్యండి' పెళుసుగా—

'తియ్యను!' డిటో

'గార్డుతో రిపోర్టు చేయాల్సొంటుంది!' అని దర్జాగా నొక్కి నొక్కి అంది

'చేసుకోవచ్చు!' నేనేనా ఏమిటి చేతకాని దద్దమ్మని? ఆమెపాటి చేవ నాకు లేదనుకుంది గిరున తిరిగి చరున నడుచుకెళ్లింది ప్రయాణీకులంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు

'పోనిద్దురు బాబూ! ఆమెతో లేనిపోని తగువు లెందుకు?' అన్నాడొక పెద్దమనిషి

'అదికాదండీ! ఆమె అంత డాబుచేస్తుంటే నేనేనా చేయలేను? సింపుల్టన్!' అన్నాను

వాళ్లంతా చిన్న చిరునవ్వుతో మౌనం వహించారు

గార్డుని వెనకేసుకొచ్చింది, కుసుమకోమలి 'ఈయనే' అని నన్ను వ్రేలెట్టి చూపింది

'ఫస్టువార్నింగ్! వేలెట్టి అలా ఎప్పుడూ చూపెట్టకండి!' అన్నాను చిరాగ్గా—

'సార్! ఈ రుమాలు తియ్యండి!'

'ఎక్స్క్యూస్ మీ!'

'తీసితీరాలి!'

'వీల్లేదు!'

'మీ టికెట్?'

'హియర్ ఇటీస్!' అని చూపించాను.

'సరే! యింతకీ ఆ రుమాలు మీదేనా?

'అదిగది! అలా దార్లోకి రండి! దట్స్ నాట్ మైన్!' అన్నాను

'మీది కానప్పుడు రుమాలు తీయడానికి మీ కేమొచ్చింది?'

'నాది కాదు కాబట్టే ఆ రుమాలుమీద నాకు అధికారం లేదు!' అన్నాను దర్జాగా

'అయితే ఇంతకీ ఆ కర్చీఫ్ ఎవరిది?' అందామె నలుగురివైపూ చూస్తూ ఎవడిదైతేనేం? లాల్ కన్నయ్యగాడిది!!

గార్డు స్వయంగా—'అయ్యా! ఈ కర్చీఫ్ ఎవరిదో కాని ఇక్కణ్ణుంచి తీసి పారేస్తున్నాను' అన్నాడు

'ఆగండిసార్!' అంటూ ఓ కాయన కంపార్టుమెంటులో దూరి గార్డుతో-'సారీ సార్! అది నాది! కాఫీ త్రాగడానికెళ్తూ మని, నా సీటెవరూ ఆక్రమించకుండా అదక్కడ పడేశాను!' అన్నాడు రుమాలు తీసేసి కూర్చుంటూ!!

ధూమశకటం కదిలింది! ★

అన్నదమ్ములు

(15-వ పేజీ తరువాయి)

హాస్యపూర్వకంగా నవ్వుతూ ఆ పిల్లవాడు అన్నాడు

"అయితే నీ కేమీ తెలియదన్నమాట నీ అమ్మపేరు కళ్యాణి పాపం ఆమె లేదు చనిపోయింది"

"కళ్యాణా? కళ్యాణి లేదా?" గోపి హీనస్వరంలో తనలో తాను గొణుక్కున్నట్లు అన్నాడు కాని వెంటనే ఆ కుర్రవాడితో "నీకు యీ సంగతి యెలా తెలిసింది?" అని ఆతృతతో అడిగాడు

"బాగుంది నాకేమిటి - యీ సంగతి యీ వూళ్ళో అందరికీ తెలుసు కమలకు వున్నది ఒక్క కొడుకేను రెండవవాడు కళ్యాణికొడుకు" అన్నాడు ఆ కుర్రవాడు

గోపి లేత హృదయానికి దుస్సహవేదన ఉత్పన్నమైంది అయినా పూర్తిగా సందేహ నివృత్తి కాలేదు మళ్లీ యేదో ఆలోచించుకొని అడిగాడు "కాని - నేనే కళ్యాణి కొడుకునని ఎందుకు అనుకోటం - మధు కాకూడదా?"

"నీవు వట్టి పిచ్చివాడిలా వున్నావే? చూసేవాళ్లకు అంతమాత్రం తెలియదా ఏమిటి? మా అవ్వే చెప్పింది కమలకు మధుమీదనే ఎక్కువ అపేక్ష వున్నదని ఎంతయినా కూడ తల్లికి తన కన్నకొడుకు మీదనే ఎక్కువప్రేమ వుంటుందనే సంగతి అందరికీ తెలిసిందేగా!" అన్నాడు ఆ కుర్రవాడు

గోపి మనస్సులో యీ మాటలు బాగా నాటుకొని పోయినవి ఒకమారు వెనుకటి విషయాలన్నీ పునస్స్మరణకు తెచ్చుకున్నాడు కమల తరుచు మధు పక్షం వహించి తనను కోపగించుకొనటం జ్ఞప్తికి వచ్చింది ఆ కుర్రవాడు యింకా యిలాగా చెప్పాడు

"ఈ కళ్యాణి కమలకు చెల్లెలు అవుతుంది ఒకరోజు రాత్రి ఆమె ఎందుకో భావిలోపడి చనిపోయింది నీ పోషణ బాధ్యత కమలమీద వేసింది ఆ సమయములో నీవు చాలా పసిపిల్లవాడివట కమలకు కూడా నీ యీడువాడే ఒక కొడుకు వున్నాడు వాడే మధు "గోపిచెవులకు యీ మాటలు వినపడుతున్నాయి కాని మనస్సు వికలమైపోయింది చివరకు పిచ్చివానిలాగా హఠాత్తుగా లేచాడు అతని కళ్లలోనుండి అశ్రువులు సంతతధారగా ప్రవహిస్తున్నవి

కమల తన తల్లికాదు అనే సంగతే అతనికి ఒక పెద్ద దుఃఖసమస్య అయింది క్రిందటిరోజు కమల తనతో అబద్ధము చెప్పినందుకు ఆమెమీద అతనికి కోపము కూడ కలిగింది - అంతేకాదు అతని జీవితములో మొట్టమొదటి పర్యాయముగా అతనికి కమలమీద ఒక విధమైన అనాదరణ భావన కూడ కలిగింది దానికంటె తీవ్రముగా అతనికి మధుమీద మనస్సులో యిప్పుడు యీర్ష్యకూడ వుత్పన్నమైంది అతని కోమలహృదయం అంతులేని ఆందోళనతో చెదిరిపోయింది "మేము యిద్దరము అమ్మను ఒక్క విధంగా ప్రేమిస్తుండే వాళ్లము అయినా తన కన్నకొడుకనేగదా ఆమె అతన్ని అంతగా ప్రేమిస్తున్నది మా "అమ్మ" వుంటే -" అస్పష్టంగా అనుకున్నాడు చుట్టుప్రక్కల ఒకమారు చూచాడు పిల్లలు దూరంగా ఆడుకుంటున్నారు మధు కూడ వాళ్లతో ఆడుకుంటున్నాడు అతనిని అక్కడే వదిలివేసి గోపి ఎక్కడికో దూరంగా వెళ్లిపోయాడు ఈరోజుననే ప్రథమ పర్యాయంగా అతనికి పరాయి భావన కల్గింది ఈ ఒంటరిపాటు భావనతో అతని కంఠము వరకు నిండిన దుఃఖాన్ని ఆపుకోలేక ఏకాంతంగా కూర్చుని భోరున యేడ్చాడు ఏడ్చినతర్వాతనే అతని హృదయభారము కొంతవరకు తగ్గినట్లు అయింది

రాత్రి అత్యంత ఉదాసీనమనస్థితితో యింటికి వచ్చాడు కమల యీ విషయాన్ని అతని మొహం చూడగానే గ్రహించగల్గింది

"ఏం గోపీ - యెలాగో వున్నావు! ఏమైనా అయిందా నీకు?" అని అడిగింది

"నాకేమీ కాలేదే - బాగానే వున్నానే" అని గోపి మామూలుస్వరంలో యీ విషయాన్ని కప్పిపుచ్చదలచి అన్నాడు కాని అతనికంఠంలోని వణుకు స్పష్టంగా తెలుస్తూనే వుంది

"కాని నీ మొహం చూస్తే యేడ్చినట్లు కనపడుతున్నదే ఎందుకైనా యేడ్చావా యేంటి?"

"ఆ-ఏమీ లేదు వూరికేనే ఒక కుర్రవాడితో పోట్లాడాను ఇద్దరము కొట్టుకున్నాము" అని గోపి పూర్తిగా అబద్ధమాడాడు

"సరే యింతేనా అయితే పర్వాలేదు లే రా యిక భోజనానికి మధు నీకోసం కాచుకొని కూర్చున్నాడు" అని కమల గోపి వీపు నిమురుతూ లోనికి తీసుకొని వెళ్లింది

"వాడు అనవసరంగా నాకోసం యెందుకు "కాచుకొని కూచోవాలి" అని మెల్లగా గొణుగుకుంటూ వచ్చాడు ఈరోజు మామూలుగా కమలహస్తస్పర్శ అతనికి ఆనందాన్ని కలుగజేయలేదు ఏదో జ్ఞప్తికి వచ్చినవానిలాగా తటాలున తల్లి చేయి తీసివేసి ఆమెకంటె ముందుగా లోపలికి వెళ్లాడు [తరువాయి వచ్చేవారం]

బాలలారా!

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు ఉన్నాయి ఆ ప్రశ్నలకు వుత్తరాలు ఏడు అక్షరాల్లో మాత్రం వుంటాయి అవి చదవటానికి ముందు వెనకల వకటే రీతిగా వుంటాయి చెప్పుకోండి మరి చూద్దాం?

1 సభలోవారిని నవ్వించే కవిని ఏమంటారు?

2 రంభకొప్పులో వుండే పూలదండ పేరు ఏమిటి?

3 శ్రీకృష్ణుడు ఎవరియింటిలో పెరిగాడు?


4 సీతాదేవి పెండ్లికి ఓలిగాయిచ్చిన విల్లు పేరేమిటి?

5 గానుగచెట్టు విత్తనానికి సంస్కృతంలో ఏమంటారు?

6 రాముడు ఎవరిసహాయంచేత రావణున్ని చంపాడు?

7 పరవాసుదేవుని పట్టణం పేరేమిటి?

(జవాబు 88-వ పేజీలో)



పెళ్ళిపెద్దలు

'కవిరావు'

పెద్దలిద్ద రొక్క యూరి
పెండ్లికే గదలచిరి.
మైలుదూర మెట్లొనడచి
రైలు నెక్కబోయిరి.

వారు పోవు 'రైలు' యింక
చేరలేదు స్టేషను
ప్రక్కనున్న 'కేఫు' కేగి
ఒక్కదమ్ము తీసిరి.

దాపునున్న షాపుకేగి
పేపరొకటి బట్టిరి
వచ్చిరాని వార్తలెల్ల
వలకబోయ సాగిరి.

పట్నమేగు రైలువచ్చి
'ప్లాటుఫారు' చేరగ
ఎక్కడున్న వారలక్క
డెక్కినిండి పోయిరి.

'రిష్టువాచి' చూచిపెద్ద
లిద్దరు తలచినారలు!
"రైలుపోవ బొచ్చెడంత
టైము వున్నదింకను"

పెళ్ళి పెద్ద లిద్దరొక్క
బల్లమీద కూర్చుని
చేతులూపి బల్లగుద్ది
చర్చ చేయసాగిరి.

ఇంతలోనె రైలుపోవ
గంటకొట్టి వేయగ
పెళ్ళి పెద్దలపుడు రైలు
పెట్టెదరికి చేరిరి.

"ముందు మీరలెక్కు" డంచు
అందొకండు పల్కగ
"కాదు కాదు మీరుముందు
కాలు బెట్టు" డనియెను

'మీరు పెద్దలెక్కు' డంచు
'మీరుపెద్ద' లంచునె
వారిలోనవారు పెద్ద
వాదులాడ సాగిరి.

గంట మరల మ్రోగగానె
గార్డు విజిలు వేసెను
రైలు 'గుప్పు, గుప్పు, మంటు
బైలుదేరి పోయెను.

చేతగాని పెద్దలంత:
చేతులూపు కొంచును
తోలుసంచి చంకబెట్టి
కాలిదారి బట్టిరి.



జరిగిన కథ —

1537 వ సంవత్సరంలో ఇంగ్లండురాజైన హెన్రీకి ఎడ్వర్డు అనే కొడుకూ, నిరుపేద జాన్ కాంటీకి టామ్ అనే కొడుకూ, ఒకేరోజున జన్మిస్తారు అజేం విచిత్రమోగాని ఇద్దరిదీ ఒకేపోలిక ఒకరోజున టామ్ రాజభవన కేసి వెళ్లగా యువరాజైన ఎడ్వర్డు అతన్ని లోనికి తీసుకుపోయి ఆదరిస్తాడు ఒకరి జీవితం ఒకరు చూడాలనే ఆసక్తితో దుస్తులు మార్చుకుంటారు ఎడ్వర్డు పేదదుస్తుల్లో బైటకురాగానే ప్రజలతన్ని పేదబాలుడుగానే భావిస్తారు అతడు తను యువరాజునంటున్నకొద్దీ అవమానిస్తారు అక్కడ యువరాజు వేషంలో ఉన్న టామ్‌ను ఎడ్వర్డే అని అంతా అనుకుంటారు అతడు తను పేదవాడినని చెప్పినా వినరు యువరాజుకే పిచ్చెక్కినట్లు భావిస్తారు ఈలోగా వృద్ధరాజు హెన్రీ చనిపోవడం, యువరాజుగా చెలామణీ అయ్యే టామ్ రాజు కావడం జరుగుతుంది అసలు రాజు ఎడ్వర్డును జాన్ కాంటీ తన కొడుకేనని భావించి బాధిస్తూఉంటాడు అతనిచేతుల్లోంచి ఎడ్వర్డును మైల్స్ హెండన్ అనే వీరయువకుడు రక్షిస్తాడు హెండన్ తండ్రి కోపానికిగురై పదేళ్ల కాలం విదేశాల్లో గడిపినవాడు అతడు ఎడ్వర్డును అనేక అపాయాల్లోంచి తప్పించి తనతో స్వగ్రామం తీసుకుపోతాడు అక్కడ హెండన్ తండ్రి చనిపోవడం, తమ్ముడు హ్యూ ఆస్తికి సర్వాధికారై తిరిగివచ్చిన అన్నను దొంగ అని ఖైదులో వేయించడం జరుగుతుంది ఇక చదవండి

30

ఖైదులో పనీపాటా లేకుండా, సోమరిగా కూర్చోడం మైల్స్ హెండన్‌కు దుర్భరంగా ఉంది చివరి కతన్ని విచారణ చేసే దినం వచ్చింది మళ్ళీ ఖైదులో కూలదొయ్యకుండా ఉంటే, ఏ ఇతర కఠిన శిక్షనైనా అనుభవించడానికి అతడు సిద్ధంగా ఉన్నాడు కాని జడ్జి ఇచ్చిన తీర్పుతో అతనికి ఒళ్లు

అనువాదం :
శ్రీ
నండూరి రామమోహనరావు

మండింది, అతనిని దేశద్రిమ్మరిగా నిర్ణయించారు, దేశద్రిమ్మరి అయినందుకు, హెండన్ హాలుఅధిపతిని అవమానించినందుకు అతనికి రెండు గంటలసేపు గుదిబండ వేశారు. హెండన్ హాలుకు, జమీందారీకి అతడు వారసు డనే వాదనను జడ్జి

గారు ఖండించలేదు సరిగదా, తన తీర్పులో ఎక్కడా ఉటంకించనైనా లేదు ఇంతకంటే పరాభవమేం కావాలి, మైల్స్ హెండన్‌కు?

గుదిబండ వద్దకు మైల్స్‌ను తీసుకుపోయారు దోవలో అతడు పోలీసులను ఎంతైనా ఎదిరించాడు, కాని లాభం లేకపోయింది, అడపా తడపా గుద్దులుమాత్రం తిన్నాడు

బాలరాజు "దేశద్రిమ్మరి"తో సావాసం చేసినందుకు, అతనికి కూడా బండకొయ్య వేసేవారే, గాని, అతని పసితనం చూసి దయ తలచి వదిలిపెట్టారు గుదిబండ చుట్టూ గుంపులు మూగిఉండటం వలన మైల్స్‌ను చూడటానికి బాలరాజుకు సందు చిక్కలేదు చివరికెలాగో మనుష్యుల కాళ్ల సందుల్నించి దోవ చేసుకుని దగ్గిరికి వెళ్లాడు సమీపంనుండి చూసిందాకా అతనికి గుదిబండ అంటే ఏమిటో అర్థంకాలేదు పాపం, మైల్స్ హెండన్‌మీద సర్ హ్యూ సేవకులు, ఇతర భక్తులు ఉమ్మలెయ్యడం, నోటికొచ్చినట్లు తిట్టడం సాగిస్తున్నారు తన అంగరక్షకుడికి జరుగుతున్న అవమానం చూసి సహించలేకపోయాడు బాలరాజు క్రమంగా అతనిలో క్రోధం గట్లు తెంపుకొని ప్రవహింపసాగింది ఇంతలో వెనకనుంచి కుళ్లిపోయిన కోడిగుడ్డొకటి రివ్వునవచ్చి మైల్స్ హెండన్ ముఖానికి కొట్టుకుంది. గుడ్డు పగిలి ముఖమంతా సొన కారుతున్నది తుడుచుకుందామని మైల్స్ ఎంత గింజుకున్నా చేతులు ఊడిరాలేదు అందరూ ఈ వినోద దృశ్యం చూసి చప్పట్లు కొట్టారు. బాలరాజు కోపంతో ఊగిపోతూ గర్జించాడు:

"అతడు నా సేవకుడు, విడిచిపెట్టండి లేకపోతే మిమ్మల్ని నాశనం చేస్తాను పందుల్లారా! నేను ఇంగ్లండు—"

"ఉష్షో! ఊరుకోండి మీరు ఈ రోజులు మనవి కావన్న మాట గుర్తుంచుకోండి," అని మైల్స్ హెండన్ బాలరాజు మాట కడ్డం వచ్చాడు. అధికారికేసి తిరిగి, "ఆ అబ్బాయి పిచ్చివాడు అతన్ని లక్ష్యపెట్టకండి," అన్నాడు

"నువ్వు నాకేం సలహాలివ్వనక్కర్లేదులే ఆ కుర్రగాడిద సంగతి నేను చూసుకోగలను. వాడికి మెదడు కాస్త మరమ్మతు చెయ్యాలి," అంటూ అధికారి ఒక పోసు లీనాజ్ఞాపించాడు "ఆ పిచ్చాడికి రెండో మూడో కొరడాదెబ్బలు తగిలించు. దెబ్బకి దెయ్యం వదలాలి"

మైల్స్‌కు వెయ్యబడిన శిక్ష కళ్లారా చూసి ధన్యుడు కావాలనే పవిత్రాశయంతో సర్ హ్యూ అప్పుడే గుర్రంమీద వచ్చి ఒక ఎత్తైన ప్రదేశంలో నుంచున్నాడు బాలరాజుమీద అతనికి అకస్మాత్తుగా "ప్రేమ" పుట్టుకొచ్చి ఇలా సిఫార్సు చేశాడు:

"అహాహ దయ్యం పూర్తిగా వదలాలంటే కనీసం అరడజను దెబ్బలైనా తగలాలి"

బాలరాజును రెక్కలు విరిచి పట్టుకున్నారు. ఇంగ్లండు సార్వభౌముడైన తనకు జరగబోయే అవమానానికి అతడు కొయ్యబారిపోయాడు; గింజుకోనైనా లేదు;

అలాగే వెర్రిచూపులు చూస్తున్నాడు. ఇంగ్లీషు చరిత్రకే కళంకం ఆపాదించే సంఘటన జరగబోతున్నది ఏమిటి చెయ్యడం ఈ నిమిషంలో? క్షణాలు దొర్లిపోతున్నవి. ఎంత ఆలోచించినా మార్గాంతరం కనిపించడం లేదు దెబ్బలు తినడమా? లేక క్షమించమని ప్రాథేయపడటమా? అదీ సమస్య! ఊహు తాను రాచబిడ్డ ఆత్మాభిమానం, పౌరుషం చంపుకొని ఏ రాచబిడ్డ క్షమించమని ప్రార్థించగలడు? తన తండ్రికి, తన వంశానికి అది కళంకం కాదూ? తను దెబ్బలైనా తింటాడుగాని, క్షమాపణ కోరడు

ఈలోగా మైల్స్ హెండన్ ఈ సమస్యను మరొక విధంగా పరిష్కరి

(26-వ పేజీ చూడండి)




రాజుగారి ఆజ్ఞప్రకారం రాజభటులు సిండరెలా రథాన్ని వెంబడిస్తారు కొంతదూరం పోయే సరికి పన్నెండుగంటలు దాటిపోయి దేవత చెప్పినప్రకారం సండరెలా ఎప్పటిమాదిరిగా తయారవుతుంది రాజభటులు ఆమెను చూసికూడా "ఎవరో పేదపిల్ల" అనుకుంటారుగాని యువరాజుతో నృత్యంచేసిన అమ్మాయే నని అనుకోరు సండరెలా యథాప్రకారం తయారయినా దేవత ప్రభావం వల్ల ఒక కాలి గాజుస్లిప్పరు మాత్రం మిగిలిపోతుంది అది పదిలంగా దాచుకుని ఆమె ఇంటికి

“సి

వాల్ట్ డి


ఆర్





ౖరెలా”
కార్టూన్‌చిత్రం
శీఘ్రావిడుదల

పోతుంది మర్నాడు రాజుగారు చాటింపు వేస్తారు “మాకు గతరాత్రి దొరికిన గాజుస్లిప్పరు ఏ స్త్రీ కాలికి సరిపోతుందో ఆమెనే యువరాజు పెళ్లిచేసుకుంటా” డని మంత్రి పట్టణంలో ఇంటింటికి తిరిగి ఎవరికీ ఆ స్లిప్పరు సరిపోకపోతే చివరికి సిండరెలాఇంటికి వస్తాడు సవతితల్లి సిండరెలకు కొంపతీసి ఆ స్లిప్పరు సరిపోతుందేమో అని ఈర్ష్యతో ఆమెను గదిలో బంధిస్తుంది కాని చిట్టెలుకలు ఆమె జేబులోనుంచి తాళం చెవులు మెల్లిగా కొట్టేస్తాయి



స్తున్నాడు "అతన్ని వదిలెయ్యండి," అని అరిచాడు "మీకు హృదయం లేదూ? జాలిలేదూ? ఆ పసివాణ్ణి, అర్భకుణ్ణి కొట్టడానికి మీకు చేతు లెలావస్తాయి? వదిలెయ్యండి. నేను తింటాను అతని దెబ్బలు."

"బలే చక్కని ఆలోచన నా కింతవరకూ తట్టనేలేదు సుమా," అన్నాడు సర్ హ్యూ, విషపునవ్వు నవ్వుతూ. "ఆ పిల్లణ్ణి వదిలెయ్యండి. వాడిబదులు ఈ వెధవని కొట్టండి వీడికి అరడజనుచాలవు ఒకడజను అంటించండి. మామూలుగా కాదు సుమా ఒక్కొక్క దెబ్బకి ఒక్కొక్క కొరడా విరిగిపోవాలి, టపాకాయల్లా పేలాలి దెబ్బలు"

బాలరాజును వదిలిపెట్టారు పోలీసులు అతడు గొంతెత్తి ఏదో అనబోయాడు, కాని సర్ హ్యూ అడ్డంవచ్చి, "ఏమిట్రా అనబోతున్నావు? నువ్వు మాట్లాడే ప్రతి మాటకీ ఆరేసి దెబ్బల చొప్పున అతగాడికి ముట్ట చెబుతాం తెలిసిందా?" అని బెదిరించాడు

మైల్స్‌ను గుదిబండనుండి తొలగించారు, చొక్కా ఊడదీశారు. వివస్త్రమైన వీపుమీద చెర్నాకోలు ఛళ్లుమని మోగింది ఆ దృశ్యం చూడలేక బాలరాజు ముఖం తిప్పుకున్నాడు, కన్నీళ్లు కపోలాలమీద కాలువలు కట్టాయి

"ఓ స్నేహితుడా! అవ్యాజ బంధూ! సాహసుడా! నీ మేలు మరువలేను నా కోసం ఈ రోజున నువ్వుచేసిన ఈ అసమాన త్యాగం నా ఆఖరి గడియవరకూ జ్ఞాపకముంచుకుంటాను. నీ రాజును నువ్వు గాయాలనుండి, బహుశా అకాల మృత్యువు నుండి కూడానేమో — రక్షించావు అన్నిటికంటే ఎక్కువ నన్ను ఘోర పరాభవమునుండి రక్షించావు. కృతజ్ఞుణ్ణి మిత్రమా! కృతజ్ఞుణ్ణి" ఈ విధంగా తలపోస్తూ బాలరాజు కన్నీరు కారుస్తున్నాడు

పన్నెండు దెబ్బలూ పూర్తయ్యేసరికి, పన్నెండు యుగాలయినట్లనిపించింది మైల్స్ హెండన్‌కు ఉలకలేదు, పలకలేదు, అమ్మా అని నిట్టూర్చైనా విడవలేదు, నిజమైన యోధునివలె, సైనికునివలె సహించాడు తీవ్ర కశాఘాతాలను అతడంత ధైర్యంగా బాధను ఓర్చుకోగలగడం, ఒక బాలకుని కోసం అంత గొప్ప త్యాగం చేయడం చూసి ప్రేక్షకుల మనస్సులు విస్మయంతో, గౌరవ భావంతో నిండిపోయాయి మైల్స్‌ను తిరిగి గుదిబండలో బంధించినప్పుడు వారి ప్రవర్తనలో గొప్ప మార్పుకలిగింది అదివరకుదాకా ఆతనిపై ఉమ్మేసి, హేళనచేసి, తిట్టి, అవమానించిన వ్యక్తులందరూ ఒక్కసారిగా మౌనం వహించారు, మైల్స్‌ను ఒక మహాపురుషుడుగా, త్యాగిగా మనస్సుల్లోనే గౌరవించారు

బాలరాజు మైల్స్‌ను సమీపించి హీనస్వరంతో అన్నాడు

"మిత్రుడా! నిన్ను గౌరవించడానికి చక్రవర్తులకు కూడా శక్తి లేదు నువ్వు కాలుమోపిన శిఖరాలను ఏ మానవుడూ చేరలేడు నువ్వు త్యాగివి, నిన్నెల్లా బహుమానించను? నేను కేవలం ఒక రాజును మాత్రమే నాకు చేతనైన బహుమాన మొక్కటే ఉన్నది-" అంటూ పక్కన పడివున్న కొరడా కర్రతీసి నెత్తురు ధారలుగా కారుతున్న మైల్స్ బుజాలమీద ఆన్చి, "ఇంగ్లండురాజు ఎడ్వర్డు నిన్ను ప్రభువును చేస్తున్నాడు" అన్నాడు

మైల్స్ హెండన్ హృదయం కరిగి కన్నిళ్లై ప్రవహించింది కాని బాలరాజున్న అన్నమాటలకు, తాను ఉన్న పరిస్థితి ఎంత వ్యత్యాసం ఉన్నది? హేయాతి హేయమైన శిక్షకు, పరాభవానికి పాల్పడ్డాడు, అటువంటి తాను ఇకనుండి ప్రభువా? ఎంత విడ్డూరమైన పరిస్థితిలో పడ్డాడు?

సర్ హ్యూ చూడవలసింది చూశాడు గనుక, గుర్రాన్ని మళ్లించి టకటక ఆర్భాటం చేస్తూ వెళ్లిపోయాడు జనసమూహం నిశ్శబ్దంగా తొలగి అతనికి దారి ఇచ్చారు, అతడు వెళ్లగానే మళ్లీ నిశ్శబ్దంగా గుమిగూడారు ఖైదీకి అనుకూలంగా కాని, ప్రతికూలంగా కాని ఎవ్వరూ నోరెత్త సాహసించలేదు ఆలస్యంగా, అప్పుడే వచ్చిన ఒకడు అలవాటు ప్రకారం మోసగాణ్ణి తిట్టడం లంకించుకున్నాడు, ఖైదీమీద విసిరేందుకై ఒక చచ్చిన పిల్లిని కూడా వెంట తెచ్చుకున్నాడు కాని అతడు నోరెత్తగానే పదిమంది మీద కురికి నోరునొక్కి, నాలుగు తన్ని, నిశ్శబ్దంగా బయటికి పంపించారు మళ్లీ ఖైదీ చుట్టూ, అదే నిశ్శబ్దంతో, అదే పూజ్యభావంతో గుమిగూడారు.

31

శిక్షాకాలం అయిపోయిన తర్వాత మైల్స్ హెండన్‌ను గుదిబండనుండి తొలగించారు, మళ్ళీ

ఈ ప్రాంతంలో కనిపిస్తే తల తీసేస్తామని హెచ్చరించి పొమ్మన్నారు. అతని కత్తిని, గాడిదని, గుర్రాన్ని అతని కిచ్చేశారు.

హెండన్, బాలరాజు వాహనారూఢులై బయల్దేరారు. ఇద్దరూ ఆలోచనల్లోపడి మునిగి తేలుతున్నారు. హెండన్‌ను ఒక్కుమ్మడిగా అనేక ప్రశ్నలు ముట్టడించాయి. ఏంచెయ్యాలి ఇప్పుడు ? ఎక్కడికి పోవాలి? మళ్ళీ హక్కులకోసం ప్రయత్నించడమా? లేక మాట్లాడకుండా ఊరుకోవడమా? బాగా అధికారం, పలుకుబడిగల వ్యక్తి నెవరినైనా పట్టుకోవాలి. ఎవరున్నారు అలాంటి వ్యక్తి? ఆలోచించగా, ఆలోచించగా అతని కొక ఉపాయం తోచింది. దానివల్ల లాభముంటుందని అతనికి నమ్మకం కలగలేదు. కాని ఏదో ఒక ప్రయత్నం చెయ్యాలిగా? అతనికి వృద్ధ సేవకుడు ఆండ్రూస్ చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి. కొత్తరాజు చాలా మంచివాడట దీనులయెడ, నిస్సహాయులయెడ ఆయన కరుణ అపారమట అటువంటప్పుడు సరాసరి లండన్ వెళ్ళి, మహారాజును దర్శించి తనకు జరిగిన అన్యాయం మనవి చేసుకోవడం మంచిది కాదూ? మంచిదే, కాని తన వేషం, వాలకం చూసి కోటలోకి అడుగుపెట్టనిస్తారా? ఆ, అదో పెద్ద సమస్య కాదులే, అందాకా వచ్చినప్పుడు ఏదో ఆలోచించవచ్చు, దాని విషయం తరవాత చూసుకోవచ్చు, అంతే, ముందు లండన్ చేరుకోవాలి. బహుశా తన తండ్రికి బాల్య మిత్రుడైన సర్ హంఫ్రీ మార్లో తనకు సహాయం చెయ్యవచ్చు. సర్ హంఫ్రీ రాజుగారి భోజనశాలకో, అశ్వశాలకో దేనికో ప్రధానాధికారి, ఆయనకు కోటలో పలుకుబడి కావలసినంత వుంది. ముం దాయన్ని కలుసుకోవాలి.

ఈ ఆలోచనతో, తన కొక నిర్దిష్ట కార్యక్రమం దొరకడంతో మైల్స్ హెండన్‌కు ఇందాకటి నిరుత్సాహం, అవమానభారం చేత్తో తీసేసినట్టు మాయమయ్యాయి. ఆలోచనా తరంగాల్లోంచి తెప్పరిల్లి చుట్టూ చూశాడు. స్వగ్రామం విడిచి చాలదూరం వచ్చారు. బాలరాజు తల వంచుకుని ఏదో ఆలోచనల్లో ఉన్నట్టు పరధ్యానంగా ఉన్నాడు. హెండన్‌కు మళ్ళీ ఇల్లా అనిపించింది ఈ బాలుడిది లండన్ నగరమే, అక్కడ పుట్టినప్పటి నుంచీ, కష్టాలు తప్ప మరేమీ ఎరగడు, అక్కడ ఇతన్ని ఆదరించే వారెవ్వరూ లేరు, అటువంటి శత్రు ప్రదేశానికి రావడానికి ఇతడు ఉత్సహిస్తాడా? "నేను రా"నంటే ఏం చెయ్యాలి? అయినా అడిగిచూద్దామని హెండన్ బాలరాజును సమీపించి అన్నాడు.

"మన మెక్కడికి వెడుతున్నామో అడగడం మర్చిపోయాను తమ సెలవు ఏమిటి ప్రభూ!"

"లండన్! లండన్!" అని మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు బాలరాజు

హెండన్ మరుమాట లేకుండా తిరిగి గమనం సాగించాడు. బాలరాజు సమాధానం విని చాలా ఆశ్చర్య పడ్డాడు, అతడు తనంతట తనే లండన్ వెడదామంటాడని అనుకోలేదు.

ప్రయాణం మొదట్లో ఏ అడ్డంకి, అపాయం లేకుండా సజావుగానే సాగిపోయింది కాని ఆఖరులో ఒకటి జరిగింది. అది ఫిబ్రవరి 19 వ తేదీ రాత్రి దాదాపు పదిగంటల సమయం మిత్రులు లండన్ వంతెనమీద అడుగు పెట్టారు. అక్కడి కోలాహలం చెప్పడానికి శక్యం కాకుండా వుంది. కొన్ని వందలమంది జనం తాగి

తందనా లాడుతున్నారు ప్రతివాడి చేతిలోనూ సారా పాత్ర ఉన్నది, చిందులు తొక్కుతూ, పాటలు పాడుతూ, హుర్రా హుర్రా అని అరుస్తూ ఎంతైనా గందరగోళం చేస్తున్నారు

వంతెన పార్శ్వాల్లో అక్కడక్కడ కొన్ని విగ్రహాలున్నాయి, ఎనిమిదో హెన్రీ ఎక్కడెక్కడి నుంచో మంచి మంచి విగ్రహాలు సంపాదించి నగరంలో ముఖ్య స్థలాల్లో ప్రతిష్ఠించేవాడు, నగరాన్ని సర్వాంగసుందరంగా ఉంచడానికి ఆయన చాలా శ్రమ తీసుకున్నాడు, లండన్ వంతెనమీద కూడా చక్కని శిల్ప నైపుణ్యంగల విగ్రహాలు కొన్ని ప్రతిష్ఠించాడు. ఈ విగ్రహాల్లో ఒకదాని తలను ఒంటిమీద స్పృహ లేని ఒక తాగుబోతు చేతికర్రతో ఎగరగొట్టాడు. హెన్రీ చనిపోయి మూడువారాలే అయింది, అప్పుడే ఆయనను, ఆయన చేసిన పనులను ప్రజలు నిర్లక్ష్యం చేస్తున్నారు

ఆ తల ఎగిరివచ్చి హెండన్ మో చేతికి కొట్టుకుంది తరవాత బడబడ దొర్లుతూపోయి ఆగింది. దానిమీద ఒకడు చూడకుండా కాలువేసి జారి, మరొకణ్ణి ఢీకొట్టాడు. వాడు పోయి ఇంకొకణ్ణి ఢీఢీక్కొలు కొట్టాడు ఇదంతా చివరికి గలాటాగా పరిణమించింది ఆ మర్నాడే పట్టాభిషేకం ప్రతివాడు సారాతోను, రాజభక్తితోనూ మత్తెక్కి ఉన్నాడు కనుక గలాటా నిమిషాలమీద లండన్ వంతెన అంతటా వ్యాపించి, ఆ ప్రదేశం యుద్ధరంగంగా తయారైంది ఈ రంగంలో హెండన్ ఒక మూలకు, బాలరాజు ఇంకొకమూలకు నెట్టివేయబడ్డారు. ఒకరి సంగతి మరొకరికి తెలియకుండా విడిపోయారు. ప్రస్తుతానికి వాళ్ల నాస్థితిలో వదిలేద్దాం.

32

అసలు రాజు నిద్రాహారాలు లేకుండా, ఒకసారి దొంగలతో, ఇంకోసారి బిచ్చగాళ్ళతో, మరోసారి జైళ్లలో నేరస్థులతో, ఇంగ్లండు దేశంలో వివిధ ప్రాంతాల్లో పరిభ్రమిస్తూ ఉండగా, నకిలీరాజు టామ్ కాంటీ వెస్టుమిన్‌స్టర్ కోటలో రాజభోగాలనుభవిస్తున్నాడు.


మనం కిందటిసారి అతన్ని చూసినప్పుడు రాజత్వంమీద టామ్‌కు అప్పుడే ఆసక్తి ప్రారంభమవుతోంది. రోజులు గడుస్తున్న కొద్దీ రాజత్వంలోని సుఖం, ఘనత తెలిసిరాసాగాయి. క్రమంగా అంతా సరితోషమయంగా కనబడసాగింది. అతనిభయాలు, సందేహాలు అన్నీ పటాపంచలై పోయాయి "దెబ్బలబ్బాయి"తో పరిచయం అధికం చేసుకుని అతని ద్వారా ఎప్పుడెప్పుడు ఎలా మెలగాలో బాగా నేర్చుకుంటున్నాడు

ఆడుకోవాలనిపించినప్పుడు, కబుర్లుచెప్పాలనిపించినప్పుడు, ఎలిజబెత్ యువరాణినో, జేన్ గ్రేనో పిలిపించుకునేవాడు. విసుగ్గా వున్నప్పుడు వాళ్ళని పొమ్మని ఆజ్ఞాపించేవాడు.

పరిచారక పరివేష్టితుడై రాత్రి శయ్యాగారానికి వెళ్ళేవాడు, ఉదయం సేవక ప్రభువులచేత దుస్తులు తొడిగించుకునేవాడు. భోజనానికి కూడా ప్రభువులు, అధికారులు వెంటవస్తేనే గాని కదిలేవాడు కాదు. ఈ హోదా, ఈదర్జామీద టామ్‌కెంత ఇష్టం పుట్టిందంటే, తన అంగరక్షకదళాన్ని రెట్టింపు, అంటే నూరుదాకా పెంచాడు నడవాల్లోంచి తను దర్బారుకు అక్కడికి వెళ్ళేటప్పుడు "మహారాజువస్తున్నారు" అనే హెచ్చరికలు వింటం అతనికి ప్రత్యేకంగా సంతోషం, గర్వం కలిగించేది.

దర్బారులో ఉన్నత సింహాసనం మీద కూర్చుని తీర్పులు చెప్పడం, విదేశ రాయబారుల వినతి పత్రాలు వినటం, అతనికెంతో సరదాగా ఉండేవి రక్షక ప్రభువైన హెర్ట్‌ఫర్డు తనకు "అలా చెయ్యండి, ఇలా చెయ్యండి," అని సలహాలివ్వడం అతనికి చిరాగ్గానే ఉండేది. హెర్ట్‌ఫర్డు తయారుచేసిన ప్రతి శ్రీముఖాన్ని, అధికారపత్రాన్ని జాగ్రత్తగా చదివి మరీ సంతకం పెట్టేవాడు.

అద్భుతమైన తనదుస్తులు చూసుకుని చాటుచాటున తెగ మురిసిపోయేవాడు ఈ మూడు వారాల్లోను ఇంకా అనేకం కొత్తవి కుట్టించాడు. తనకుగల నాలుగు వందల మంది స్వంత సేవకులు చాలరనిపించి, మూడు రెట్లు చేశాడు వాళ్లని. అయితే అతనిస్వభావం మాత్రమేం మారలేదు. పూర్వంవలెనే ఎక్కడ అన్యాయం జరిగినా, పరపీడన జరిగినా ప్రతిఘటించేవాడు. క్రూరశాసనాలను చాలవరకు రద్దు చేశాడు.



తన మాటకు ఎవరైనా ఎదురు చెబితే అదోరకంగా చూచేవాడు, ఆ చూపుకు ప్రభువైనా, మంత్రియైనా, సామంతుడైనా గజగజలాడవలసిందే ఒకసారి యువరాణి మేరీ టామ్ దగ్గరకు వచ్చింది వచ్చి, అనేకమందిని జైళ్లలో పడవలసిన వాళ్లని, ఉరితియ్యబడవలసిన వాళ్లని, కాల్చబడవలసిన వాళ్లని మహారాజు అనవసరంగా వదిలిపెట్టేస్తున్నారని విమర్శించింది తండ్రిగారి హయాంలో ఒక్కొక్కసారి అరవై వేలమంది దాకా ఖైదీలుండేవారనీ, ఆయన తన పరిపాలనా కాలంలో డబ్బయిరెండు వేల మంది నేరస్థులికి మరణదండన విధించారనీ ఉదహరించింది ఆవిడగారి వాగుడు విని టామ్‌కు పట్టరాని కోపంవచ్చి, అవతలకు నడవమని ఆజ్ఞాపించాడు

కాని మొదటిరోజుల్లో టామ్ కాంటీకి అసలు రాజైన ఎడ్వర్డు అస్తమానమూ జ్ఞాపకంవచ్చి బాధపడేవాడు తననంత దయతో ఆదరించిన బాలరాజుకు అన్యాయం చేస్తున్నానని, అతడు తిరిగి వస్తే అతని రాజ్యం అతనికిచ్చేసి తన దోవన తాను పోదామని అనిపించేది కాని ఎన్నాళ్లకూ ఎడ్వర్డు తిరిగి రాకపోయేసరికి, క్రమంగా అతన్ని మరిచిపోయాడు ఒకవేళ ఎప్పుడన్నా జ్ఞాపకం వచ్చినా, సాధ్యమైనంత వరకూ అతన్ని స్మృతిపథినుండి గెంటివేయడానికే టామ్ ప్రయత్నించేవాడు, ఎందుకంటే అసలు రాజు ఎక్కడో దిక్కులేక కష్టాలుపడుతుంటే, తను దర్జాగా రాజభవనంలో సుఖాలు అనుభవిస్తున్నాననే ఒక భావం బాధ కలిగించేది

తన తల్లినీ, అక్కలనూ కూడా ఇలాగే మరిచిపోవడానికి టామ్ ప్రయత్నించాడు మొదట్లో వాళ్ల కోసం ఎంతో బెంగపడ్డాడు, చూడాలని దిగులు పెట్టుకున్నాడు కాని తరవాత తరవాత వాళ్లను తలుచుకోడానికే భయం వేసింది ఎప్పుడైనా వాళ్లు చిరుగుగుడ్డలతో, మసిమొహాలతో వచ్చి తన్ను కావిలించుకుని ముద్దుపెట్టుకుని "నీవు మా అబ్బాయే" అని బైటపెట్టేస్తే?—అమ్మో! ఇంకేమన్నా ఉందీ? అందుచేత వాళ్లనెప్పుడు తన ఆలోచనల్లోకి జొరబడనిచ్చేవాడు కాదు క్రమంగా తన విలాసాలలో, వినోదాలలో పడి వారిని మరిచిపోయాడు ఎప్పుడైనా వాళ్లు జ్ఞాపకం వస్తే తను బురదలో పొర్లాడే కీటకమంత అధమాధముడైనట్లు బాధపడేవాడు

ఫ్రిబవరి 19 వ తేదీ రాత్రి టామ్‌కాంటీ మఖమల్ పరుపుల మీద మెత్తని దుప్పట్లలో సుఖనిద్రపోతున్నాడు వందలకొలది భటులు అతని శయ్యాగారాన్ని, భవనాన్ని, కోటనూ పరిరక్షిస్తున్నారు ఆ మర్నాడే అతని పట్టాభిషేకం

అదే సమయంలో అసలు రాజు ఎడ్వర్డు ట్యూడర్ ఆకలితో, దాహంతో, దూరాగమన ప్రయాసంతో, ఒళ్లంతా దుమ్మై, బట్టలన్నీ పీలికలై వెస్టుమిన్‌స్టర్ కోట చేరుకున్నాడు అక్కడ మర్నాటి పట్టాభిషేక మహోత్సవానికి ఆఖరి ప్రయత్నాలు జరుగుతున్నాయి, వందలకొలది కార్మికులు సంరంభంతో పరికరాలు ధరించి అలంకారాలు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు వాళ్లలో కలిసిపోయాడు బాలరాజు

33

టామ్‌కాంటీ మర్నాడుదయం లేచేసరికి, వాతావరణమంతా

ఒకే రొదతో నిండిఉంది; ఎక్కడో దూరంగా, విరతిలేకుండా మేఘాలు ఉరుముతున్నట్లు ధ్వని వినవస్తోంది. అది లండన్ నగరవాసుల ఉత్సవోత్సాహ కోలాహలం తప్ప మరేం కాదు. ఆ రొద మన టామ్ కాంటీకి మధుర వీణాసంగీతంలాగ వినబడుతోంది.

టామ్ మళ్ళీ థేమ్సు నదిలో నౌకాప్రయాణం చేశాడు ఎందుకంటే పట్టాభిషేకం తాలూకు ఊరేగింపు లండన్ గోపురంనుండి బయలుదేరడం ఆనవాయితీగా వస్తోంది

టామ్ గోపురం చేరుకోగానే వెయ్యి పిడుగులు ఒక్కసారి ఒక్కచోట పడినట్లు శబ్దమైంది, గోపురం బురుజులమీదగల ఫిరంగు లన్నీ మోగాయి. వెంటనే దట్టమైనపొగ అంతటా ఆవరించుకుంది తరవాత వరసగా నాలుగైదుసార్లు ఫిరంగులు మోగాయి గోపురపుకట్టడం ధూమసముద్రంలో మునిగిపోయింది కాని గోపురాగ్రాన ఎగిరే జెండాలు మాత్రం కనిపిస్తూనే ఉన్నాయి

టామ్‌కాంటీ యుద్ధాశ్వంమీద ఆరూఢుడయ్యాడు అతని వెనక రక్షకప్రభువైన హెర్ట్‌ఫర్డ్ మరొక అశ్వంమీద ఆరూఢుడయ్యాడు తరవాత అంగరక్షకులు విచ్చుకత్తులతో నిలిచారు ఆ వెనక దేశంలోని సామంతులు, ప్రభువులు, జమీందార్లు, ఇంకా వెనక లండన్ మేయరు, మునిసిపాలిటీ సభ్యులు నుంచున్నారు.

ఊరేగింపు సాగింది దారిపొడుగునా ప్రజలు బారులుతీర్చారు. అడుగడుగునా "మహారాజుకూ జై" అనే నినాదాలు హోరెత్తిపోయాయి. టామ్ మందహాసం చేస్తూ కృతజ్ఞతా సూచకంగా తల వంచేవాడు దాంతో ప్రజల ఉత్సాహం ఇంకా అధికమయ్యేది

ఫెన్‌చర్చి వీధిలో ఎత్తైన వేదికమీద నిలబెట్టబడిన ఒక బాలుడు మహారాజుకు స్వాగత మిస్తూ గీతం ఆలాపించాడు.

"స్వాగతము స్వాగతము రాజాధిరాజ!!
స్వాగతము స్వాగతము రవికోటి తేజ!
స్వాగతమ్మిదిగో దీనావనాసక్త!
స్వాగతము జనతానురాగాభిషిక్త!

ప్రజలంతా ఈ గీత చరణాలు అందుకుని ప్రతిధ్వనించారు.

ఇంతలో టామ్ కాంటీకి ఒకచోట తన ఆఫల్‌కోర్టు స్నేహితులిద్దరు కనిపించారు ఆతని హృదయం సంతోషంతో ఎగిరి గంతువేసింది వాళ్లలో ఒకడు టామ్ ఇదివరకు ఆడిన దర్బారు ఆటల్లో ఉత్తుత్తి సేనాధిపతి, ఇంకొకడు ఉత్తుత్తి ప్రధానమంత్రి వాళ్లు తన్ను గుర్తిస్తే ఎంత బావుంటుంది? తమ మిత్రుడు ఇదివరకు ఆడినఆటలన్నీ నిజమైనందుకు ఎంత ఆశ్చర్యపోతారు? ఆఫల్‌కోర్టు రొచ్చులో పుట్టి పెరిగిన టామ్‌కాంటీకి ఇంగ్లీషు ప్రపంచం యావత్తూ పాదాక్రాంతమైనందుకు ఎంత విభ్రాంతులౌతారు? మళ్ళీ వెంటనే అనిపించింది వాళ్లు నిజంగా గుర్తిస్తే తన కపాయం కాదూ? అందుచేత ముఖం ఇంకోవైపుకు తిప్పుకొన్నాడు

అడుగడుక్కీ "విరాళం! విరాళం!" అని కేకలు వినిపిస్తున్నాయి వినిపించినప్పుడల్లా టామ్ తన ప్రక్కన సేవకుని చేతిలో ఉన్న సంచిలోనుండి కొత్తనాణాలు గుప్పిళ్ళతో తీసుకుని విరజిమ్ముతున్నాడు. ప్రజలు మహావేశంతో జయజయధ్వానాలు చేస్తున్నారు.

ఊరేగింపు చాలదూరంసాగింది. ఒకచోట టామ్‌కాంటీ సంచిలో చెయ్యిపెట్టి గుప్పిలితో నాణాలు తీయబోతున్నాడు హఠాత్తుగా కొంతదూరంలో ఒక పరిచితముఖం కనిపించింది ఆ ముఖం పాలిపోయివుంది, కళ్లు టామ్‌కాంటీ వంకనే రెప్పవాల్చకుండా తీక్షణంగా చూస్తున్నాయి. టామ్ ఆ వ్యక్తి తనతల్లి అని వెంటనే గుర్తుపట్టాడు. ఒక గొప్ప విద్యుత్తరంగం అతని నఖశిఖపర్యంతం ప్రవహించింది ఝల్లున వణకిపోయాడు భయంతో ముఖం పాలిపోయింది అరచెయ్యి వెలుపలికి తిప్పి కళ్లకడ్డం పెట్టుకున్నాడు.

ఇది చూసింది అతని తల్లి. వెంటనే రివ్వున జనాన్ని తోసేసుకుంటూ టామ్‌ను సమీపించింది. అతని కాలిని కావిలించుకుని ముద్దులు కురిపించింది "నాయనా! చిట్టితండ్రీ!" అంటూ సంతోషం, ప్రేమ పెనగొన్న కళ్ళతో అతని వంక చూసింది అదే క్షణంలో అంగరక్షకుల్లో ఒకడు ఆమెను సమీపించి బలవంతాన ఇవతలకు లాగి విసిరి గిరాటేశాడు. ఆమె దొర్లుకుంటూపోయి జనుల మీద పడింది "నువ్వెవరో నేనెరగను," అనబోతున్నాడు టామ్, ఇంతలో ఆమె వేరుచేయబడింది ఆమెనా విధంగా గిరవాటెయ్యడం అతనికి

శూలాలతో పొడిచినంత బాధకలిగించింది.

ఆమె ఆఖరుసారి వెనక్కి తిరిగి చూసింది తన కొడుకు వంక. ఈ పరాభవంతో ఆమె హృదయం ఎంత తీవ్రంగా గాయపడిందో టామ్‌కు తెలిసింది సిగ్గుతో నిలువెల్లా దహించుకుపోయాడు ప్రపంచంలో తనంత నీచాతినీచుడు మరొకడు లేడని కుమిలిపోయాడు

ఊరేగింపు ముందుకు సాగింది. ఎక్కడకుపోయినా, ఎంతదూరం పోయినా ప్రజల ఉత్సాహశబ్దాలు తగ్గలేదు. కాని టామ్ కాంటికి వాటిమీద ఆసక్తి పూర్తిగా నశించింది కళ్లు తెరుచుకునే ఉన్నాడు కాని ఏమీ చూడడం లేదు. తన పదవి, దుస్తులు, తనకు జరిగే గౌరవం అన్నీ వెక్కిరింపుగా, అసత్యమైనవిగా తోచాయి. మొదటిరోజుల్లో మాదిరిగా "భగవాన్! ఈ బంగారు చెర ఎప్పటికి వదులుతుంది నాకు?" అనుకున్నాడు

"విరాళం! విరాళం!" అని మళ్ళీ కేకలు వినవచ్చాయి కాని టామ్ తలవంచుకునే ఉన్నాడు మాటలు చెవిని పడుతూనే ఉన్నాయిగాని అతడు వినిపించుకోడం లేదు "ఎడ్వర్డు మహారాజుకూ జై" అని మళ్లీ జయజయ నినాదాలు అయినా అతడు తల ఎత్తి ప్రజల గౌరవం స్వీకరించలేదు అతని చెవుల్లో ఒకటేమాట ప్రతిధ్వనిస్తోంది, తన స్వంతతల్లిని, ప్రేమతో పెంచి పెద్దచేసిన తల్లిని "నువ్వెవరో ఎరగను" అని తిరస్కరించబోయాడు ఈ మాటలే అతని చెవుల్లో పదే పదే రింగుమంటున్నాయి

రాజుగారి ముఖంలో ప్రజలు విచారం కనిపెట్టారు వారి ఉత్సాహం నెమ్మదిగా తగ్గనారంభించింది "ఎడ్వర్డు రాజుకూ జై," అని ఇదివరకంత గట్టిగా అరవడంలేదు బిక్కమొహాలతో టామ్‌కేసి చూడనారంభించారు.


ఈ మార్పును హెర్ట్‌ఫర్డు ప్రభువు వెంటనే పసిగట్టి టామ్ పక్కకువచ్చి నిలబడ్డాడు చెవిదగ్గరగా వంగి రహస్యంగా చెప్పాడు

"ప్రభూ! కలలు కనడానికిది సమయం కాదు. ప్రపంచమంతా మీకేసి తల ఎత్తుకుని చూస్తోంది, మీ ముఖంలో విచార మేఘాలను ప్రజలు గమనిస్తున్నారు. వారి ఉత్సాహాన్ని నశించనివ్వగూడదు. వారికేసి చూసి మందహాసం చెయ్యండి," అంటూ హెర్ట్‌ఫర్డు ప్రభువు సంచీలోంచి రెండు గుప్పిళ్ళతో నాణాలు తీసి విరజిమ్మాడు. తరవాత టామ్ అప్రయత్నంగా తల ఎత్తి మందహాసం చేశాడు ఆ మందహాసంలో సంతోషం లేదు. అయినప్పటికీ ప్రజల ఆనందం పూర్వంవలెనే వెల్లివిరిసింది

మళ్ళీ టామ్‌తలవంచి దిగులుగా ఉన్నాడు. హెర్ట్‌ఫర్డు దగ్గిరకువచ్చి "మహారాజా! తమరు ఏదో బాధ

(43-వ పేజీ చూడండి)

బొమ్మ, రిల్లి:



వెస్సంతరజాతకం

శ్రీ మారేమండ రామారావు

500 ఏళ్ల కిందట రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసుకుని నారయ భూపాలుడు పాలించేవాడు ఆ రాజు కొంచెం డొక్కశుద్ధి కలవాడే దేవతలన్నా, బ్రాహ్మణులన్నా, కవులన్నా కాస్త భయం భక్తీ కలిగి ఉండేవాడు ఆయన కాలంలో ఒక తమాషా జరిగింది అదే ఇప్పుడు చెప్పబోతున్నా.

సాంఖ్యాయినీ నది ఒడ్డున "మునిఖండ" అనే ఒక బ్రహ్మణ అగ్రహారం ఉంది. ఆ ఊళ్లో భుక్కుండుడు అనే ఒక బ్రహ్మల కుఱ్ఱాడుండేవాడు ఆ అబ్బాయికి నా అన్నవాళ్లెవ్వరూ లేరు దమ్మిడీ ఆస్తిలేదు. అందుచేత ఊళ్లో వారాలు చేసుకుని, ఒక పండితుడి దగ్గర సంస్కృతం చదువుకోవడం మొదలుపెట్టేడు అతనికి ఇరవై ఏళ్లు వచ్చేటప్పటికి చదువు పూర్తి అయింది సంస్కృతంలోనూ, తెలుగులోనూ చక్కని కవిత్వం చెప్పగలిగేడు

ఊళ్లో వాళ్లు ఎన్నాళ్లని పోషిస్తారూ? ఎవరిమటుక్కి వాళ్లు వారాలు ఇవ్వడం మానేశారు. చదువుకున్న బ్రాహ్మడు కూలి పని ఎల్లా చెయ్యగలడు? పో బ్రాహ్మణ వృత్తికదా అని యాయ వారం చెయ్యడానికి భుక్కుండుడి నామోషీ వేసింది-మన వాళ్లు పూర్వ కాలం మహామంచిదంటారు కాని అదంతా పచ్చి అబద్ధం అప్పటి కాలంలో చదువులు కాలక్షేపాని కాని, బువ్వ సంపాదించుకోడని కాదు. భుక్కుండుడికి ప్రతిరోజు ఏకాదశిగానే ఉంది

"కవిత్వం చెప్పగలవు కదా పోసి నారయ భూపాలుడిని ఆ యిస్తే ఏమయినా పని అవుతుం

(44-వ పేజీ చూడండి)

ప్రతిజ్ఞ

శ్రీ మహీధర నళినీమోహనరావు

పూర్వం సివిరాజ్యం అని ఒక రాజ్యం ఉండేది దానిని సంజయుడు అనే రాజు పాలిస్తూ ఉండేవాడు ఆరాజు ధర్మబుద్ధి కలిగి ప్రజలని తన బిడ్డలవలె చూసుకునేవాడు. ప్రజలున్నూ ఇతనిని ఎక్కువగా ప్రేమించేవారు. కావలసినంత సిరీ, కావలసినంత సంపదా ప్రజల అనురాగమూ ఉండినా సంజయుడిని ఒక్క విచారం మాత్రం చాలా బాధ పెట్టేది అతడూ, అతని రాణీ పిల్లలు లేరని ఎప్పుడూ దుఃఖపడుతూ ఉండేవారు.

కొంతకాలం జరిగిన తరవాత రాజు అదృష్టం తిరిగింది అతనికి ఒక అందమైన పిల్లవాడు కలిగాడు ఈ పిల్లవాడికి వెస్సంతరుడని పేరు పెట్టుకుని రాజూ, రాణీ అతనిని ఎంతో గారాబంతో పెంచుతూ వచ్చారు కొద్దికాలానికే వెస్సంతరుడు వింతగా తయారు అయాడు తనకి దొరికిన వస్తువులన్నీ తనతో ఆడుకునే పిల్లలకి ఇచ్చేసేవాడు. అడుగు అడుగుకీ తల్లి దగ్గరకి వెళ్లి దానం చెయ్యడానికి ఇంకేమైనా వస్తువులు ఉంటే ఇయ్యమని అడుగుతూండేవాడు క్రమక్రమంగా పెద్దవాడు అయినకొద్దీ అతని దానాలు కూడా పెద్దవి అవుతూండేవి. ఎవరికి ఏం కోరిక ఉన్నా వెస్సంతరుడి వల్ల తీరుతుందనీ, ఎవరు ఏది అడిగినా అతను తప్పకుండా ఇస్తాడనీ ఆ రాజ్యంలోనూ, చుట్టుపట్ల ఉన్న రాజ్యాలలోనూ అందరికీ తెలిసిపోయింది.

ఇలా ఉంటూండగా ఒకప్పుడు కళింగదేశంలో వానలు కురవక పెద్ద కరువు ఏర్పడింది, ఎవరు ఏ ప్రయత్నం చేసినా వాన కురవలేదు. ఒకరోజున ఒక బ్రాహ్మడు కళింగదేశపు రాజు వద్దకి వచ్చి "మహారాజా! సివిరాజు కొడుకైన వెస్సంతరుడి దగ్గర అందమైన తెల్ల ఏనుగు ఒకటి ఉన్నది. ఆ ఏనుగు ఎక్కడ ఉంటే అక్కడ కరువులూ, కాటకాలూ ఉండవు. పాడీ, పంటా కావలసినంతగా ఉంటాయి. ఆ ఏనుగుని కనక ఈ రాజ్యంలోకి తీసుకువస్తే ఈ కరువు పోతుంది" అని చెప్పాడు. వెస్సంతరుడి కీర్తి అందరికీ తెలిసినదే అయినా అతను అలాంటి ఏనుగును దానం చేస్తాడా అని కళింగరాజు అనుమానించాడు. కాని ఆ బ్రాహ్మడు అతనికి ధైర్యం చెప్పాడు. ఆమీద కళింగరాజు నలుగురు బ్రాహ్మలని సివిరాజ్యానికి పంపించాడు. వాళ్లు రాజధానికి వచ్చారు.

అప్పటికి వెస్సంతరుడు తన తెల్ల ఏనుగుని ఎక్కి తను కట్టించిన ఆరు సత్తరువులలోనూ చేరిన బీదలకి దానాలూ, ధర్మాలూ చేయిస్తున్నాడు. అది చూసి కళింగదేశపు బ్రాహ్మలు ఆశ్చర్యపడ్డారు. వెస్సంతరుడు ఇంటివైపు మళ్ళగానే ఈ బ్రాహ్మలు నలుగురూ అతనికి ఎదురుగా వెళ్ళి నిలబడ్డారు. వెస్సంతరుడు ఏనుగు దిగి వారికి నమస్కారం చేసి మీకు ఏం కావాలి అని అడిగాడు బ్రహ్మలు కళింగదేశంలో ప్రజలు కరువువల్ల ఎన్ని బాధలు పడుతున్నారో చెప్పి, ఆ తెల్ల ఏనుగును ఇవ్వవలసింది అని అడిగారు వెస్సంతరుడు ప్రజలు బాధలు పడుతున్నందుకు చాలా విచారించి, వెంటనే తన ఏనుగను వారికి దానం ఇచ్చేశాడు

బ్రాహ్మలు ఎంతో సంతోషంతో ఆ ఏనుగుని తమదేశం తీసుకువెళ్ళి కరువు పోగొట్టి ప్రజ లందరినీ సుఖపెట్టారు.

వెస్సంతరుడి వృత్తాంతం ఇంద్రుడు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నాడు ఆ రాజకుమారుడు ఏనుగును దానం చెయ్యడంతో ఇంద్రుడికి చాలా ఖంగారుపుట్టింది. వెస్సంతరుడు ఇలాగే దానాలు చేస్తూ పోతూంటే, అతని పుణ్యం బాగా పెరిగిపోయి చివరకి ఇంద్రుడి పదవికే వస్తాడో, దానిని మించిపోతాడో అని భయంవేసింది ఇంద్రుడికి. అనేక బాధలు కలిపించి ఎలాగైనా వెస్సంతరుడి దానాలకి అడ్డు వెయ్యాలని నిశ్చయించుకున్నాడు అతను. అంతటినించీ ఇంద్రుడి ప్రభావంవల్ల అనేక వింతలు జరిగాయి వెస్సంతరుడు ఏనుగుని దానంచేసిన మర్నాడు నగరంలో ఉన్న జనంఅంతా గుసగుసలాడడం మొదలుపెట్టారు. వాళ్ళలో తెలివైనవాళ్లు ఒకచోటచేరి ఆ ఏనుగు పోవడంవల్ల తామంతా ఎన్నో కష్టాలపాలు కావలసి వస్తుందనీ, తమ రాజ్యంలోనే కరువు సంభవించవచ్చుననీ, అప్పుడు తమరు దానిని తప్పించుకోలేరనీ ప్రచారం చేశారు. ఆ తెల్ల ఏనుగుని దానం చేసి రాజుగారికొడుకు తమకందరికీ పెద్ద అపకారం చేశాడని అందరూ ఒప్పుకున్నారు. ఆవేశంగా వాళ్ళంతా రాజుదగ్గిరికి వెళ్లి వెస్సంతరుడిని అనేకవిధాల నిందించి, అతనిని శిక్షించమని కోరారు. రాజ్యంలోనే ఉంటే ప్రజలు ఎలాగైనా తన కొడుకుని చంపి పగదీర్చుకుంటారని భయపడి రాజు తనే వెస్సంతరుడిని రాజ్యం వదిలి వెళ్లిపొమ్మని ఆజ్ఞాపించాడు. ప్రజలు దీనితో తృప్తిపడ్డారు

ఆ మర్నాడే వెస్సంతరడు ఒక రథంమీద తన భార్యనీ, ఇద్దరు పిల్లలనీ ఎక్కించుకొని ఊరు విడిచి వెళ్లిపోయాడు అయినా ఇంద్రుడు మాత్రం అతనిని వదలలేదు కొంత దూరంపోయాక ఇద్దరు బ్రాహ్మలు అతనికి ఎదురైనాగు వెస్సంతరుడు వారికి చేతనైన విధంగా మర్యాద చేసి, తనవద్ద అప్పుడు ధనం ఏమీ లేదనీ అయినా తనదగ్గర ఉన్న ఏదైనాకావలిస్తే ఇస్తాననీ అన్నాడు. ఒక నిమిషం ఆలోచించి బ్రాహ్మలు వెస్సంతరుడి బండికి కట్టివున్న గుర్రాలు కావలెనని కోరారు. అతను సంతోషంగా వాటిని ఆ బ్రాహ్మలకి ఇచ్చేశాడు ఆతర్వాత తనే ఆరథాన్ని లాగుకుపోయాడు కొంతదూరం పోయాక భార్య అతనికి సహాయం చేసింది ఇంతలో ఒక ముసలివాడు వాళ్లకి ఎదురైనాడు ఒళ్ళంతా ముడతలు పడిపోయి, అక్కడనించి యిక్కడికీ ఇక్కడినించి అక్కడికీ తూలుతూ కర్రమీద ఆనుకుని ఎలాగో పడుతూ లేస్తూ వస్తూన్న ఆ ముసిలిని చూస్తే వెస్సంతరుడికి చాలా జాలివేసింది. కాస్సేపు ఆయాసం తీర్చుకుని ఆ ముసిలివాడు తనకి ఎవరూ లేరనీ, ఉండడానికి ఒక గుడిసె అయినా లేక ఎండకీ వానకీ చాలా బాధపడుతున్నాననీ మొరపెట్టుకున్నాడు వెస్సంతరుడు తనూ, భార్యా కలిసి ఆ ముసలికి ఒక గుడిసె వేసి ఇస్తామన్నారు కాని ఆ ముసలివాడు వెస్సంతరుడి రథం కావలెనని కోరాడు రాజకుమారుడు వెంటనే తన పిల్లలని రథంలోనించి దింపి దాన్ని ఆ ముసలికి సంతోషంగా దానం చేసేశాడు అతనూ, భార్యా తలకొక బిడ్డనీ ఎత్తుకుని ముందుకి నడిచి వెళ్లిపోయారు చాటునే వుండి చూస్తున్న ఇంద్రుడు మంచి శాస్తి చేశామని సంతోషించాడు.

వెస్సంతరుడూ భార్యానడవలేక నడవలేక పోయి పోయి ఒక కొండ దగ్గిరకి చేరారు. చుట్టుపట్ల ఉన్న చెట్లకొమ్మలు విరిచి తెచ్చుకుని ఒక కుటీరం కట్టుకున్నారు అడవులలో దొరికే పళ్లూ, దుంపలూ తింటూ ఎలాగో కాలం గడుపుతున్నారు కౌశాంబీ అనేనగరంలో ఒక బ్రాహ్మడు ఉండేవాడు అతని భార్య చాలా గయ్యాళి ఆ బ్రాహ్మడిని రోజూ ఎందుకో అందుకు తిడుతూనే ఉండేది ఒక రోజున ఆమె తనకి ఇంట్లో పని చాలా ఎక్కువగా ఉన్నదనీ, ఎవరినైనా పనిచేసే కుర్రవాడిని తీసుకు రమ్మని భర్తని వేధించింది పాపం! ఆ బ్రాహ్మడు ఇల్లు బయలుదేరి ఆ వూరూ యీవూరూ తిరిగి తిరిగి ఆఖరికి అడవిలో వెస్సంతరుడు ఉంటూన్న కుటీరానికి వచ్చాడు. అక్కడ తనబాధంతా వెస్సంతరుడికి చెప్పుకుని విచారించాడు వెస్సంతరుడి భార్య నీళ్లు తెచ్చుకోడానికని చెరువుకి వెళ్లింది అతని పిల్లలిద్దరూ చెట్లనీడని ఆడుకుంటున్నారు వెస్సంతరుడు బ్రాహ్మడికి ఆపిల్లలని ఇద్దరిని చూపించి "వాళ్లని నీకు దానం చేస్తున్నాను. నీతో

తీసుకు వెళ్లు" అన్నాడు ఆ బ్రాహ్మడు ఒక్కగంతులో ఆపిల్లలదగ్గరకి వెళ్లి వాళ్లని తనతో రమ్మన్నాడు పాపం! ఈగొడవంతా ఏమిటో తెలియక వాళ్లు మొదట కొంచెం మారాం చేశారు బ్రాహ్మడు దగ్గరనే ఉన్న కర్ర ఒకటి తీసుకుని భయపెట్టగానే వాళ్లు మళ్లీ మాట్లాడకుండా అతనితో వెళ్లిపోయారు మరొక రెండునిమిషాలకి వెస్సంతరుడి భార్య చెరువునించి వచ్చింది వెస్సంతరుడు ఆమెతో జరిగిన సంగతంతా చెప్పేశాడు ఆ యిల్లాలు భర్తని ఒక్క మాటయినా అనకుండా, దుఃఖాన్ని దిగమింగుకుని ఊరకుంది

ఇంకొకనాడు ఒక ముసలి పండు లాంటి బ్రాహ్మడు ఒకడు వెస్సంతరుడి కుటీరానికి వచ్చాడు ఆ దంపతులు అతనిని తగినట్టుగా గౌరవించారు తర్వాత అతను తనకి ఎవరూ దిక్కులేరనీ, ఈ ముసలితనంలో అన్నం వండిపెట్టేవారైనా ఎవరూ లేక చాలా బాధపడుతున్నాననీ దీనంగా మొరపెట్టుకున్నాడు వెస్సంతరుడికి ఆ ముసలివాడిమీద చాలా జాలి కలిగింది అతను వెంటనే తనభార్యని పిలిచి ఆమెను ముసలివాడికి దానంచేసేసి, ముసలి బ్రాహ్మడికి భక్తితో సేవ చెయ్యమని చెప్పాడు ఆమె మాట్లాడకుండా భర్తకి నమస్కారం చేసి, ఆ ముసలివాడిని నడిపించుకుంటూ వెళ్ళిపోయింది చాటున నించుని ఇదంతా చూస్తున్న ఇంద్రుడుకి పట్టరానంత ఆశ్చర్యం కలిగింది

వెస్సంతరుడి పిల్లలు ఇద్దరూ కౌశాంబీ నగరంలో ఒక బ్రాహ్మడి ఇంట్లో ఉన్నారనీ, నానాబాధలూ పడుతున్నారనీ వాళ్ళ తాత అయిన సంజయ మహారాజుకి తెలిసింది ఆయన వెంటనే మనమలిని తనదగ్గరికి పిలిపించుకుని సంగతి అంతా తెలుసుకున్నాడు ఇంతలో వెస్సంతరుడి దగ్గర దానాలు పుచ్చుకొన్న వాళ్ళంతా అక్కడికి చేరి వెస్సంతరుడిని అనేకవిధాల పొగిడారు ఆ నగరపు ప్రజలంతా "అయ్యో! ఇంత గొప్పవాడైన మన రాజుకొడుకుని తరిమివేశామే" అని చాలా విచారించారు వాళ్ళలో పెద్దలు "ఎలాగయినా సరే వెదికి వెస్సంతరుడిని తీసుకువస్తాం" అని బయలు

(4 వ పేజీ చూడండి)



నాడూ-నేడు

(10-వ పేజీ తరువాయి)

దుర్ఘటం పంచాయతీబోర్డు మొదలుకొని పార్లమెంటు ఎన్నికలదాకా బసవయ్యగారి మాట చెలామణి అవుతోంది. ఆయనతో ఏ స్వల్పమైన తగాదా వచ్చినా వాణ్ని కమ్యూనిస్టుగా నిరూపించి ప్రభుత్వానికి అతిథిగా పంపితేగాని ఆయనకి నిద్రపట్టదు ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పుడా గ్రామానికి బసవయ్య మకుటం లేని సార్వభౌముడు

2

కారుహారను మోత వినబడగానే వూళ్ళో జనమంతా తండోపతండాలుగా పొలాల్లోకి పారిపోయి దాక్కుంటున్నారు. కాళ్లలో శక్తి వున్నంతవరకూ వెనక్కి తిరిగి చూడకుండా ఎవరిమటుకు వాళ్ళు దూరంగా పారిపోతున్నారు అప్పటికీ రెండుమూడు సార్లు మలబారుపోలీసుల లాఠీదెబ్బలు రుచిచూసివుండటంచేత మిలిటరీలారీ అంటే గ్రామస్థులందరికీ సింహస్వప్నమైపోయింది

ఆరోజు లారీ సరాసరి బసవయ్య భవంతి ముందే ఆగింది. ఈమధ్య ఆ గ్రామ మునసబు చనిపోవటంచేత ఆ పదవి కూడా బసవయ్యకే లభించింది ఇప్పుడు గ్రామంలో ఆయన మాటకి తిరుగులేదు

పారిపోకుండా వూళ్లో మిగిలివున్న ముసలివాళ్లనీ ఆడవాళ్లనీ మునసబుగారి ఇంటికి లాక్కువచ్చారు బసవయ్య మీసాలు మెలివేసుకుంటూ అందరి ప్రాణాలూ తన చేతుల్లోనే వున్నవన్న ధీమాతో పచార్లు చేస్తున్నారు "చెప్పండి నిజం చెప్పండి మీ వొంటిమీద ఒక్క దెబ్బపడకుండా చూస్తాను. ఆ చాకలి చంద్రాయి ఎక్కడ దాక్కున్నాడో చెప్పండి లేకపోతే మీ ప్రాణాలు దక్కవు" అని గర్జించాడు భయంతో వొణికిపోతూ అక్కడ గుమిగూడినవాళ్లందరూ మాకు తెలియదు మొర్రో అని మొరపెట్టుకుంటున్నారు. అందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నయ్ ఇంకొద్దిసేపట్లో ఎప్పటిమాదిరి లాఠీలతో బాదటం మొదలైతే తమ పని ఏంకావాలి? తమరు ఏమీ ఎరగని నిరపరాధులు. తమని ఎవరు కాపాడుతారు?

ఇంతలో ఛాతీ విరుచుకుంటూ "ఇదుగో వచ్చాను ఎందుకు నాతో పని వొచ్చిందో చెప్పండి"అంటూ చాకలిచంద్రాయి తోసుకుంటూ ముందుకి వచ్చాడు అక్కడికి బలవంతాన లాక్కువచ్చినవాళ్లందరూ అమ్మయ్య అని పెద్ద నిట్టూర్పు విడిచారు

"నేను ప్రభుత్వానికి విరోధినని రుజువు చెయ్యండి బసవయ్యగారూ? తరవాత నన్ను మీరేం చేసినాసరే" అని చంద్రాయి సవాలు చేశాడు ఎల్లాగైనా వీణ్ని వూళ్ళోంచి పంపిస్తేగాని బసవయ్యకి మనశ్శాంతి వుండదు చంద్రాయి కొస్త చదువుకున్నవాడు గనక జనాన్ని పోగుచేసి పత్రిక చదివి వినిపిస్తాడు బసవయ్యగారిక్కి పక్కతాళం వెయ్యడు రొమ్ము విరుచుకుని తిరుగుతాడు కాని పోలీసు అధికారి ముందు సవాలుచేసి అడిగేసరికి బసవయ్య గొంతున పచ్చివెలక్కాయ పడింది అయినా తడుముకోకుండా "వీడు పెద్ద నాయకుడు వీడు వూళ్ళో వుంటే గ్రామంలో శాంతి భద్రతలు వుండవు" అని బిగ్గరగా అన్నాడు

"అబద్ధం ఇదంతా అబద్ధం చంద్రాయి ఒకళ్ల జోలికి పోడు ఉప్పుసత్యాగ్రహంలో లాఠీదెబ్బలు కూడా తిన్నాడు వాడివల్ల గ్రామానికి మేలేకాని కీడు ఏనాడూ వాటిల్లదు" అని గంభీరస్వరం వినిపించింది అంతా వెనక్కి తిరిగి దామోదరం అక్కడికి రావటం చూసి ఆశ్చర్యపడ్డారు

"ఎవరు నువ్వు?" అని అధికారి రీవిగా అడిగాడు

"నేనొక ప్రజాసేవకుణ్ని అమాయక ప్రజలని విచక్షణలేకుండా హింసించవద్దని విన్నవించటానికి వచ్చాను" అని దామోదరం ముందుకి నడిచాడు అధికారి ఎంతో గౌరవించి తన పక్కన కూచోబెట్టుకుని చాలాసేపు దామోదరంతో ముచ్చటించాడు ఇదంతా వింటూ ఇంగ్లీషురాని బసవయ్య కొరకొరలాడుతూ కాలుకాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరిగాడు తన ఇంట్లోనే తన కింత తలవంపు జరిగినందుకు మంటలు మండిపోతున్నాడు

కొంచెంసేపట్లో వచ్చిన మిలిటరీలారీ తిరుగుదారిపట్టింది ఎవరికీ దెబ్బలు తగల్లేదు అంతా లోపల పొంగిపోయి ఇదంతా దామోదరంగారివల్లనే జరిగిందని ఆయన్ని వేనోళ్ల పొగడటం మొదలుపెట్టారు

ఇంటికి తిరిగివెళ్తూ దామోదరం "ఏం బసవయ్యా! అంతా క్షేమమా?" అని మామూలుగా ఆప్యాయంగా పలకరించాడు బసవయ్య వినిపించుకోనట్లుగా ముఖం తిప్పుకుని వెళ్లిపోయాడు

తోక తొక్కిన తాచులాగా బసవయ్య మనస్సు బుసలుకొడుతోంది తనమీద ఇంగ్లీషులో అధికారికి దామోదరం ఏం చెప్పాడో? ఈ దామోదరాన్ని వూళ్లోంచి వెళ్లగొడితేకాని తనకి స్థిమితంగా వుండదు ఎల్లాగైనాసరే ఈ శత్రువుని చుట్టుపట్ల లేకుండా తరిమివెయ్యాలి ఈ మంట ఎల్లా చల్లారుతుంది?

3

ఆరోజు వూళ్లో పెద్ద సభ జరిపారు బసవయ్య దానికి అధ్యక్షత వహించాడు. తిండి దొంగల భరతం పట్టాలనీ, దొంగబజారు రూపుమాపాలనీ, అధికాహారం ఉత్పత్తి చెయ్యాలనీ వేదికమీదినుంచి అధ్యక్షులు దీర్ఘంగా గంభీరంగా ఉపన్యసించాడు ఆ సభలో ఏదో ఒకమూల దామోదరం ఒదిగి కూచుని అంతా వింటున్నాడు సభ కొంచెంసేపటికి ముగుస్తుందనగా, బసవయ్య గొంతులో మార్దవాన్ని నింపుతూ "అనాదినుంచీ ప్రజాసేవలో తలనెరిసిన పెద్దలు దామోదరంగారు ఈ సభకి విచ్చేయటం మన అదృష్టం వారు నాలుగు ముక్కలు మాట్లాడాలని కోరుతున్నాను" అన్నారు జనం ఎంతో ఒత్తిడిచేశారు అంతా చాలా బతిమాలుకున్నారు కాని దామోదరం మాత్రం కూచున్న చోటినించి కదల్లేదు, నోరు మెదపలేదు సభ ముగిసే సమయంలో ఒక ఖాదీవాలా లేచి "మహాజనులారా! వచ్చే ఎన్నికల్లో పచ్చపెట్టెలోనే మీ వోటు వెయ్యాలి మన నియోజకవర్గంతరఫున అద్వితీయ ప్రజాసేవకులు, బసవయ్యగారు నిలబడతారు వారిని గెలిపించే భారం మీది "అని ప్రచారానికి పూనుకోగానే దామోదరం లేచి వెళ్లిపోయాడు ఆయనతోపాటు చాలామంది లేచి వెళ్లిపోయారు ఇల్లా లేచి వెళ్లిపోవటం బసవయ్యకి రేగిన పుండుమీద కారం జల్లినట్లుగా అనిపించింది దామోదరాన్ని మళ్లీ లేవకుండా అథఃపాతాళానికి తొక్కివేసే తరుణంకోసం బసవయ్య తహతహలాడుతున్నాడు

ఇల్లావుండగా ఒకరోజున ఊళ్లో ఏనోట విన్నా అదేమాట కార్తీకమాసంలో కూలీనాలీ చేసుకునే బీద జనం ఊళ్లో ధాన్యపుగింజ దొరక్క గిజగిజలాడి పోతున్నారు మోతుబరిరైతులు గాదెలకి తాళాలు బిగించుకున్నారు అటువంటి సమయంలో దామోదరం తన దగ్గరున్న పుట్టెడు ధాన్యమూ అడిగినవాళ్లందరికీ పంచిపెట్టాడు వాళ్ల ఆనందానికి పట్టపగ్గాలు లేవు ఆయన్ని దానకర్ణుడనీ, అటువంటి మహారాజు ఈ కలిలోనే లేడనీ జనమంతా కొనియాడారు ఆయన వాళ్లదగ్గర కంట్రోలు ధర మించి కానీకూడా పుచ్చు

కోలేదు ఆ సమయంలో అమ్మినా ధర్మంగా ఇచ్చినట్లే జనం పొంగిపోయారు

ఈ సంగతి వినగానే బసవయ్య అగ్గిలాగా మండిపోయాడు దామోదరం బీద సాదలని వశం చేసుకుని గ్రామంలో క్రమేణా గొప్ప విప్లవాన్ని లేవతీస్తాడనీ, ఆ కార్యక్రమానికి ఇది మొదటి మెట్టనీ బసవయ్య రుసరుసలాడాడు ఎల్లాగైనాసరే దామోదరం దరిద్రంవల్ల కాంగ్రెసు సిద్ధాంతాలని విడనాడి కమ్యూనిస్టవుతున్నాడని బసవయ్యకి తోచింది దామోదరం ధరించే ఖాదీ, తిప్పేచర్ఖా, అన్నీ కపటనాటకాలనీ, లోపల విప్లవభావాలున్నయ్యనీ, అందుకనే ఆనాడు అధికారిముందు చాకలి చంద్రాయిని సమర్థించాడనీ బసవయ్య తలపోశాడు ఈ శత్రువుని హతమార్చితీరాలని పట్టుపట్టాడు ఇప్పుడు పగ తీర్చుకునే ఉపాయంకూడా స్పష్టంగా అతనికి గోచరిస్తోంది

అయినా ముందు దామోదరాన్ని ఒకసారి కలుసుకుని మంచిమాట చేసుకోవాలనిపించి బసవయ్య అప్రయత్నంగా దామోదరం ఇంటికి బయలుదేరాడు ఎప్పటి మాదిరిగానే దామోదరం ఎంతో ఆప్యాయంగా సత్కరించాడు బసవయ్య గొంతు సవరించుకుని "మనలో మనకెందుకీ తగూలు?" అన్నాడు "నాకు నీతో తగూవేమిటి?" అని దామోదరం నవ్వుతూ అన్నాడు

"నువ్వు కోరినంత ధన మిస్తాను ఈ స్థలంలో నీకో పెద్ద భవంతి వేయిస్తాను నీ పిల్లలకి చదువులకీ, పెళ్ళిళ్ళకీ అయిన ఖర్చంతా భరిస్తాను –"

"ఎందుకు బసవయ్యా! నామీద నీకింత దయ?" "ఏంలేదు ఇంత దీనావస్థలో నువ్వుండటం చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది" అని బసవయ్య మొసలి కన్నీళ్లు తుడుచుకున్నాడు

"దానికింత విచారపడటం దేనికి? ఓడలు బళ్లు, బళ్లు ఓడలూ! ఏదో పనిమీద వొచ్చినట్లున్నావ్?"

"అవును రేపటి ఎన్నికల్లో నన్ను గెలిపించేభారం నీ మీద పెడుతున్నాను నీ పలుకుబడి వుపయోగించి నన్ను గెలిపిస్తే నీకు కోరినధనమిస్తాను––"

"ఆపని ఎన్నటికీ నావల్ల కాదు అనవసరంగా నా మీద ఆశలు పెట్టుకోకు"

"పోనీ నీవోటయినా నాకిస్తావా?"

"అసంభవం"

"అయితే ఇదే ఆఖరిమాటా? ముందు వెనకలాలోచించుకో అనవసరంగా అవకాశాన్ని జారవిడుచుకోకు తరవాత పస్తాయించి లాభంలేదు"

"ముమ్మాటికీ ఇదే నా నిశ్చయం"

"అయితే కాసుకో నాపగ తాచుపాము పగ! నన్ను కాదని నువ్వీవూళ్లో నిమిషం బతకగలవా? చూస్తాను కాసుకో!"

"దైవం ఎన్నాళ్లు నన్ను బతకమని శాసించాడో అన్నాళ్లూ బతుకుతాను నాకేం భయంలేదు, బసవయ్యా జంకటం పిరికిపందల లక్షణం!"

"దగ్గరికొచ్చినయ్ లే నీ రోజులు" అంటూ బసవయ్య చరచరా వెళ్లిపోయాడు.

4

ఆ పుకారు దామోదరానికి కూడా వినిపించింది వూళ్లో గింజ దొరక్క జనం అలమటిస్తుంటే బసవయ్యగారి లారీ రాత్రిపూట ఉత్తరాదికి ధాన్యం తోలుకుపోతున్నది అక్కడ బస్తా యాభైదాకా అమ్ముతోందిట ఈ దొంగలాభాలన్నీ ఖద్దరు లాల్చీచాటున దాక్కుంటున్నయ్

దీని నిజానిజాలు తేల్చాలని దామోదరం గట్టిగా సంకల్పించాడు ఎవరికీ చెప్పకుండా, ఇంట్లో అంతా పడుకున్నాక చేతులో బాణాకర్ర, ఇంకో చేత్తో టార్చిలైటూ పుచ్చుకుని వూరిబైట మర్రి చెట్లచాటున కూర్చున్నాడు ఎవరినీ తోడు తీసుకురాలేదు ఆయనకి దైవమే అంగరక్ష అని విశ్వాసం

దూరంనుంచి లారీమోత వినబడింది దామోదరం లేచి నిలబడ్డాడు లైట్లు మసకగా కనిపిస్తునయ్ వెళ్లి దారికిఅడ్డంగానిలబడ్డాడు. గుండెలు దడ దడ లాడుతున్నాయ్. వేగంగా లారీదగ్గిరికొచ్చేస్తోంది ఇంకొక్కగజం దూరంలో వుండగా టార్చిలైటు వెలిగించి "ఆపు ఆపండి" అని బిగ్గరగా కేక వేశాడు లారీ రక్కన ఆగింది లోపలినించి మనుషులు కర్రలతో మీదికి దూకారు

"అమ్మా!" అన్న అరుపు అర్ధరాత్రి నిశ్శబ్దాన్ని చీల్చి వేసింది

టార్చిలైటు వెలుతురు ముఖంమీద పడింది "బ-స-వ-య్యా" అంటూ దామోదరం కళ్లు తేలవేశాడు చిట్లిపోయిన దామోదరం తలలోంచి చిందినరక్తం బసవయ్య లాల్చీమీద సరిగా గుండెలదగ్గర పెద్ద డాగుగా పడింది

"రామ రామ" అంటూ దామోదరం ఆఖరి ఊర్పు విడిచాడు

దామోదరం చేతిలోంచి పట్టుతప్పి కింద పడిపోయిన టార్చిలైటుకిరణాలు సూదుల్లాగా బసవయ్యని గుచ్చుతూ, అతని మనస్సులోకి చొచ్చుకుపోతున్నయ్. ఆ కాంతి తన హృదయాంతరాళాలలోకి అగ్నిజ్వాలలాగా చొరబడుతోంది

కేకవిని జనం గుంపులుకూడేలోగా బసవయ్యా అనుచరులూ పారిపోయారు కాని దామోదరం చేతులోంచి జారిపడిపోయిన టార్చిలైటుకాంతి మటుకు బసవయ్యని వెన్నంటి తరుముతునేవుంది ★

సముద్రం

(12-వ పేజీ తరువాయి)

డగా యేదో చెప్పాలనుకొన్నాడు కాని ధైర్యం చాలలేదు గుమ్మంలో కూర్చున్న సుభద్రమ్మ "ఏం నాయనా రాత్రిపూట యింటిదాకా రావాలా? ఏబండిలోనో పంపెయ్యలేకపోయావూ" అంది "ఫరవా లేదులెండి రేపు ఆదిరమేగా" అన్నాడు రామనాథం

"అయితే మీవాళ్లని తప్పక తీసుకురండి రేపు" అంది రాజేశ్వరి రామనాథం గత్యంతరం లేక "సరే" అన్నాడు ఇంటికి వస్తూ అనుకున్నాడు "మళ్లీ ఎప్పటి సంసారమే" అని దానికి తోడు యింటికి రాగానే భార్యామణి అలక మాట్లాడకుండా ఆ నాలుగు మెతుకులూ వడ్డించి మంచమెక్కింది "రాణి చెప్పినట్లు సినీమాలో నన్నూ రాజేశ్వరినీ చూసి వుంటుంది అంతమాత్రానికే యింత రాద్ధాంతమా? ఈ వేళ లోకువిస్తే రేపు నెత్తెక్కుతుంది ఏడవనీ" అనుకున్నాడు అయినా మనస్సు ఎందుకో కుదుటపడలేదు లేచి కామేశ్వరి వద్దకు వస్తే ఆమె నిద్రపోతూంది

మర్నాడు మధ్యాహ్నం భోజనమయ్యేక భార్యతో అన్నాడు "రాజేశ్వరి నిన్ను తీసుకురమ్మంది వెడదాం తయారవ్వు" అని. కామేశ్వరి "నాకెందుకు మీమీ రహస్యాలలో జోక్యం?" అంది ఆమె మనస్సు మాత్రం "వెళ్లు ఎన్నాళ్ళనుంచో నిన్ను పీడిస్తున్న సందేహాన్ని తీర్చుకో నీమొగుడు వర్ణిస్తున్న ఆ రంభని చూడు" అంటోంది రామనాథం "అదే నీలో లోపం 'యతి' అంటే 'ప్రతి' అంటావు నువ్వు వస్తావని వాళ్ళకి మాట యిచ్చేను రాక తప్పదు" అన్నాడు "కామోసు" ననుకుని కామేశ్వరి "సరే" నంది రాత్రికి వండిపెట్టుకుంది సామాను సర్దుకుంది ముఖం తోముకుని కాటుక పెట్టుకుంది దసరాలకు అన్నగారు పెట్టిన పసుపు సిల్కుచీర కట్టుకుంది దానికి అమరిన కణంగుడ్డ బ్లౌజు వేసుకుంది క్రొత్తగా చేయించుకున్న నెక్లేస్ తగిలించుకుంది ఏనాటిదో పెట్టెలో అడుగున వుంటే తీసి జాస్మిన్ సెంటు పమిటకు రాసుకుంది. రాణికికూడా చక్కని బట్టలు తొడిగింది రామనాథం భార్యముస్తాబు చూసి విస్తుపోయాడు ఆమె నల్లాంటి బట్టలతో చూసి చాలా రోజులయింది "నిజంగా ఈమె సౌందర్యవతి సుభద్రమ్మ చెప్పినట్లు" అనుకున్నాడు ఆ పసుపుచీర రంగుకీ ఆవిడ దేహకాంతికీ భేదం కనబడడంలేదు చెంపను చారెడేసి కళ్లు కాటుక రేఖలతో మిలమిలలాడుతున్నాయి ఇంటికి తాళం వేస్తూ "దంతమౌక్తికరుచి ఎంత తెల్పో కచం బంత నల్పు" అన్న పద్యభాగం పాడుకుంటున్నాడు.

ముగ్గురూ కలిసి రోడ్డుప్రక్కన నడుస్తుంటే ఎందరెందరో వాళ్లకేసి చూస్తున్నారు ఆక్షణంలో కామేశ్వరి భర్తగా ఆమెప్రక్కన నడవడం గర్వకారణంగానే వుందతనికి "జట్కాలో పోదా" మంటే చిన్నపిల్ల రాణి "జనం, జట్కా యెందుకెక్కుతారు" అంది "కాళ్లు లాగుతాయి కనక ఎక్కుతారమ్మా" అన్నాడు తండ్రి "మరైతే గుర్రాలకు కాళ్లు లాగవూ?" అంది రాణి భార్యాభర్తలు నవ్వుకున్నారు కూతురుకి జవాబు చెప్పడం చేతగాక ఆమె నెత్తుకుని, ముద్దుపెట్టుకుని దింపేడు రామనాథం

గుమ్మంలో అడుగు పెట్టగానే సుభద్రమ్మ "వచ్చేరా! రండి, రండి ఎంత సంతోషం" అని లోనికి తీసుకువెళ్లింది లేసు లతికిన పరికిణీతో కూర్చున్న రాజేశ్వరి లేచి రెండోగదిలోకి పోయి ఒక మాసిన చీరకట్టుకు వచ్చింది ఆ గదిలో వున్న ఒక్క కుర్చీలోనూ రామనాథం కూర్చున్నాడు వాళ్లంతా మంచాలమీద కూర్చున్నారు కామేశ్వరి కిరుప్రక్కలా రాజేశ్వరీ, ఆమెతల్లీ చేరారు సుభద్రమ్మ రాణిని చేరదీసి "నీపేరెవరు పాపా" అంది "పుష్పా రాణి" అంది పిల్ల ముద్దుగా సుభద్రమ్మ ముచ్చటగా ఆమె బుగ్గలు నిమురుతూ "నాబంగారు తల్లే" అంది రాజేశ్వరి కామేశ్వరి మెడకేసి చూస్తూ,

"ఈ నెక్లేసు మీ ఆయన చేయించినదేనా" అంది రామనాథం "నేనేం చేయించలేదు అడపా తడపా నా జేబులు కత్తిరించి ఆవిడే చేయించుకుంది" అన్నాడు కామేశ్వరి భర్తకేసి ఓరగా చూసింది "వేళాకోళానికి వేళా పాళా వుండాలి" అన్నట్లు సుభద్రమ్మ "ఇంతేకదా! ఇంకెవరిజేబులూ కత్తిరించలేదే" అంది అందరూ నవ్వేరు సుభద్రమ్మ కామేశ్వరి నెన్నో ప్రశ్నలడిగింది ఆమె వాటన్నిటికి మర్యాదగా సమాధానాలిచ్చింది రాజేశ్వరి

"మీ రెన్నిక్లాసులు చదువుకున్నారు" అంది రామనాథం వెటకారంగా

"చదువుకుంది చాకలిపద్దులు వ్రాసి చదువగలదు" అన్నాడు కామేశ్వరి కళ్లంట నీళ్లు తిరిగినంత పనయింది తల నేలకేసి కొట్టుకోవా లనిపించింది సుభద్రమ్మ అందుకుని "ఆమాత్రం చాలదుటయ్యా కావలసినది అదృష్టం" అంది

"అవును అదృష్టానికేం కావలిసినంత" అన్నాడతను వేళాకోళంగా. సుభద్రమ్మ మళ్ళీ

"అదృష్టవంతురాలు కనకనే నిన్ను కట్టుకుంది" అంది అతడు సమాధానం చెప్పలేదు ఆవిడ తనను పొగడినందుకు అవ్యక్తంగా కొంచెం గర్వం ఉద్దీపించిందతనిలో కొంతసేపు అందరూ మౌనం వహించారు రాజేశ్వరి అందుకుని,

"ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు" అంది రామనాథం "ఏమీ లేదు ఈ సంసారం ఒక సముద్రం లాంటిది" అన్నాడు రాణి అడ్డువచ్చి "నిన్న మా మేష్టారు సముద్రం పాఠం చెప్పేరు" అంది.

"సముద్రంలో ఏం దొరుకుతాయన్నారు" సుభద్రమ్మ. "రత్నాలు దొరుకుతాయి" అంది రాణి

"గులకరాళ్లు దొరకవా?" అన్నాడు తండ్రి

"గులకరాళ్లు మన రేషను బియ్యంలో దొరుకుతాయి" అంది రాణి. అందరూ ఘక్కుమని నవ్వేరు కూతురు నిశితదృష్టికీ, సమయస్ఫూర్తికీ రామనాథం గర్వపడ్డాడు సుభద్రమ్మ మళ్లీ అందుకుని

"అవును బాబూ, రత్నాలు దొరికినా, రాళ్లు దొరికినా సముద్రంలోనే అది

(జవాబు)

ఉత్తరాలు

1 వికటకవి 2 మందారదామం
3 నందసదనం 4 పంచాస్యచాపం
5 జంబీరబీజం 6 తోకమూకలో
7 రంగనగరం

పంపినవారు:
మేలగిరి పెనుగొండ.

వెతికేవాళ్లనూ గ్రహించేవాళ్లనూ బట్టి వుంటుంది" అంది రామనాధానికి కొంచెం కనువిప్పుకలిగి "కామోసు, నా సంసారంలో యింతకాలం లోటుపాట్లనే చూసుకుంటున్నాను సుఖాన్ని చూరగొనడం లేదు" అనుకున్నాడు మళ్లీ సుభద్రమ్మ "చూడు నాయనా, మీ రిద్దరూ వుండగానే చెబుతున్నాను రేపు మాఘమాసంలో మా రాజేశ్వరి పెళ్లి జరుగుతుంది రాజమండ్రీలో మీరంతా తప్పక రావాలిసుమా!" అంది ఆమాట రామనాధంగుండెలో బాకులా దూసుకుపోయింది రాజేశ్వరి పరాయిసొత్తు అని ఎన్నడూ అత డూహించలేదు తనది కాకపోయినా ఆమె ఎల్లకాలం పెళ్లి లేకుండానే వుండిపోవాలి అని కూడా అతని అంతరంగం కోరుకొనేది అయినా ఆ అదృష్టవంతు డెవరో తెలిసికోవాలని

"పెళ్లికొడుకు దేవూరు?" అన్నాడు

"ఏవూరేమిటి మనవూరే మా యింటి ప్రక్క వుండేవాడు కాదటయ్యా! బుచ్చిరాజని—"

"ఓహో! ఆ బుచ్చిరాజా? లారీలమీద తిరిగే ఆ నల్లటి "

"అతనే నలుపో, తెలుపో - ఏం, మన అమ్మాయి మాత్రం ఏమంత రంభా, ఊర్వశా?" అంది సుభద్రమ్మ రామనాధం రాజేశ్వరికేసి చూసేడు ఆమె చూపులు శూన్యంలో పెట్టి పరధ్యాన్నంగా వుంది మళ్లీ సుభద్రమ్మ,

"సాంప్రదాయం మంచిది, మడిమాన్యాలున్న కుటుంబం" అంది రామనాధం బుచ్చిరాజును బాగా యెరుగును అతను ధనవంతుడే పితామహ ప్రపితామహులు పుష్కలంగా దాచిపెట్టిన ధనరాసులు మార్చుకుతినడమే అతనిపని ఆమధ్య లారీల వ్యాపారంచేసి, ఈమధ్య ఒక సినీమాహాలు కట్టించుకుందుకు ప్రోగు చేస్తున్నాడు మళ్లీ రాజేశ్వరి వైపే చూస్తున్నాడు రామనాధం తల్లి చెప్పినట్లు నిజంగా ఆమె రంభా కాదు ఊర్వశీ కాదు వయస్సు వేసే ముద్ర లొక్కటొక్కటే ఆమె ముఖంమీద కనబడుతున్నాయి ఆమె కేసి లగ్నమైన దృష్టిని కామేశ్వరికేసి త్రిప్పుకున్నాడు రామనాధం 'ఈమె నిజంగా అందకత్తె ఇంతకాలంనుండీ నేను గ్రహించలేకపోయాను' అనుకున్నాడు ఆ నిశ్శబ్ద వాతావరణం కామేశ్వరిలోనూ సంచలనం కలిగించింది ఇంతకాలం తాను తన భర్తమీదా రాజేశ్వరిమీదాపడ్డ అపోహలకి సిగ్గు కలిగింది "ఎంత మతిపోయిందనాకు! పాపం, ఏమీ యెరగని ఆయన్నీ, పెండ్లి చేసుకోబోతున్న ఆవిడనీ గురించి ఎంత తప్పుగా భావించేను నావన్నీ శుష్క సందేహాలే" అనుకుంది అయినా రామనాధం ఆవిడగొలుసును, ఆవిడ చదువునూ గురించి చులకనగా వాళ్ళ యింట్లో ఆడిన మాటలు ఆవిడ నింకా కొంచెం బాధిస్తూనే వున్నాయి ఇంతలో రామనాధం లేచి, "పోయివస్తాము" అన్నాడు రాజేశ్వరి కామేశ్వరికి బొట్టుపెట్టింది వాళ్లు వీధి గుమ్మం దిగుతూంటే సుభద్రమ్మ కూతుళ్లతో చెబుతూంది "చూసేరా! అందానికి తగిన మర్యాద, మర్యాదకి తగిన మాట పొందిక - అవిణ్ణి"

రోడ్డుప్రక్క నడచిపోతూన్నా రామనాధానికి సుభద్రమ్మ తన భార్యను గురించి అన్న ఆఖరిమాటలు పదేపదే తలుపుకు వస్తున్నాయి ఇంతలో ముగ్గురూ జట్కాయెక్కారు ఇంతవరకూ దారిలో మాట్లాడని రామనాధం భార్యవైపు తిరిగి "ఎలాగుంది వాళ్ళ సంసారం?" అన్నాడు ఆమె జవాబు చెప్పలేదు అకస్మాత్తుగా వచ్చిన కోపంతో "మళ్ళీ నరక కూపంలో పడాలి వెధవ మూతిముడుపులు" అని విసుక్కుంటున్నాడు జట్కాసాయిబు అడ్డంవచ్చి "క్యోఁ బాబూ! బినాకారణ్ ఘుస్సాదిఖాతేహైఁ అమ్మాకే ఊపర్" (కారణ రహితంగా అమ్మమీద కోప్పడతా వెందుకు బాబూ) అన్నాడు రామనాధం తలకొట్టేసి నట్లయింది ఆ జట్కావాడు కూడా ఆమెనే సమర్థిస్తూ తనకు బుద్ధులు నేర్పుతున్నాడు వాడికున్న నిశ్చలత కూడా తనకు లేదు! వాడు తన గుర్రాన్ని కూడా 'ఛలో బేటా!' అంటూ ఆప్యాయంగా పిలిచి పరుగెత్తించుకు పోతున్నాడు తాను మాత్రం తన భార్యమీద, తన అర్ధాంగిమీద, తన గృహలక్ష్మిమీద విసుగుచూపెడుతున్నాడు "పాపం, ఆమె యేం తప్పుచేసింది? ఆమెను గురించి వాళ్లయింట్లో ఎంత చులకనగా మాట్లాడేనున్నా మె పల్లెత్తుమాట అనలేదే ఆమెమీద యెన్నడూ కోపపడకూడదు" అనుకున్నాడు రామనాధం

ఇంట్లో అడుగుపెట్టగానే కామేశ్వరి లైట్లువేసి' కాళ్లు కడుక్కొని, బట్టలు మార్చుకొంది దేవునికి దీపంపెట్టింది రాణికి అన్నం తినిపించి, నిద్రపుచ్చింది. ఆ తర్వాత భర్తతో "అన్నానికి లేవచ్చు" నంది భోజనంచేస్తూ రామనాధం "నన్ను క్షమించు నీ మనస్సుకి నొప్పి కలిగించి వుంటాను" అన్నాడు "అన్నం తినండి, తర్వాత చూద్దాం" అంది కామేశ్వరి ముభావంగా అన్నంతిని అతడు ఆరుబయట పడక కుర్చీలో వ్రాలేడు చంద్రుడు పుచ్చపువ్వులా వెలుగుతున్నాడు పైన రామనాధం మనస్సులో కామేశ్వరిమీద అపారమైన ఆపేక్ష కలిగింది సంసారసాగరంలో రత్నాలుకూడా వుంటాయన్న సుభద్రమ్మమాటలు స్ఫురణకు వస్తున్నాయి కామేశ్వరి అన్నంతిని, వంటగది కడుక్కొని తలుపులు వేసుకుని వచ్చింది భర్త కుర్చీ ప్రక్కనే నేలమీద చాపవేసుకుని కూర్చుంది రామనాధం వంగి అద్దాలవంటి ఆమెచెక్కిళ్లు రెండు చేతులలో తీసుకుని ఆమె ముఖం పైకెత్తేడు ఆమె అర్ధనిమీలిత నేత్రాలతో భర్తను చూస్తూంది ఆమె కళ్లల్లో అతనికి మహాసముద్రం గోచరిస్తోంది దాని అడుగున వున్న అమూల్యరత్నాలు ధగధగా మెరుస్తున్నాయి వాటచుట్టూ లక్షలూ కోట్లుగా వున్న గులకరాళ్ల నతడు గణించడం లేదు "ఆహా! నాజీవితంలో నిన్నటి దినానికీ, ఈ దినానికీ ఎంత భేదం" అని నిట్టూర్చాడు పులకరింపులతో తడబడుతూన్న గొంతుకతో "నువ్వు నా భాగ్యరాశివి, నా గృహలక్ష్మివి నన్ను క్షమించవూ" అంటూ వాంఛాపూర్వకంగా ఆమె కళ్లల్లోకి చూసేడు ఆమె ముఖారవిందం ఎట్టి అభ్యంతరమూ చెప్పక అతిన్ని అమృత రసవీథుల్లోకి తీసుకుపోయింది ★

పాత్రనిర్దేశం

పాస్కల్ ప్రొడక్షన్స్‌వారు తీయనున్న గాంధీ చిత్రానికి ఇంకా గాంధీ పాత్ర ధరించేవారు నిర్ణయం కాలేదు ఇది నిర్ణయం అయేనాటికి ఈ పాత్రకు సరిఅయినవాణ్ణే పట్టుకొస్తారని మనం విశ్వసించవచ్చు హాలీవుడ్ చిత్రనిర్మాతలు చారిత్రక చిత్రాలు తీయబూనినప్పుడల్లా ప్రఖ్యాతపురుషుల పాత్రలు ధరించటానికి గాను నటులను అతి శ్రద్ధగా ఎన్నుకొంటారు అనేకసార్లు వారు కొత్త వ్యక్తులను తీసుకురావటమూ, విదేశాలనుంచి నటులను తెచ్చుకోవటమూ కూడా కద్దు హాలీవుడ్ చిత్రనిర్మాతలు ఇంత శ్రమపడినా ఒక్కొక్కసారి ఫలితం అంత తృప్తికరంగా ఉండదు అయినప్పటికీ ఆ నిర్మాతలు ఉన్నంతలో చాలవరకు సరి అయిన వ్యక్తినే ఏరారని మనం విశ్వసించవచ్చు

ఎందుచేతనంటే చారిత్రక పాత్రను ధరించే నటుడిలో పాత్రపోలిక ఉండటం చాలా ముఖ్యమే అయినప్పటికీ అది ఒకటే ప్రధానం కాదు ఆ పాత్రయొక్క భావస్వరూపాన్ని నటుడు విజయవంతంగా చిత్రించగలిగి ఉండాలి లేని పక్షంలో విగ్రహపుష్టి, నైవేద్యనష్టి అవుతుంది

చారిత్రక పురుషులపాత్రల విషయంలో ఉన్నంతగా కాకపోయినా మామూలు చిత్రాలలోకూడా పాత్రనిర్దేశం (*Casting*) అనేక సమస్యలతో కూడుకున్న విషయం అందులో నైపుణ్యం ఉంది పాత్ర నిర్దేశానికి కూడా ప్రవీణులుండాలి దానిపై చిత్రం విజయం కొంతవరకు ఆధారపడి ఉంటుంది

మన చిత్రాలలో పాత్ర నిర్దేశం బొత్తిగా శుద్ధిగా జరగకపోయినా నైపుణ్యంతో ఎంత మాత్రమూ జరగటంలేదు దీనికి అనేక కారణాలుంటూ వచ్చాయి మొట్టమొదట టాకీలు వచ్చినప్పుడు తెలుగు చిత్రాలు తీసినవారికి నటీనటులను ఎన్నుకొనే అవకాశమే లేకపోయింది "పాదుక"లో పద్నాలుగేళ్ల శ్రీరాముడి పాత్రను 40 ఏళ్ల వయసుగల యడవల్లి సూర్యనారాయణ ధరించాడు అట్లాగే ఈస్టిండియావారి "సావిత్రి"లో నాయికాపాత్ర ధరించటానికి రామతిలకాన్ని ఎన్నుకోవటంలోనూ, వేల్ పిక్చర్సువారి "సీతా కల్యాణం'లో రాముడి పాత్రకు మాష్టరు కళ్యాణిని ఎన్నుకోవటంలోనూ ఆచిత్రాలు నిర్మించినవారు నటుల అందచందాలు పాటించలేదు

"లవకుశ"లో సీత పాత్రకు సి. పుల్లయ్యగారు శ్రీరంజనిని తెచ్చినప్పుడు సినిమా ప్రపంచానికొక పెన్నిధి దొరికినట్టయింది శ్రీరంజని వయసులో ప్రౌఢే అయినా పూర్వపు తారలకన్న కొత్త అందంగా



పూటకూళ్లమ్మకూతురు చిచ్చుబుడ్డి రాజు శిష్యుడు చిచింద్రీకి ఇచ్చిన స్వాగతం

విజయావారి "పెళ్లి చేసిచూడు"లో గంగారత్నం, కుమారి గిరిజ, కుందూ, జోగారావు

ఉండి, అంతో ఇంతో పాడి, నటించగల ననిపించుకున్నది శ్రీరంజని చాలా చిత్రాలకు భిక్ష పెట్టింది అదేవిధంగా "మాయాబజారు"లో శాంతకుమారి రాక కూడా ఒక కొత్త "ఆశ" రేకెత్తించింది అటు తరవాత కాంచనమాల చరిచప్పుడూ లేకుండా సినిమాఆకాశాన ఉదయించి పైకి రావటమూ మళ్ళీ చరిచప్పుడూ లేకుండా దిగిపోవటమూ తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నమాట

నటులకూ పాత్రలకూ గల సంబంధం ఎంత సన్నిహితమైనదంటే శాంతకుమారి కాంచనమాల, పుష్పవల్లి, భానుమతి మొదలైన ఆడతారలూ సి యస్ ఆర్, వై వి రావు సి హెచ్ నారాయణ రావు, నాగయ్య మొదలైన మగతారలూ లేకుండా తెలుగులో సాంఘిక చిత్రాలు తీయటం సాధ్యమై ఉండేదికాదు పురాణ చిత్రాలలో విజయవంతంగా నటించిన మాధవపెద్ది, అద్దంకి, గగ్గయ్య మొదలైన నటులు సాంఘిక చిత్రాల రాకతో పూర్తిగా సినిమారంగంనుండి విరమించటమే దీనికి నిదర్శనం

జానపదచిత్రాలలో సంగీతానికిఎక్కువ ప్రాముఖ్యం ఉంటున్నది పురాణ చిత్రాలుగాని సాంఘికచిత్రాలుగాని జానపద చిత్రాలంతగా సంగీతంపై ఆధారపడలేదు జానపదచిత్రాలు రాకపూర్వం సంగీతదర్శకుడు పెద్దవారిలో జమకాదు కాంచనమాల పుష్పవల్లి కుమారి, మాలతి మొదలైనవాళ్ళు పెద్ద పాటగత్తెలు కాకపోయినా తమపాటలు తామే పాడుకొనేవారు బాగా పాడగల భానుమతి శాంతకుమారి, బాలసరస్వతి ఎస్ వరలక్ష్మి మొదలైనవారికి తారలుగా ప్రత్యేకాధిక్యత ఉండేదికాదు కాని జానపద చిత్రాలూ, వాటివెంట పాటలూ ప్రాముఖ్యానికి రావటంతో స్వంతాన పాడగల వారికి ప్రత్యేక ప్రాముఖ్యం వచ్చింది, దానితోబాటు అందచందాలు తక్కువై పాడేశక్తి హెచ్చుగాగల వాళ్లకి నేపథ్యాన ప్రాముఖ్యం హెచ్చింది ప్లేబాక్ ధర్మాన అంజలీ దేవివంటి అందగత్తెలూ, నటనా సామర్థ్యంగలవాళ్లూ జానపదచిత్రాలలో ప్రత్యేకస్థానం సంపాదించుకున్నారు ఒక వంక పాటకు ప్రాముఖ్యత హెచ్చుతున్నా మరోవంక పాడేశక్తి తారయొక్క ప్రధాన లక్షణాలలోనుంచి పూర్తిగా తొలగి పోయింది

పాత్రనిర్దేశానికి గల అవకాశాలు ఈ విధంగా మారుతూ, పెరుగుతూవచ్చాయి యువక పాత్రలు ధరించటానికి నాగేశ్వర రావు, ఎన్ టి రామారావు, శ్రీ రామ మూర్తి, రామశర్మ, జగ్గయ్య మొదలైన వారు రంగంలోకి వచ్చిఉన్నారు ఇంకా కొత్తవారు రాగలరు మధు, కుందు, రామ గోపాల్, కుమారిగిరిజ, మల్లిక మొదలైన బాల బాలికలు సినిమారంగంలోకి వచ్చి ఉన్నారు రేలంగి శివరావు, నల్ల రామమూర్తి జోగారావు సి యస్ ఆర్ మొదలైన హాస్యనటులున్నారు చిత్రాల సంఖ్య నానాటికీ హెచ్చుతున్నది ఇంకా కొత్త నటులు వస్తున్నారు అందుచేత ఈనాడు పాత్రకు తగ్గనటుల్ని ఏరుకొనే అవకాశం పూర్వం ఎన్నడూ లేనంతగా ఉన్నది దీనికి తోడు నటులలో చాలా మంది స్వతంత్రంగా ఒక్కొక్క ఎక్చరుకే కంట్రాక్టులు వ్రాసుకుంటూ అందరు ప్రొడ్యూసర్లకూ అందుబాటులో ఉంటున్నారు

ఇటువంటి పరిస్థితులలో కూడా పాత్ర నిర్దేశంలో లోపాలు జరుగుతున్నాయంటే అది కేవలం చిత్రనిర్మాతల పొరపాటే ననాలి అనేక చిత్రాలలో సరిఅయిన పాత్రచిత్రణే లేకపోయినప్పటికీ పొరపాట్లు కనిపిస్తూ ఉన్నాయి ఇట్లా జరగటానికిగల కారణాలలో ప్రధానమైనది బాక్సాఫీసును మనసులో ఉంచుకుని ప్రసిద్ధ స్త్రీపురుష తారలను బుక్ చెయ్యటమూ ఉన్నకథలో ప్రధాన పాత్రలు వారికి తగిలించటమూను రెండవ కారణం ప్రొడ్యూసర్లకు కొందరు నటీనటులపైగల ప్రత్యేకాభిమానాలు మూడో కారణం చిత్రనిర్మాణం కళ అన్న భావం నిర్మాతలకు లేక ప్రేక్షకులభావం పట్ల నీరసభావం ఉండటం నటీనటులే చిత్రనిర్మాణానికి పూనుకోవటంతో పాత్ర నిర్దేశం తాలూకు పొరపాట్లు మరింత హెచ్చుతున్నాయి

దీనిఫలితంగా మంచినటులుగా రాణించవలసిన కొదిమంది నటులు అప్పుడప్పుడూ దెబ్బతింటున్నారు ఉదాహరణకు సి యస్ ఆర్ చేత "విలన్" వేషాలు వేయిస్తున్నారు సి యస్ ఆర్ నిండైన నటుడే ఒకవిధమైన హాస్యాన్ని కూడా ఒప్పిస్తాడు కాని "విలన్' పాత్రలకు సరిపోడు అటువంటిపాత్రలు అతనికి తాత్కాలికంగా డబ్బుచేసిపెట్టినా కాలక్రమాన నష్టం కలిగిస్తాయి

నాగేశ్వరరావుకు సినిమాఆయుర్దాయం చాలా ఉంది ప్రస్తుతం మగ నటులలో చిన్నారుకొమ్మన ఉన్నప్పటికీ అతను



వర్మాఫిలిమ్స్‌వారి "సగాయ్,"లో విజయలక్ష్మి, ప్రేమ్‌నాథ్

ఎన్నేళ్ళపాటయినా సినిమారంగాన నిలబడి ఉండదగిననటుడు ప్రస్తుతంమటుకు అతన్ని "జూవెనైల్"గా భావించాలి ఇంకా కొంతకాలం రటు తేలిన తరవాత "కారెక్టర్ పార్ట్స్" వేయటానికి తయారవుతాడు అతను ధరించిన పాత్రలలో "పల్నాటియుద్ధం"లో బాలచంద్రుడూ, "బాలరాజు"లో బాలరాజూ, "సంసారం"లో వేణూలాంటిపాత్రలలో అతను బాగా రాణించగలిగాడు చిత్రనిర్మాతలు అటువంటిపాత్రలనే అతనికిస్తూవచ్చినట్టయితే అతనికింకా ప్రజాదరణ లభించిఉండేదనటానికి సందేహం లేదు

చిత్తూరు నాగయ్యకూ నాగేశ్వరరావుకూ కొద్దిపోలిక లేకపోలేదు నాగయ్యకుకూడా మొదటినుంచీ చాలా మంచిపేరు వచ్చింది కాని నాగయ్య తొలిచిత్రాలలో చూపిన నటనలో కొంత వెలితి ఉండేది ముఖ్యంగా బరువైనఘట్టాలలో ఆయన అభినయం తెచ్చిపెట్టుకున్నట్టుండేది నాగయ్య నటుడు కాక కాదు ఆయన అప్పుడు ధరించిన పాత్రలు ఆయనశక్తికి ఏమాత్రమో మించిఉండి ఉండాలి ఆ నాగయ్యే "భక్తపోతన"లో నటించేనాటికి బాగా తయారైనాడు రానురాను ఆయన నటనా, పాటాకూడా సినిమాకు చాలాబాగా సరిపోయాయి ఈపరిణామం అందుకున్నాకనే ఆయన "త్యాగయ్య," "వేమన" లాంటి చిరస్థాయిగల పాత్రలు ధరించే అవకాశం లభించింది నాగేశ్వరరావు ఇంకా అటువంటి పరిణామం అందుకోలేదు అందుకుంటాడని రూఢిగా చెప్పవచ్చు అంతదాకా అతను "జూవనైల్" పాత్రలు ధరించటం సబబుగా ఉంటుంది

ప్రతిచిత్రంలోనూ చిల్లరపాత్రధారులలో రామ్మూర్తి, సీతారాం, సురభి బాలసరస్వతి, కనకం మొదలైనవారిని కొందరిని ఉంచటం ఒక రివాజుగా పరిణమించింది రామ్మూర్తి సీతారాంలు అన్ని చిత్రాలలోనూ సమానమైన హాస్యం ఇవ్వటం లేదు "స్త్రీ సాహసం"లో వీరు ధరించిన పాత్రలు ఎవరు ధరించినా సరిపోయేదే హాస్యనటులుగా పేరుపడ్డవారిలో ఒక్క రేలంగి తప్ప మిగిలినవారంతా ఎప్పుడో ఒకప్పుడు హాస్యరహితమైన పాత్రలను ధరించినట్టే కనిపిస్తుంది ఎన్నిచిత్రాలలో నటించినప్పటికీ కనకం "షావుకారు" చిత్రంలోనూ, బాలసరస్వతి "మాయలమారి"లోనూ నటించిన పాత్రలే సినిమాప్రేక్షకుల హృదయాలలో నికరంగా నిలిచేవి

ఇంకో వెయ్యిమంది నటీనటులు సినిమారంగంలో ప్రవేశించినా, సినిమాచిత్రనిర్మాతలపైనా, నటీనటులపైనా డబ్బు శివతాండవం ఆడుతున్నంతకాలమూ పాత్రనిర్దేశంలో ఏవో పొరపాట్లు జరుగుతూ ఉంటాయనే భావించాలి సరి అయిన పాత్రలకు సరి అయిన నటులను జతపరచటానికున్న మార్గాలు రెండేరెండు కథ రాసుకుని అంగులోని పాత్రలకుసరిపోయిన నటులను ఎక్కడినుండి అయినాసరే తీసుకురావటం, లేదా, ఉన్ననటులకు పనికివచ్చే పాత్రలతో కథ తయారుచేసుకోవటం మన నిర్మాతలకు మొదటిది సమ్మతం కాదు, రెండవది సాధ్యం కాదు

★

రాజూ - పేదా

(31-వ పేజీ తరువాయి)

పడుతున్నట్టున్నారు. అదేదో చెప్పండి. ఈ క్షణంలో దాని కారణాన్ని నాశనంచేసేస్తాను. బహుశా ఆ బిచ్చగత్తె చేసిన పని మిమ్మల్నింకా బాధిస్తోందనుకుంటాను," అన్నాడు

టామ్ నూతిలోంచి మాట్లాడినట్టు హీనస్వరంతో, "ఆమె నా తల్లి," అన్నాడు.

"హరి దేవుడా!" అని నిర్ఘాంతపోయాడు హెర్ట్‌ఫర్డ్ ప్రభువు. "మళ్ళీ మహారాజును ఉన్మాదం ఆవహించింది ఏమిటి చెయ్యడం ఈ సమయంలో?"

(ఇంకా వుంది)

ప్రతిజ్ఞ

(35-వ పేజీ తరువాయి)

దేరారు ఆఖరికి వాళ్లు అడవిలో కుటీరంలో నిశ్చింతగా కూర్చుని ఉన్న వెన్నుంతరుడిని చూచి క్షమార్పణ చెప్పుకుని మళ్ళీ నగరానికి రమ్మని అనేకవిధముల వేడుకున్నారు. ఇంతలో ఇంద్రుడు అక్కడికి వచ్చి, తనే అనేక వేషాలతో ఇలాగ వెన్నుంతరుడిని పరీక్షచేశానని చెప్పి, తన రాజ్యానికిపోయి భార్యతోనూ, పిల్లలతోనూ సుఖంగా ఉండమని చెప్పాడు వెన్నుంతరుడితోటి

వెన్నుంతరుడు తన నగరం వచ్చాడు. ప్రజలంతా ఆనందంతో అతనికి స్వాగతం ఇచ్చారు. అతని తల్లితండ్రులూ, భార్యా, పిల్లలూ చాలా సంతోషించారు తను ముసలివాడు అయినందున రాజు వెన్నుంతరుడికి పట్టాభిషేకం చేసి తను తపస్సు చేసుకోడానికని వెళ్లిపోయాడు అంతటినించీ వెన్నుంతరుడు రాజు అయినాడు అతను తనుకూడా ప్రజలలో ఒకడూలాగా జీవిస్తూ, బీదరికమూ బాధా అనేవి లేకుండా చేసి ప్రజలకి అనేక విధముల సేవచేస్తూ ఉండేవాడు. ★

వెస్సంతర జాతకం

(32-వ పేజీ తరువాయి)

"దేమో ప్రయత్నించిచూడు" అని ఒకనాడు అతనికి ఒక స్నేహితుడు సలహా ఇచ్చాడు. ఆ ఆలోచన అతనికి నచ్చింది తాను రాసిన "కవిత్వ లక్షణసారము" అనే సంస్కృతలక్షణ గ్రంథం, "శుద్ధాంధ్ర హరిశ్చంద్రోపాఖ్యానము" అనే ఆంధ్రకావ్యమూ ఆనారయ భూపతికి అంకితమిస్తే తన దరిద్రం తీరిపోతుందని సంతోషపడి, మంచి రోజు చూసుకుని బయలుదేరి, రెండు మజిలీలలో రాజమహేంద్రవరం చేరుకున్నాడు

వెళ్లడం అంటే వెళ్లేడుకాని, ఈ నిరుపేదకు ఆమహారాజు దర్శనం అవుతుందా? రాజసభాభవనం చుట్టూ మోకాళ్ల వరకూ అరిగిపోయేలాగ మూడు నెలలు విధీ విరామం లేకుండా తిరిగేడు అప్పటికీ రాజుగారు కనబడకుండా నల్లపూస అయిపోయారు

"విస్సన్న" అనే ఒక నియోగి బ్రాహ్మడు ఆనారయ భూపతి దగ్గర ఆస్థానపండితుడుగాఉన్నాడు అతనికి పాండిత్యం తక్కువయినా ఆడంబరం మాత్రం ఎక్కువ "సాలివాంద్ర సభామధ్యే, స్వా-తానీః పండితోత్తమః" అన్నట్లు అక్కడి అల్లులలో కొందరికీ ఈమల్లు పెద్ద అయాడు. భుక్కుండుడు విస్సన్నని ఆశ్రయించి, తన గోడుఅంతా చెప్పుకుని, తానురాసిన పుస్తకాలు రాజుకి అంకితం ఇప్పించాలని చెప్పాడు. ఆ పుస్తకాలు రెండూ ఒకసారి చదివి ఇస్తానని పుచ్చుకున్నాడు విస్సన్న.

ఆపుస్తకాల ముందు తన పాండిత్యం దిగదుడుపుకి కూడా పనికిరాదని విస్సన్న గ్రహించేడు. రాజు కనక ఈ కావ్యాలను చూస్తే విశేష గౌరవమర్యాదలు భుక్కుండుడికి దక్కుతాయనీ, అతనిముందు తాను దివిటీ ముందు దీపంలాగ అయిపోతానని విస్సన్నకి భయం వేసింది. ఆ రెండు కావ్యాలూ ఆ రోజునే రహస్యంగా అగ్నిహోత్రుడి పరం అయిపోయాయి భుక్కుండుడు మళ్ళీవచ్చి అడిగితే నాలుగైదుసార్లు తిప్పి తిప్పి, ఆఖరికి పుస్తకాలను ఎవరో ఎత్తుకుపోయారని చెప్పేడు ఆమాటలు వినేటప్పటికి భుక్కుండుడికి దారుణపు కోపం వచ్చేసింది దక్షయజ్ఞంలో శివుడులాగ భయంకర రూపంతో తాండవించిపోయాడు అప్పుడే అటోఇటో తేలిపోయేదే కాని విస్సన్నగారి సేవకులు భుక్కుండుడిని జబ్బలు పుచ్చుకుని బయటికి గెంటేశారు ఈ విస్సిగాడి పని పట్టించకపోతే నేను బ్రాహ్మణ్ణి కాదని ప్రతిజ్ఞ చేసి భుక్కుండుడు రౌద్రాకారంతో వెళ్లి పోయాడు- అప్పునుమరి నాలుగు సంవత్సరాలు అహోరాత్రాలూ కష్టపడి, నలుగురూ భేషు మనేటట్లు రాసి, ప్రాణంతో సమానంగా చూసుకుంటూ, వాటివల్ల తనకు ఎంతో కీర్తి వస్తుందని కొండంత ఆశపెట్టుకున్న వాడికి ఆ రెండు గ్రంథాలూ ఒక్కసారిగా నాశనమై పోయాయంటే ఎంత బాధగా ఉంటుంది? ఇల్లా జరుగుతుందని తెలుస్తే దరిద్రంతో చచ్చిపోనేనా పోతాడు కాని తన పుస్తకాలను వదిలిపెట్టేవాడా? ఆబాధ పుస్తకాలు రాసిన వాడికి తెలుస్తుంది

ఆనాడు శ్రావణశుద్ధ విదియ. చంద్రుడు ఉదయించడంఅస్తమించడంకూడా ఎప్పుడో అయిపోయింది. ఆకాశం అంతా మబ్బుపట్టిఉంది. కొంచెం తుంపర పడుతోంది. విస్సన్న తనగదిలో ముసుగుతన్ని గుర్రుపెట్టి పడుక్కున్నాడు మిణుకు మిణుకుమంటూ ఒక ఆముదపు దీపంగదిలో వెలుగుతోంది

రాత్రి రెండు జాములైంది. ఎవరోమనిషి పిల్లిలాగ ఎలిసెలలో నుంచి కిందికి దిగేడు పుల్లతో దీపంవత్తి ఎగసనదోశాడు చేతిలో మూరెడు పొడుగు కైజారు తళతళ లాడుతోంది ఆ వచ్చినవాడు విస్సన్నని తట్టి లేపాడు ఆయన కళ్లునులుముకుంటూ,విసుగుగా లేచి కూర్చున్నాడు తాను భుక్కుండుడి

ననీ, తనకు చేసిన ద్రోహానికి ఇదే తగినశిక్ష అంటూ కైజారు బలం కొద్దీ విస్సన్న డొక్కలో కస్సుమని దిగవేసేశాడు ఆ మనిషి. "అయ్యోయ్" అని విస్సన్న పెద్ద బొబ్బపెట్టి విరుచుకు పడిపోయాడు. భుక్కుండుడు ఇంకా కసితీరక తన శత్రువుని చేతికందిన వోటల్లా పొడిచేశాడు. ఎవరో పదిమంది మనుష్యులు తనచేతులు పట్టుకొనే దాకా తాను ఏం చేస్తున్నాడో భుక్కుండుడికి తెలియలేదు. చుట్టు పక్కల ఇళ్లవాళ్లంతా భుక్కుండుడిని పట్టుకుని, కాళ్లూ చేతులూ కట్టేసి, కోటలో పడవేశారు

ఆరోజు రాత్రే భట్టి, భారవి, భిక్షుడు, భీమసేనుడు అనే నలుగురు మనుష్యులు, నారయ భూపాలుడిని చంపడానికి తయారయి, పని జరగకముందే రాజభటులకి పట్టుబడి పోయారు మరునాడు రాజు విచారణచేసి, ఆ నలుగురికీ, భుక్కుండుడికీ కూడా ఉరిశిక్ష వేశాడు దాని ప్రకారమే ఆ నలుగురూ మొట్ట మొదట నడివీధిలో చెట్టుకి వేలాడదీసి, ఉరితీయబడ్డారు ఇంక భుక్కుండుడి వంతు వచ్చింది ఉరిత్రాటి దగ్గర బల్లమీద నిలబడ్డాడు ఊరు ఊరంతా చోద్యం మాడడానికి వచ్చింది తలారి యములాడిలాగ నిలబడి ఉన్నాడు.

అందరినీ అడిగినట్లుగానే "ప్రాణదానంతప్ప ఏం కావాలో కోరుకో" అన్నాడు తలారి. భుక్కుండుడు ఒక్కక్షణం ఆలోచించి "ఒక్కమారు నారయ భూపతితో మాట్లాడాలి" అన్నాడు.

నారయభూపతి అంగరక్షకులతో వచ్చి, తలారికి కనుసంజ్ఞ చేశాడు. "ఏం చెప్పదలుచుకున్నావో చెప్పుకో" అన్నాడు తలారి.

సంస్కృతంలో అసమానమైన పాండిత్యం ఉన్న భుక్కుండుడు రాజువైపు తిరిగి ఈక్రింది శ్లోకాన్ని ఆశువుగా చదివేడు.

"భట్టిర్నష్టో భారవీయోపి నష్టః
భిక్షుర్నష్టో భీమసేనోపి నష్టః
భుక్కుండోహం భూపతిస్త్వంహి
రాజన్
భబ్భావళ్యా మంతిక స్సన్నివిష్టః॥

దానిఅర్థం ఏమిటో తెలుసా? "ఓరాజా! భ, భా, భి, భీ" అనే అక్షరాలు మొదటగల భట్టి, భారవి భిక్షుడు, భీమసేనుడు అనే మనుషులు వరసగా చచ్చిపోయారు కదా. నేను "భు" అనే అక్షరం మొదటగల భుక్కుండుడిని. వాళ్ల తరవాత ఇదిగో నేను చచ్చిపోతున్నాను "భు" తరువాత "భూ" అనే అక్షరం మొదలుగల భూపతివి నువ్వు కనుక నా తరువాత నీపని ఏమవుతుందో చూసుకో యమధర్మరాజు "భ" గుణింతంలో ప్రవేశించాడు అని అర్థం.

నారయభూపాలుడు నిర్విణ్ణుడయి పోయాడు ఒళ్లు గజగజావణికి పోయింది కాళ్లు తేలిపోయాయి. ఈ భుక్కుండుణ్ణి చంపేస్తే ఇంకేమైనా ఉందా? వాడి తరువాత యముడు తనపేరులో ప్రవేశిస్తాడని విపరీతమైన భయం పట్టుకుంది తరువాత కాస్తసేపటికి సంబాళించుకుని, ఉరి ఆపివెయ్యమని ఆజ్ఞ ఇచ్చేడు.

తన ప్రతిజ్ఞ నెరవేరినందుకు భుక్కుండుడు ఒక వెఱ్ఱినవ్వు నవ్వేడు సంస్కృతం తెలిసిన పండితులు తలలూపేరు తెలియని సామాన్య ప్రజలు ఇంతలో ఏమి వచ్చి, ఉరి ఆపుచేశారు చెప్మా అని ముక్కుమీద వేలేసుకున్నారు. ★

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(7-వ పేజీ తరువాయి)

మైన మూర్ఛవచ్చి చచ్చిపోయింది మూర్ఛ అనేది కోళ్లకి ఎన్నడూ రాదు మనుష్యులకే వస్తుంది"

హిలాయ్‌విల్‌ఫర్ట్ దీర్ఘ యోచనలో పడింది "నిజంగా ఇటువంటి విషాల్ని రసాయనిక నిపుణులే తయారు చెయ్యగలగడం అదృష్టమే లేకపోతే లోకమంతా ఒకరికొకరు విషప్రయోగం చేసుకునేవారే అయితే విషప్రయోగ మనేది నేరం, పాపం ఈ నేరం న్యాయాధికారుల దృష్టినుంచి తప్పించుకున్నా భగవంతుని దృష్టిలో పాపంగానే ఉండిపోతుంది"

"నిజం మీవంటివారికి ఈ దైవభీతి మేలే కాని తూర్పు దేశాలలో వారి పద్ధతి వేరు కత్తితో పొడిచి నెత్తు రోడ్చడం కాని, పాషాణం పెట్టి యమయాతనలు పెట్టడంకాని సామాన్యంగా మానవులకు హితవుకాదు అందువల్లనే తూర్పు దేశాలవారు శత్రువుల్ని రక్తం ఓడ్చకుండా యాతన పెట్టకుండా ఈ లోకంనుంచి తొలగిస్తారు వారి విషప్రయోగంవల్ల శత్రువులు బాధపడరు సామాన్య రోగాలవల్లనే చనిపోయినట్లు అందరూ భావిస్తారు"

"అయినా అంతఃకరణ అనేది ఉందికదా?" అంది హిలాయ్ ఈమారు ఆమె కంఠస్వరంలో ఉద్వేగం వ్యక్తమౌతోంది

"అవును అదే లేకపోతే లోకం ఎంత భీభత్సంగా ఉంటుంది! అదే మనల్ని అనేక పాపాలనుంచి కాపాడుతుంది అయినా చరిత్రలో అనేకమందిని గురించి చదువుతాం ఒకామె తన భర్తకు రాజ్యాధికార మిప్పించడంకోసం అనేక హత్యలు చేయించింది ఒకామె తన కొడుక్కి రాజ్య మిప్పించడానికి తానే హత్య చేసింది వీరిని అంతఃకరణ కాని దైవభీతి, కాని నిరోధించలేదు"

ఈ వింత ప్రసంగానికి హిలాయ్ విల్‌ఫర్ట్ చకితురాలయింది "నిజంగా మీది పాషాణ హృదయం కౌంట్ ప్రపంచాన్ని నిరాసక్తతతో మీరు పరిశీలించగలరు మీరు అద్భుత రసాయన శాస్త్రజ్ఞులుకూడా. ఆ రోజున నా కుమారునికి మీరు ఆ దివ్యౌషధం వాసన చూపకపోతే"

"అదేముంది లెండి ఒక్క చుక్క కాబట్టి మీ కుమారునికి చైతన్యం తెచ్చింది కాని మూడుచుక్కలు పడితే ఘాటుకి గిలగిలలాడే వాడే ఆరు చుక్కలతో ఊపిరి నిలిచిపోతుంది పదిచుక్కలు పడితే తక్షణం ప్రాణాలు అంతరిస్తాయి ఎడ్వర్డ్ ఆ సీసాని తీసుకున్నప్పుడు నేను ఒక్క ఉదుటునవచ్చి అది లాక్కున్నాను మీకు జ్ఞాపకముందా?"

"అది అంతటి ఘోర విషమా?"

"కాదు"

"మరేమిటి?"

"నా మిత్రుడుచేసి నా కిచ్చిన దివ్యౌషధం దాని ప్రయోగంకూడా నాకు నేర్పాడు"

"ఓ! అది అద్భుతమైన ఔషధమై ఉండాలి"

"అవును అది నేను తరుచు వాడుతూ ఉంటాను కాని అతి జాగ్రత్తగా వాడతాను"

"దీనివల్ల మూర్ఛ, బలహీనత మొదలైనవి తగ్గుతాయా?"

"ప్రత్యేకంగా ఔషధం తయారు చేయించాలి"

"నా దగ్గిర కొన్ని మూలికల చూర్ణం ఉంది ప్రస్తుతానికి వీటితోనే తృప్తిపడతాను ఒకసారి చూడండి"

హిలాయ్ విల్‌ఫర్ట్ ఒక చిన్న భరిణతీసి మూత తెరిచి మాంట్ క్రిస్టో చేతికి అందించింది మాంట్ క్రిస్టో అది పరిశీలించి, "చాల బాగుంది" అన్నాడు "అయితే దీన్ని మరింత చూర్ణంచేసి పరిశుద్ధం చెయ్యాలి"

"అవును అయితే ఇదంతా పరమరహస్యం"

"తప్పకుండా "అయితే ఇది మాత్రం మరిచిపోకండి ఇది చిన్న మోతాదైతేనే చికిత్సౌషధం మోతాదు మించితే విషం"

"మీ స్నేహానికి కృతజ్ఞురాలిని ఈ పూట మీరు మా యింటివద్దనే భోజనాని కుండిపోవాలి"

"కాని నాకు ఇతర ప్రాపనులున్నాయి ఒక యువతిని నాటక ప్రదర్శనాలయానికి తీసుకు వెడతానని వాగ్దానమిచ్చాను"

"అయితే సరే"

మాంట్ క్రిస్టో వెళ్లిన తరవాత హిలాయ్ విల్‌ఫర్ట్ చాలసేపు యోచనలో నిమగ్నురాలై కూచుంది "చాలచిత్రమైనవ్యక్తి" అనుకుంది "ఆరసాయనిక శాస్త్రజ్ఞుడెవరో కాదు అతనే"

మాంట్ క్రిస్టో వెడుతూ తనలో ఇలా అనుకున్నాడు "బాగుంది ఇది సుక్షేత్రం బీజం పడింది ఇంక విషవృక్షం పెరుగుతుంది" ★

డైరీ

(4-వ పేజీ తరువాయి)

శనివారం, ఆగష్టు 18:

—ఎన్నికలలో ప్రజాపార్టీ కమ్యూనిస్టు పార్టీతో చేతులు కలపబోవడం లేదని ఆచార్య కృపలానీ అన్నారు

—పర్షియా నూనె సమస్యపై తాము చేయవలసిందంతా చేశామని, ఇక కొత్త ప్రతి పాదనలను చేయబోవడం లేదని బ్రిటిష్ప్రతినిధి రిచర్డు స్టోక్సు పర్షియాకు ఖచ్చితంగా చెప్పాడు

—గత అక్టోబరులో చైనీస్ అధ్యక్షుడు మావ్ సేటుంగ్‌ను హత్యచేయడానికి చాంకైషేక్ ప్రభుత్వపు అమెరికన్ మిలిటరీ సలహాదారు కర్నల్ బారెట్ కుట్ర పన్నినట్లు పెకింగ్ రేడియో ఆరోపించింది అమెరికన్ విదేశాంగ శాఖ దీన్ని ఖండించింది

—క్షామనిరుగ ఉన్న ప్రాంతాల్లో ఆరుఔన్సులు, పల్లె ప్రాంతాల్లో 2 ఔన్సులు ఇవ్వడానికి తగిన బియ్యం నిల్వలు మద్రాసు ప్రభుత్వంవద్ద ఉన్నాయని కేంద్ర ఆహారమంత్రి మున్షీ ప్రకటించారు

—కిసాన్ మజూర్ ప్రజాపార్టీ తమిళనాడు శాఖ ప్రథమసమావేశాన్ని ఆచార్య కృపలానీ ప్రారంభించారు

—ఖర్గపూర్‌లో భారతీయ టెక్నాలజీ విద్యాలయాన్ని కేంద్ర విద్యామంత్రి మౌలానా ఆజాద్ తెరిచారు

— ప్ర [illegible] గా [illegible] ము

మంత్రి గోపాలస్వామి అయ్యంగార్‌ను కలుసుకుని చర్చించారు ★

Key Solution of 106

A A B B B A B A A B

Key Solution of 107

నిలువు 1 సమాపనము, 2 భాండము, 8 గాలిగాడు, 6 పరివేత్త, 9 రేవెలుగు, 1(సువర్ణ 11 నదడు, 12 మార్జారము, 14 చింతామణి, 17, గండడు, 19 కాయ

అడ్డము 1 సరస్వతి, 2 భాండాగారము, 4 గెడ, 5 పశుపతి, 7 గాయని 8 రిరక్షు, 9 రేడు, 11 నత్త, 13 నాస 14 చిందము, 15 గున్న, 16 చీరము 18 పీనము 20 గాయకుడు

Home of Competitions,
KAKINADA (S India)

సత్యనారాయణ వ్రతం

(8-వ పేజీ తరువాయి)

సీనిగాడిలో ఈమార్పు మోహనరావుని మరీ కలవరపరిచింది ఒకప్పుడతను వాడిని చూసుకుని గర్వపడ్డాడు వాడు ముద్దుగా మాట్లాడినప్పుడు, వాడు క్లాసులో మొదటగా పాసయినప్పుడు, అంతా తన శిక్షణ ప్రభావమేనని సంతోషించాడు ఇప్పుడు వాడు బండగా మారినప్పుడు, తన చెయ్యి దానిలో వుందని ఆమోదించే ధైర్యం లేకపోయిందతనికి

సీనిగాడిని దార్లో పెట్టడానికి మోహనరావెన్నివిధాలైనా ప్రయత్నించాడు కాని వాడిలో చెప్పుకోదగ్గ మార్పేమీ కనిపించలేదు ఈవాళ కార్లో సోఫాలు కత్తిరించడం మానేస్తే రేపు డ్రాయింగు రూములోవి కత్తిరించేవాడు, ఈవాళ తమ్ముళ్ళని కొట్టడం మానేస్తే రేపు పనిమనుషులని కొట్టేవాడు వీడితో ఏంచెయ్యాలో తెలియక బాధపడుతున్న మోహనరావుకి భార్య పూర్వపువిషయం ఒకటి జ్ఞాపకం చేసింది నాలుగయిదేళ్ళ క్రితం సీనుకి - అప్పుడు వాడికి ఏడెనిమిదేళ్లుంటాయేమో - పెద్ద జబ్బుచేసి ప్రాణాలమీదకొచ్చింది జబ్బు తగ్గి పిల్లాడు కులాసాగా వుంటే సత్యనారాయణవ్రతం చేస్తానని మొక్కుకుంది తల్లి సీను జబ్బుతగ్గింది కాని వ్రతం చెయ్యడం పడలేదు దానికి ముఖ్య కారణం మొక్కు సంగతి భర్తతో చెప్పడానికి సీనుతల్లి జంకింది దానికితోడు సీను జబ్బుతగ్గిన పదిరోజులకే బదిలీఅయిపోయి మోహనరావు కుటుంబాన్ని తీసుకుని ఉత్తరదేశం వెళ్లిపోయాడు మళ్లీ సత్యనారాయణస్వామిని తలుచుకునే అవసరం కలగకపోవడంవల్ల ఇంటియిల్లాలు కూడా ఆ విషయం మర్చిపోయిందనే చెప్పొచ్చు అప్పటికిప్పుడు ఆవిడకా పాతవిషయం జ్ఞాపకం వచ్చింది స్వామి కాగ్రహం వొచ్చిఉంటుందనీ, అందువల్లనే పండంటి పిల్లాడికిటువంటి బుద్ధులు పుడుతున్నాయనీ వాపోయిందావిడ

మోహనరావు వ్రతానికి ఎలా ఒప్పుకోగలిగాడో నాకిప్పటికీ అర్థంకాదు దేవుడిపేరు విన్నప్పుడతను చేసే రభస నాకనుభవం వుంది కాపురానికి వచ్చిన కొత్తలో భార్యని ముప్పతిప్పలూ పెట్టాడు ఆవిడ ఆచారంగల కుటుంబంలో పుట్టడంవల్ల మొదటినుంచీ పూజాపునస్కారాలకి అలవాటు పడివుంది అటువంటి మనిషిని అకస్మాత్తుగా, పెళ్ళయిన తక్షణం, ఆ అలవాట్లు మరిచిపో అంటే ఎలా సాధ్యమవుతుంది? కొంచెం ఓపికపట్టవయ్యా నెమ్మదిమీద ఆవిడే నిన్ననుసరించిపోతుందన్నాను దానికి శిక్షగా మూఢనమ్మకాలమీద పెద్దప్రసంగం వినవలసివచ్చింది అతని దృష్టిలో చిన్నపిల్లలకీ తల్లిదండ్రులకీ మధ్యవుండే సంబంధానికీ, పెద్దవాళ్ళకీ, దేవుడికీ మధ్య వుండే సంబంధానికీ తేడా ఏమీ లేదు చిన్నపిల్లలు చేతకాని సమయంలో తల్లితండ్రుల అండజేరడానికి ప్రయత్నిస్తారు, పెద్దవాళ్లు క్లిష్టసమయాల్లో దేవుడి అండజేరడానికి ప్రయత్నిస్తారు తల్లితండ్రులు సర్వజ్ఞులనీ, వాళ్లు చెయ్యలేని పనిలేదనీ చిన్నపిల్లల నమ్మకం దేవుడు సర్వజ్ఞుడనీ అతను చెయ్యలేని పనిలేదనీ పెద్దవాళ్ల నమ్మకం, తల్లితండ్రుల కిష్టమైన పనిచేస్తేనేకాని వాళ్ళ ప్రేమ లభించదని చిన్నపిల్లల అభిప్రాయం, దేవుడికిష్టమైన పనులు చేస్తేనేకాని అతని ఆశ్రయం లభించదని పెద్దవాళ్ళ అభిప్రాయం చిన్నపిల్లలలో అవయవబలం లేకపోవడంవల్ల దానిని ఊహా కందనంతగా తల్లిదండ్రులలో ఆపాదించుకుని వాళ్ళ సహాయం తమకుందిగదా అని తృప్తిపడతారు, పెద్దవాళ్ళలో నైతికబలం చాలక, దానిని ఊహాకందనంతగా దేవుడిలో ఆపాదించుకుని అతని సహాయం తమకుందిగదా అని తృప్తిపడతారు నిజానికి చిన్నపిల్లలు తల్లితండ్రులలో చూచే గుణాలూ, పెద్దవాళ్లు దేవుడిలో చూచే గుణాలూ కూడా వాళ్లు కల్పించుకున్నవే అయినా కల్పనల్ని వాళ్లు నిజాలుగా నమ్ముతారు నమ్మనినాడు వాళ్ళకి జీవితంలో విశ్వాసం నశించిపోతుంది ఇది ముప్పాతిక మూడ వంతుల జనానికి వర్తిస్తుంది తక్కిన ఒకవంతూ మాత్రమే చిన్నతనంలో ఊహాలతో కట్టుకున్న ఈ గూళ్ళనుంచి బయటపడగలుగుతారు తన భార్య ఆ నాలుగోవంతుకి చెందాలని మోహనరావు ఆశ మరి ఇన్ని భావాలున్నవాడివి మొదటే పిల్ల ఎటువంటిదో చూసి చేసుకోలేకపోయావా అని అడిగాను మనదేశంలో తన అభిప్రాయాలున్న పిల్లలు వెదికినా కనిపించరనీ పెళ్ళయిన తరవాత బాగుచేసుకోవలసిందేననీ జవాబిచ్చాడు అయితే భార్యని మార్చడమతనికి పూర్తిగా సాధ్యం కాలేదు బాహాటంగా ఆవిడ భర్త నెదిరించకపోయినా చాటుమాటుగా పూజలు సాగించడం మాత్రం మానలేదు చేసేదిలేక, మూర్ఖురాలనీ, తను పట్టిన కుందేలికి మూడే కాళ్లంటుందనీ అనుకుని సమాధానపడేవాడు మోహనరావు అతని ధోరణి వింటున్నప్పుడు నాకొక అనుమానం కలుగుతూండేది చిన్నతనంనుంచి తనలో జీర్ణించిపోయిన సంస్కారాన్ని విడిచిపెట్టలేదని ఆవిడని మూర్ఖురాలని తిడుతున్నాడే, నడివయస్సులో తనకి కలిగిన నమ్మకాలని ఆవిడమీద రుద్దడానికి ప్రయత్నించినప్పుడు తను మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాడని అతనికనిపిస్తుందా అని


ఆ రోజుబలమనండి, పిల్లాడు బాగుపడతాడంటే ఏం చెయ్యడానికైనా మోహనరావు సిద్ధపడ్డాడనండి, ఎంత రాద్ధాంతం చేసి అయితేనే అతను వ్రతం చెయ్యడానికి ఒప్పుకున్నాడు సీనిగాడు మాత్రం దాన్ని జయప్రదంగా సాగనియ్యలేదు పురోహితుడికి పెట్టిన దక్షిణ డబ్బులు దొంగతనం చేశాడు ఏంరా ఇటువంటి పని చేశావంటే కామెరా కొనుక్కోడానికన్నాడు నిజానికి వాడు చేసినపనికి నేనంత ఆశ్చర్యపోలేదు కుర్రవెధవకి కామెరామీద మనసు పోయింది. ఎంత అడిగినా కొనిపెట్టకపోతే చేతి కందిన డబ్బు దొబ్బక ఏంచేస్తాడు? కొంచెం మందలిస్తే పోయేదానికి తల్లిదండ్రు లిద్దరూ కూడా మనసులు పాడుచేసుకుని కూర్చున్నారు దేవుడికి మహాపచారం జరిగిందని తల్లిగోల పక్కఊళ్లో సత్యనారాయణస్వామిగుడి వుంది వెంటనే పిల్లాడిని అక్కడికి పంపించి శాంతి చేయిస్తేగాని కీడు పోదని పట్టుపట్టి కూర్చుందావిడ. మోహనరావు ససేమిరా వీల్లే దన్నాడు. దేవుడికి జరిగిన అపచారం అతన్ని బాధపెట్టలేదు తన సంతానం పైవాళ్ళముందు కించపడింది ఇంతకాలం ఊళ్ళోవాళ్లకి తన పిల్లలమీద మంచి అభిప్రాయం దానికి

కారణం తను కుర్రాళ్ల కిచ్చిన శిక్షణ ఉన్నట్టుండి ఇప్పుడీ వెధవ ఇటువంటి పని చేశాడు పురోహితుడి మూలంగా ఊరంతా పాకిపోతుం దీ వార్త అతని ఒంటిమీద తేళ్లూ జెర్రులూ పాకినట్టయింది ఆవాళ అతను సీనిగాడిని కొట్టిన దెబ్బలు అన్నీ యిన్నీ కాదు పిల్లాడిని గుడికి పంపాలని అడ్డుపడ్డ తల్లిని సహితం కొట్టే డా కోపంలో ఈసారి గుడికి పంపడంమాట ఎత్తితే తల్లినీ పిల్లాడినీ కూడా ఇంట్లోనుంచి గెంటేస్తా నన్నాడు


ఆ రాత్రి సీనుకి కొంచెం జ్వరం తగల డంతో వాడి తల్లి మనస్సు పరిపరి విధాలా పోయింది ఆవిడకి చిన్నతనపు రోజులు జ్ఞాపకానికి వచ్చాయి తను పెద్దమనిషి అయిన కొత్తలో ఊరంతా అమ్మవారు పోసేసింది. అందరూ ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని శక్తికి జాతర చేయించారు ఒక్క నారాయణమాత్రం వీటిల్లో తనకి నమ్మకంలేదని పట్నంలో డాక్టరుచేత ఇంటిల్లిపాదికీ విరుగుడుమందు ఇప్పించాడు అమ్మవారికి ఆగ్రహం వచ్చి అయిదోనాడే నారాయణ పెదకొడుకుని పొట్టన పెట్టుకుంది చాకలి సీతాయి బ్రతుకుకూడా అలాగే అయింది పాపం చాకలిపేటలో వెంకటేశ్వరఆలయం కడుతూ వాడినీ కొద్దో గొప్పో ఇమ్మని అడిగారు తిండికి లేందే ఆలయా లేవిటి? దేవుడూ లేడు గీవుడూ లేడు పొమ్మన్నాడు వాడు రెండేళ్లు తిరక్కముందే వాడి తల్లీ, పెళ్లాం యిద్దరూ పోయారు

ఎప్పుడూ లేంది ఆనాడు మొగుడితో దెబ్బలాటపెట్టుకుని కూర్చుం దావిడ ఇంతకుముందు దన్నోసార్లు మోహనరావు ఆవిడ నమ్మకాల మీద దాడి తీశాడు, ఆవిడకి పవిత్రమైన వాటిని నీచపరిచాడు అయినా ఆవి డింత కష్ట పెట్టుకోలేదు కాని ఇప్పుడు కొడుకు క్షేమానికీ తన నమ్మకాలకీ ఏదో సంబంధం కనిపించిం దావిడకి ఆవిడ వాదంలో బల మంతా వినికిడి కథలమీదనే ఆధారపడి వున్నప్పటికీ, దానిలో ఆవిడ కున్న విశ్వాసం నేను చూడగలిగాను మోహన రావు మాత్రం ఆవిడ బాధని అర్థంచేసుకో లేకపోయాడు దేవుడిని హేళన చెయ్య డానికి అతని కింకొక అవకాశం చిక్కి నట్టయింది కుర్రాడికి ఒళ్ళు అలవడంవల్ల తగిలిన స్వల్పజ్వరానికి ఇవన్నీ ఊహిం చుకు కూర్చోడం మతాన్ని నల్లమందులాగ ఉపయోగించుకునే తన భార్యలాంటి అస మర్థుల లక్షణం అన్నాడు దీనికితోడు ఇంకొక సవాలుకూడా చేశాడు తను భార్య చెప్పిన కథలన్నీ నిజాలే అయితే గుడికి వెళ్ళనందుకు దేవుడు సీనుగాడి జ్వరం తగ్గనియ్యకూడదన్నాడు


సీను జ్వరం మర్నాటికి తగ్గకపోగా మరీ ఎక్కువైపోయింది జాగ్రత్తగా వుండా లన్నాడు డాక్టరు మోహనరావుకి ఎన్నో సందేహాలు కలిగాయి దేవుడు కాని దేవుడి స్థానంలో మానవాతీతమైన ఒక శక్తి గాని లేకుంటే జీవితానికర్థమే లేదనిపించి అత నికి భయంవేసింది వెంటనే సీనుని గుడికి తీసుకువెళతానని కూర్చున్నాడు ఇంత జ్వరంలో పిల్లాడిని కదపడం భాగ్యం కాదయ్యా అంటే వినకుండా కారుకి కబురుచేశాడు ఏక్సిలు విరిగిపోయిందని బదులుగా జవాబిచ్చాడు డ్రైవరు క్రితం రోజు సీనూ తల్లీ సత్యనారాయణస్వామి గుడికి వెళ్ళివస్తూండగా దార్లో కారు ఏక్సిలు విరిగిపోయిందట! ★



Edited Printed & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press 7 Thambu Chetty St Madras



రష్యాలో యాస్నయా పోల్యానా పార్కులో భారతీయ సాంస్కృతిక ప్రతినిధివర్గం



స్వాతంత్ర్యదినం నాడు ఐలెండ్ గ్రౌండ్స (మదరాసు)లో జరిగిన పెరేడుకు హాజరవుతున్న
మద్రాసు గవర్నరు, ప్రధాని గవర్నరుభార్య పెరేడు సందర్శించిన పౌరులు


RAJA
SNOW
"RAJA"
"SNOW"
MANYAM & CO
RAJA
HAIROIL
RAJA
Kasturi Soap
RAJA
MANYAM & CO
RAJA
రాజా
స్నో, హేర్ఆయిల్
కస్తూరిసోపు, హేర్ ఫిక్సర్
FAS
Use RAJA Face Powder & RAJA TOOTH Paste
RAJA
(TRADE MARK)
AGARBATHI
2 TOLAS
MANUFACTURERS:
MANYAM & CO.,
BANGALORE.3.